సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 324

మంగళవారం 14-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



సతీ భూదేవి..

జైలు నుంచి భర్తను విడిపించుకోవడానికి 14 ఏళ్లు పోరాడింది భూదేవి.


-11లో



కొనసాగిన నష్టాలు

సెన్సెక్స్ నష్టం 251 పాయింట్లు.. 17,800 దిగువకు నిఫ్టీ

-13లో



మార్చి 13 నుంచి మలివిడత..

పార్లమెంటు ఉభయ సభల రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 13నుంచి ప్రారంభం కానున్నాయి.

- వివరాలు 6లో▶



హిండెన్‌బర్గ్ నివేదికపై కమిటీకి ఓకే..

స్టాక్ మార్కెట్‌లో మోసాలను అరికట్టడానికి నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్న సుప్రీం సూచనకు కేంద్రం అంగీకరించింది.

- వివరాలు 6లో▶



భూకంప మృతులు 35,000..

తుర్కియే, సిరియాలో వారం క్రితం సంభవించిన భారీ భూకంపంలో ఇప్పటిదాకా 35,000 మందిపైగా మరణించారు.

- వివరాలు 6లో▶



రష్యా నుంచి తక్షణమే వచ్చేయండి..

రష్యాలో ఉంటున్న తమ పౌరులు వెనక్కి వచ్చేయాలని అమెరికా కోరింది. అక్రమ నిర్బంధాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపింది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

రేపు కొండగట్టుకు సీఎం



ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్నారు. ఆలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న అంశంపై ప్రత్యక్షంగా దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

- వివరాలు 14లో▶


చేను తడవాలంటే జాగారమే



వేళాపాళా లేని వ్యవసాయ విద్యుత్ సరఫరా రైతులను అవస్థలపాలు చేస్తోంది. ఒక్కో జిల్లాలో ఒక్కో తీరుగా.. అర్ధరాత్రి వేళల్లోనే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపడి.. కోతలు ఇక లేనట్లేనని భావించిన సమయంలో అనూహ్యంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో రైతులు మళ్లీ రాత్రి వేళల్లో పొలంబాట పట్టాల్సి వస్తోంది.

- వివరాలు 2లో▶

చూచిరాతలో మనోళ్లు చురుకే..



సంప్రదాయానికి భిన్నంగా పుస్తకాలు చూసి పరీక్షలు రాసేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ప్రయోగాత్మకంగా అనుమతించింది. పరీక్షకు సంబంధించిన ఫలితాలు తాజాగా వెల్లడవ్వగా 59 శాతం ఉత్తీర్ణులు కావడం గమనార్హం.

- వివరాలు 3లో▶

వేసవి మంటలు?

ఈసారి అసాధారణ ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం

అమెరికా వాతావరణ పరిశోధన సంస్థ ప్రాథమిక అంచనా



ఎల్ నినో పరిస్థితులు ఏర్పడేందుకు చాన్స్..

అదే జరిగితే వేసవి ఉష్ణోగ్రతలు పైపైకి.. రుతుపవనాలపైనా ప్రభావం

సాక్షి, హైదరాబాద్: చలి తగ్గింది. మధ్యాహ్నం ఎండ.. అప్పుడే వేసవి వచ్చిందా? అన్నట్టుగా ఉంటోంది. ఈసారి ఎండలు మండిపోతాయా? అని కూడా అన్పిస్తోంది. అమెరికా వాతావరణ పరిశోధన సంస్థ జనవరి అంచనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలు మోత మోగిపోతాయని వెల్లడించడం ఆందోళన కలిగించే అంశం. వాస్తవానికి తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు.. దేశం మొత్తమ్మీద గత మూడేళ్లలో వర్షాలకు ఏమాత్రం కొదవ లేకుండా పోయింది. అదే సమయంలో వేసవిలో విపరీతమైన వడగాడ్పులు వీచాయి. కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో గత ఏడాది శీతాకాలం చలి వణికించింది. వాతావరణంలో వస్తున్న మార్పులకు ఇవన్నీ తార్కాణాలే. కాగా నాలుగేళ్ల విరామం తరువాత ఈ ఏడాది వేసవి సమయంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడవచ్చని, ఎండలు అసాధారణంగా ఉండే అవకాశం ఉందని అమెరికా పరిశోధకులు స్పష్టం చేశారు.


లా నినా నుంచి ఎల్ నినో వైపు?

అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌ఓఏఏ) ఈ ఏడాది వాతావరణంపై గత నెలలో ప్రాథమిక అంచనాలను వెలువరించింది. దాని ప్రకారం ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టుల్లో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడేందుకు యాభై శాతం అవకాశం ఉండగా.. జూలై మొదలుకొని సెప్టెంబర్ వరకు ఏర్పడేందుకు 58 శాతం అవకాశాలున్నాయి. అదే జరిగితే నైరుతి రుతుపవనాలు దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. పసిఫిక్ మహా సముద్రంలో భూమధ్య రేఖ చుట్టుపక్కల సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడాన్ని ఎల్ నినో అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గితే అది లా నినా అవుతుంది. కాగా దేశంలో గత మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు కారణమైన లా నినా పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఎల్ నినో ఏర్పడేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. అయితే కచ్చితంగా ఇలాగే జరుగుతుందని ఇప్పుడే చెప్పలేమని.. రానున్న మూడు నాలుగు నెలల్లో పరిస్థితులు మారినా మారవచ్చని వీరు అంటుండటం ఊరటనిచ్చే అంశం. ఎన్‌ఓఏఏ మాదిరిగానే భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) కూడా ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలే ఎక్కువని

మిగతా 10వ పేజీలో ▶



సోమవారం బెంగళూరులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కాంప్లెక్స్‌లో జరిగిన వైమానిక ప్రదర్శనలో విన్యాసాలు చేస్తున్న సూర్యకిరణ్ యుద్ధవిమానాలు..



ఆసక్తిగా తిలకిస్తున్న ప్రధాని మోదీ

75 దేశాలకు.. రక్షణ పరికరాలు

5 బిలియన్ డాలర్లు ఎగుమతుల లక్ష్యం

100 దేశాలు రక్షణ మంత్రుల హాజరు

75,000 కోట్లు పెట్టుబడులు

250 ఒప్పందాలు

(ఐదు రోజుల పాటు జరిగే 'ఏరో ఇండియా'లో ఈ మేరకు ఒప్పందాలు కుదురుతాయని, దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని అంచనా)

రక్షణ రంగంలో మేటిగా భారత్

ఉత్పత్తుల తయారీలో అగ్రగామిగా ఎదుగుతున్నాం

బెంగళూరు ఏరో-ఇండియా షోలో ప్రధాని మోదీ

6లో

పొత్తు ఉండాలంటే సీట్లు ఇవ్వాల్సిందే..

బీఆర్‌ఎస్‌కు సీపీఐ, సీపీఎం స్పష్టీకరణ.. తమను తక్కువగా అంచనా వేయొద్దని సూచన

- బీఆర్‌ఎస్‌ను పలుచోట్ల ఓడించే దమ్ముందని నేతల వ్యాఖ్య
- అధికార పార్టీని చెరో 5–10 సీట్లు కోరాలని యోచన
- కుదరకుంటే 2 ఎమ్మెల్యే, 2 ఎమ్మెల్సీల చొప్పున కేటాయించేలా ఒప్పందానికి పట్టు!
- కోరుతున్న సీట్ల జాబితాలో భద్రాచలం, కొత్తగూడెం?
- నేడు లెఫ్ట్ పార్టీల కీలక సమావేశం



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండాలంటే ఆ పార్టీ తమకు గౌరవప్రదమైన సీట్లు కేటాయించాలని సీపీఐ, సీపీఎం స్పష్టం చేస్తున్నాయి. సీట్లు కేటాయిస్తేనే పొత్తు ఉంటుందని లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించుకోవాల్సి వస్తుందని చెబుతున్నాయి. 'మాతో పొత్తు, సీట్ల కేటాయింపునకు సంబంధించి ఇటీవల కొందరు బీఆర్‌ఎస్ నేతలు కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. సీపీఐ, సీపీఎంలకు అసెంబ్లీలో సీట్లు కేటాయించబోమని, కేవలం చెరో ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తామంటున్నారు. ఇది బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశం మేరకు చేస్తున్న వ్యాఖ్యలుగా మేము అనుకోవట్లేదు. అయితే ఒకవేళ అలాంటి ఆలోచన బీఆర్‌ఎస్ అధిష్టానానికి ఉంటే మాత్రం ఒకసారి పునరాలోచించుకోవాలి. లేకుంటే మేము ప్రత్యామ్నాయ ఆలోచన చేయాల్సి ఉంటుంది'అని లెఫ్ట్ పార్టీలకు చెందిన ఒక నేత వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు, ఇతరత్రా అంశాలపై సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం సహా ఆ పార్టీలకు చెందిన ఇతర రాష్ట్ర సీనియర్ నేతలు మంగళవారం భేటీ కానున్నారు. ఈ భేటీలో పలు నిర్ణయాలు తీసుకొనే అవకాశముంది.

గెలిచే సత్తా లేకున్నా ఓడించే దమ్ముంది...

బీజేపీ ప్రధాన శత్రువుగా ముందుకు సాగాలన్నది సీపీఐ, సీపీఎంల ప్రధాన వైఖరి. కేంద్రంలో, రాష్ట్రంలోనూ బీజేపీకి బ్రేక్

మిగతా 2వ పేజీలో ▶

రూ.2,83,452 కోట్లు రాష్ట్ర నికర అప్పు

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

- కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం
- 2014 జూన్ 2 నాటికి రూ. 75,577 కోట్లుగా ఉన్న తెలంగాణ రుణాలు
- ఆ తర్వాత ఏటేటా పెరిగిన రుణభారం
- 2016–17లో రూ. లక్ష కోట్ల మార్కు... 2019–20లో రూ. 2 లక్షల కోట్లు దాటిన రుణాలు
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో అధికంగా రూ. 39,433 కోట్ల అప్పులు
- బ్యాంకులు, నాబార్డు ద్వారా కార్పొరేషన్లకు రుణాల మొత్తం రూ. 2.14 లక్షల కోట్లపైనే



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అప్పులు నికరంగా 2,83,452 కోట్లు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014 జూన్ 2 నాటికి రూ.75,577 కోట్లుగా ఉన్న రుణాలు ఏటేటా పెరుగుతూ రూ.2.83 లక్షల కోట్లకు చేరాయని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పు, వివిధ ప్రభుత్వరంగ కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు,

మిగతా 10వ పేజీలో ▶

స్మృతి సూపర్ హిట్

డబ్ల్యూపీఎల్ వేలంలో భారత వైస్ కెప్టెన్‌కు అత్యధిక మొత్తం

బీసీసీఐ తొలిసారి నిర్వహించబోతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మొదటి అంకమైన ప్లేయర్ల వేలం ఘనంగా ముగిసింది. మొత్తం 448 మంది వేలంలోకి రాగా... ఐదు జట్లలోకి కలిపి మొత్తం 87 మంది ఎంపికయ్యారు. వీరిలో 57 మంది భారత క్రికెటర్లు. స్మృతి మంధానకు అత్యధిక మొత్తం దక్కింది. తెలంగాణ నుంచి అరుంధతి రెడ్డి, యషశ్రీలకు, ఆంధ్రప్రదేశ్ నుంచి అంజలి శర్వాణి, సబ్బినేని మేఘన, వి.స్నేహ దీప్తి, షబ్నమ్‌లకు డబ్ల్యూపీఎల్‌లో అవకాశం దక్కింది.

12లో



స్మృతి మంధాన
రూ. 3.40 కోట్లు
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

ఆష్లే గార్డ్‌నర్
రూ. 3.20 కోట్లు
గుజరాత్ జెయింట్స్



నటాలీ సీవర్
రూ. 3.20 కోట్లు
ముంబై ఇండియన్స్



దీప్తి శర్మ
రూ. 2.60 కోట్లు
యూపీ వారియర్స్



జెమిమా రోడ్రిగ్స్
రూ. 2.20 కోట్లు
ఢిల్లీ క్యాపిటల్స్





నువ్వున్నావ్‌గా! ఇల్లు ఊడ్చుదానికి, వంట చేయదానికి, బట్టలు ఉతకదానికి.. పనిమనుషుల్ని పెట్టుకుంటే నా జీతం కూడా సరిపోదు..

రూ.60,000 కోట్లు!


తెలంగాణ ఏర్పాటయ్యాక వచ్చిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

రిజిస్ట్రేషన్ల రాబడి అంతకంతకూ పైకే..
ఏటా పెరుగుతున్న భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ లావాదేవీలు
2021-22లో అత్యధికంగా 19.88 లక్షల లావాదేవీలు..
రూ.12 వేల కోట్లకు పైగా ఆదాయం
ఈ ఏడాది జనవరి నాటికే రూ.12 వేల కోట్ల రాబడి
అదే 2014-15లో 8.26 లక్షల లావాదేవీలు.. ఆదాయం రూ.2,707 కోట్లే
ఎనిమిదేళ్లలో గణనీయంగా పెరిగిన లావాదేవీలు, ఆదాయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటైన ఏడాదిలో..అంటే ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వానికి వచ్చిన రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.2,707 కోట్లు. కానీ ఈ ఏడాది జనవరి వరకు..ఏకంగా రూ.12,000 కోట్లు సమకూరింది. రాష్ట్రంలో రోజురోజుకూ విస్తృతమవుతున్న రియల్ ఎస్టేట్ లావాదేవీలు, వ్యవసాయ భూముల క్రయ విక్రయాల నేపథ్యంలో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది. కరోనా లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత బాగా ఊపందుకున్న రిజిస్ట్రేషన్ లావాదేవీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సవరించిన భూముల మార్కెట్ విలువలు, పెంచిన స్టాంప్ డ్యూటీ కారణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఖజానా కళకళలాడుతోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 19.88 లక్షల లావాదేవీలు జరగ్గా, రూ.12 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో జనవరి 31 నాటికి 16.03 లక్షల లావాదేవీలు జరగ్గా, రూ.11,928 కోట్ల ఆదాయం సమకూరినట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.8,600 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది

మిగతా 3వ పేజీలో ▶

2014-15 నుంచి రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయ వివరాలు..



(నోట్: 2022-23 గణాంకాలు 2023 జనవరి 31 వరకు మాత్రమే..)

ధరణి పోర్టల్‌కు 10.23 కోట్ల హిట్లు

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం 2020 నవంబర్ 2 నుంచి అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్‌కు ఇప్పటివరకు 10.23 కోట్ల హిట్లు వచ్చినట్టు (వీక్షించినట్లు) ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 29.67 కోట్ల భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరిగాయని, తద్వారా రూ.4,741.65 కోట్ల ఆదాయం సమకూరిందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెల్లడించింది.

రాజీనామాకు తొందరెందుకు?

- ఏడెనిమిది నెలల్లో ఎలాగూ చేయాల్సిందే
- సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- దేశ ఆర్థిక పరిస్థితిపై ఎక్కడైనా సరే చర్చకు సిద్ధమని సవాల్



సాక్షి, న్యూఢిల్లీ: రాజీనామా చేసేందుకు అంత తొందరెందుకని తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మరో ఏడెనిమిది నెలల్లో ఎన్నికల్లో ఓడిపోయాక ఎలాగూ గవర్నర్‌కు రాజీనామా సమర్పించక తప్పదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి, కల్వకుంట్ల కుటుంబానికి ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడాన్ని, బీజేపీని ప్రజలు ఆదరిస్తుండటాన్ని కేసీఆర్ తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి మాటల్లో నిరాశ, నిస్పృహ, నిర్వేదం స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల గురించి, జీడీపీ గురించి అసత్యాలు, అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తున్న కేసీఆర్.. వాస్తవ పరిస్థితులపై చర్చించేందుకు ముందుకు రావాలని సవాల్

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఎస్టీ జాబితాలో కులాలను చేర్చే నిర్ణయంపై నిరసన

20న ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడి

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వాల్మీకి బోయ, ఖాయితీ లంబాడాలతో పాటు మరికొన్ని కులాలను షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) జాబితాలో చేరుస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటనతో పాటు అసెంబ్లీ తీర్మానంపై ఆదివాసీ తుడుందెబ్బ నిరసన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది తెగల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయకపోగా, మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై తీవ్ర అన్యాయం జరుగుతోందని తుడుందెబ్బ ఆరోపిస్తోంది. ఎస్టీ జాబితాలోంచి లంబాడాలను తొలగించాలని ఓ వైపు తాము డిమాండ్ చేస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం కోసం ఇలాంటి చర్యలకు దిగడం సబబుకాదని అంటున్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 20న ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించారు.

నర్సాపూర్ బల్దియాలోనూ అవిశ్వాస నోటీసు

మెదక్‌జోన్: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌పై అవిశ్వాసం ప్రకటించాలంటూ కౌన్సిలర్లు మెదక్ కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం నోటీసు అందజేశారు. మురళీ యాదవ్ మూడు నెలల కిందట ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్‌లో బీసీలను ఎదగనీయడం లేదని, ముందు నుంచి ఉన్న వారికి సరైన ప్రాధాన్యం లేదంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ మరునాడే మురళీయాదవ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా, వైస్‌చైర్మన్ సహా 8 మంది.. చైర్మన్‌ను పదవి నుంచి దింపేందుకు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. చైర్మన్‌కు అనుకూలంగా ఐదుగురు కౌన్సిలర్లు ఉన్నారు.

తిరస్కరించిన ఎమ్మెల్సీ ఓటర్లకు మళ్లీ అవకాశం




సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో...మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో తిరస్కరించిన 1440 మంది ఓటర్ల దరఖాస్తులను ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్వో) పునః పరిశీలించి అందులో 788 దరఖాస్తులు సరైనవేనని నిర్ధారించారు. దీంతో అర్హులైన ఈ ఓటర్లకు అనుబంధ ఓటర్ల జాబితాలో చోటు కల్పిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం ప్రకటించారు. గత డిసెంబర్ 31న మొత్తం 29,501 మంది ఓటర్లతో తుది ఓటర్ల జాబితాను వెల్లడించారు. ఆ తర్వాత కూడా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం కొనసాగించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23 నుంచి ఈ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావాల్సి ఉండగా, అందుకు 10 రోజుల ముందు... సోమవారం వరకు ఓటర్ల నమోదు అవకాశం కల్పించారు. మరో 1131 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించామని, వీటిని పరిష్కరించి అనుబంధ ఓటర్ల జాబితాను త్వరలో వెల్లడిస్తామని ఓ ప్రకటనలో వికాస్‌రాజ్ తెలిపారు.

'కాళేశ్వరంపై చర్చకు రావాలి'

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో 33 ప్రాజెక్టులు చేపట్టామని, దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు రావాలని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సవాల్ విసిరారు. సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి నుంచి ఇప్పటికైనా ఒక్క చుక్క నీరైనా వాడుకునే పరిస్థితి ఉందా? అని నిలదీశారు. బడ్జెట్ సమావేశాలు అత్యంత తక్కువ రోజులు ఎందుకు నడిపారో సీఎం కేసీఆర్ చెప్పాలని పొన్నాల డిమాండ్ చేశారు. మొన్నటి వరకు బీజేపీతోనే కలిసి ఉండి.. బీజేపీ చేసే పనులు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా బీజేపీని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం పొందుతుంది కాబట్టే కాంగ్రెస్ గురించి కేసీఆర్ మాట్లాడుతున్నారని పొన్నాల వ్యాఖ్యానించారు.

పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాలు

సాక్షి, న్యూఢిల్లీ




- ప్రసాద్ పథకంలో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో భద్రాచలం అభివృద్ధికి రూ.41.38 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి రూ.62 కోట్లు కేటాయించామని కేంద్ర పర్యాటక శాఖమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులకు అడ్మినిస్ట్రేటివ్ మంజూరు గతేడాది డిసెంబర్ 22న జరిగిందని బీఆర్ఎస్ ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.
- 2022–23 ఆర్థిక సంవత్సరంలో సమగ్ర శిక్ష పథకానికి కేంద్ర వాటాగా ఇప్పటివరకు తెలంగాణకు రూ.479.94 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.867.40 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. 2021–22 సంవత్సరంలో తెలంగాణలో ప్రాథమిక స్థాయిలో డ్రాప్ ఔట్ ఏమాత్రం లేదని, సెకండరీ స్థాయిలో డ్రాప్‌ఔట్ రేటు 13.7 ఉందని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రాత్రి పూట బోరు స్టార్టర్‌ను ఆన్ చేస్తున్న ఈ రైతు పేరు వాసర యాదమల్లు. సిద్దిపేట జిల్లా నంగునూరు.



నాలుగున్నర ఎకరాల్లో వరి, నువ్వు పంటలు వేశాడు. కొన్ని రోజులుగా వేళాపాళా లేని కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. రాత్రి 10 గంటల తర్వాత త్రీఫేజ్ కరెంట్ సరఫరా అవుతుండటంతో రాత్రంతా చేనువద్దే జాగారం చేస్తున్నాడు.



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లిలో త్రీఫేజ్ విద్యుత్ కోసం పొలంలో నిద్రిస్తున్న రైతులు

ఈ రైతు పేరు ఇజ్జగిరి నారాయణ. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండ నాగారం.



రెండెకరాల పొలం ఉంది. కరెంటు కష్టాలతో ఎకరం పొలంలో శ్రీ పద్ధతిలో వరి సాగు చేశాడు. విద్యుత్ నిరంతరాయంగా 10 గంటలు వచ్చే పరిస్థితి లేదు. పదినిమిషాలకోసారి పోవడం.. రావడం జరుగుతోంది. దీంతో స్టార్టర్లు కాలిపోయి పొలానికి నీరు అందడం లేదని, వారం రోజులుగా రాత్రి పూట బావి వద్దనే పడుకుంటున్నానని చెబుతున్నాడు.

వేళాపాళా లేని సరఫరాతో సాగు ఎలా?



కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటంతో రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది.

–గుడవర్తి నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

చేను తడవాలంటే జాగారమే..

వేళాపాళా లేని కరెంట్ కోతలతో రైతుల ఇబ్బందులు ● రాత్రిపూటనే సరఫరా అవుతున్న త్రీఫేజ్ విద్యుత్

రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం ● తరచూ ట్రిప్పవుతున్న కరెంట్ సరఫరా



టార్చిలైట్ ఆధారంగా...

కరెంటు సరఫరాను నమ్ముకుని మొక్కజొన్న 3 ఎకరాలు, మిర్చి 3 ఎకరాలు, వరి 4 ఎకరాల్లో సాగు చేస్తున్నా. విద్యుత్ కోతల వల్ల అర్ధరాత్రి వరకు పొలాల వద్ద పడిగాపులు కాస్తున్నా. చిమ్మ చీకట్లో ఏమీ కనిపించకపోవడంతో టార్చిలైట్ ఆధారంగా పొలాలకు నీళ్లు కట్టుకుంటున్నా. 24 గంటలూ విద్యుత్ సరఫరా చేస్తే తప్ప ఇబ్బందులు తొలగవు.

–కొచ్చెర్ల నాగేశ్వరరావు, రైతు, అనంతనగర్, ఖమ్మం జిల్లా

సాక్షి ప్రతినిధి, వరంగల్

వేళాపాళా లేని వ్యవసాయ విద్యుత్ సరఫరా రైతులను అవస్థలపాలు చేస్తోంది. ఒక్కో జిల్లాలో ఒక్కో తీరుగా.. అర్ధరాత్రి వేళల్లోనే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపడి.. కోతలు ఇక లేనట్లేనని భావించిన సమయంలో అనూహ్యంగా వినియోగం పెరిగిపోయింది. దీంతో ఒక్కో జిల్లాలో ఒక్కోవిధంగా విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటచేలను తడుపుకునేందుకు రైతులు మళ్లీ రాత్రి వేళల్లో పొలంబాట పట్టాల్సి వస్తోంది. రాత్రిపూట బావులు, బోర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అక్కడే పడుకుంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు మండలాల్లో రాత్రిపూట 'సాక్షి బృందం' నిర్వహించిన గ్రౌండ్ రిపోర్టులో అనేక అంశాలు వెలుగు చూశాయి.

వ్యవసాయ రంగానికి ఉచితంగా 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే పథకం అమలు తర్వాత రికార్డుస్థాయిలో విద్యుత్తు కనెక్షన్లు పెరిగాయి. 2014లో 18.4 లక్షలున్న వ్యవసాయ కరెంటు కనెక్షన్లు 2023 జనవరి నాటికి 27.10 లక్షలకు పెరిగాయి. అంటే 9 లక్షల కనెక్షన్లు పెరిగాయి. అన్ని రం

పెరిగిన కనెక్షన్లు

గాల్లో కలిపి రాష్ట్రంలో 2014లో కోటీ 16 లక్షల కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం కోటీ 80 లక్షలకు పెరిగింది. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, డిమాండ్ తగ్గట్టుగా సరఫరా లేక ఈ యాసంగిలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్కో జిల్లాలో ఒక్కో తీరు...

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో డిస్కం పరిధిలో ఒక్కో జిల్లాలో.. ఒక్కోలా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వరంగల్, జనగామ, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో మండలానికో తీరుగా సరఫరా వేళలు అమలవుతున్నాయి. ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో సుమారు 21 మండలాల్లో మడులు తడిపేందుకు రాత్రిళ్లు బావులు, బోర్ల వద్ద నిద్ర తప్పడం లేదని రైతులు అంటున్నారు. విద్యుత్ కోతలపై విపక్షాలు అసెంబ్లీలో గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వం ఈ నెల 11 నుంచి వ్యవసాయానికి 16 నుంచి 18 గంటల పాటు త్రీఫేజ్ సరఫరా చేస్తోంది. ఎన్పీడీసీఎల్ పరిధిలో రెండు రోజులుగా రోజూ రాత్రి 11.45 గంటల నుంచి మరునాడు సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 12 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 6.15 గంటల వరకు త్రీ ఫేజ్ సరఫరా చేస్తున్నారు. దీంతో పరిస్థితి కొంత మెరుగైనట్లు ఎన్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నంగా ఉంది. రైతులు రాత్రిళ్లు పొలాల వద్ద ఉండే పరిస్థితే అత్యధిక ప్రాంతాల్లో ఉంది.



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో కరెంట్ కొరతతో ఎండిన వరి చేలు

రాష్ట్రంలో యాసంగి సాగు (ఎకరాల్లో)	
మొత్తం సాగు అంచనా	47,85,513
సాగైన విస్తీర్ణం	63,79,661
వరి సాగు అంచనా	33,53,921
సాగైన వరి	48,86,071

విద్యుత్ వినియోగం వారం రోజులుగా రికార్డుస్థాయిలో పెరిగింది. రాష్ట్రంలో ఈనెల 13న రాత్రి 8 గంటల వరకు 14,091 మెగావాట్ల వినియోగం జరిగింది. గతేడాది ఇదే తేదీన రాత్రి 8.42 గంటల వరకు 11,300 మెగావాట్లుగా ఉంది. డిస్కంల వారీగా చూస్తే ఎస్పీడీసీఎల్ పరిధిలో గతేడాది ఫిబ్రవరి 13న రాత్రి 9.44 గంటల వరకు 7,014 మెగావాట్లు ఉండగా, సోమవారం రాత్రి 8 గంటల వరకు

రికార్డు స్థాయిలో వినియోగం

8,791 మెగావాట్ల వినియోగం ఉంది. అదేవిధంగా ఎన్పీడీసీఎల్‌లో గతేడాది వినియోగం 4,094 మెగావాట్లయితే, ప్రస్తుతం 4,990 మెగావాట్లకు చేరింది. రాష్ట్రంలో ఈ నెల 11న మధ్యాహ్నం వరకు విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో ఏకంగా 14,649 మెగావాట్లకు పెరగడం గమనార్హం. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఏకంగా 17 వేల మెగావాట్లకు చేరుకునే అవకాశముందని ఎస్పీడీసీఎల్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు.

రాజీనామాకు తొందరెందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

విసిరారు. అయితే గౌరవప్రదమైన భాషలో మాట్లాడతానంటేనే తాను చర్చకు వస్తానని అన్నారు. చర్చల కోసం ప్రెస్‌క్లబ్ అయినా, అసెంబ్లీ ముందున్న అమరవీరుల స్తూపమైనా సరే తాను సిద్ధమేనని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

కేంద్రంపై బురద జల్లడమే ఏకైక టార్గెట్

'రాష్ట్రం కోసం కల్వకుంట్ల కుటుంబం ఏం చేసిందో చెప్పుకోకుండా.. బీజేపీని, మోదీని తిట్టేందుకు వేదికగా, ఒక పొలిటికల్ సమావేశంగా అసెంబ్లీని మార్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లడమే ఏకైక టార్గెట్‌గా సమావేశాలు నిర్వహించారు. కేసీఆర్ ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం. మొన్నటి వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలను అద్భుతమంటూ కీర్తించిన నోటితోనే.. ఇవాళ కాంగ్రెస్ పాట పాడుతున్నారు. మొన్నటి వరకు కమ్యూనిస్టులను తిట్టిన తిట్టు తిట్టని కేసీఆర్, ఇప్పుడు వారిని ఆహా.. ఓహో అంటూ పొగుడుతున్నారు. కేసీఆర్ జతకట్టని పార్టీ ఏదైనా ఉందా..?' అంటూ కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌తో జట్టు కట్టే ఆలోచనలో..

'తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేసిన కేసీఆర్.. శాసనసభలోనూ ఆ పార్టీ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించకుండా తన పార్టీలోకి లాక్కున్నారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌తో జతకట్టే ఆలోచనలో సీఎం కేసీఆర్ ఉన్నారు. మన్మోహన్ సింగ్ సర్కారును, ఇందిరాగాంధీ పాలనను పొగుడుతూ అసెంబ్లీలో వ్యాఖ్యలు చేయడం ఇందుకు నిదర్శనం. యూపీఏ హయాంలో దేశం అవినీతి కోరల్లో చిక్కుకుపోతే.. ఆ పాలనను ప్రశంసిస్తూ కేసీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం. ఆర్థిక వృద్ధిరేటు, తలసరి ఆదాయంపై కూడా పచ్చి అబద్ధాలు మాట్లాడారు. భారత్‌ను బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, సింగపూర్ దేశాలతో పోల్చడం కేసీఆర్‌కు ఉన్న అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టింది. ఏ ఆర్థికవేత్తకు కూడా అర్థంకాని రీతిలో, ఎటువంటి ఆధారాలు లేకుండా దేశ ఆర్థిక వ్యవస్థపై పచ్చి అబద్ధాలు మాట్లాడారు. దేశాన్ని బద్నామ్ చేసేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నం ప్రజలకు అర్థమవుతోంది..' అని కిషన్‌రెడ్డి చెప్పారు. 'హైదరాబాద్, రంగారెడ్డిలో తలసరి ఆదాయం ఎంత? ఆసిఫాబాద్ కొమురం భీమ్ జిల్లాలో ఎంత?' అనే విషయాన్ని కూడా సీఎం చెబితే ప్రజలు స్వాగతిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్నట్లుగా అప్పులు చేసి కమీషన్లు కొట్టేసే ప్రభుత్వం కేంద్రంలో లేదని అన్నారు. తెలంగాణలో అప్పులు, కమీషన్ల పేరుతో వేలకోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

పొత్తు ఉండాలంటే సీట్లు ఇవ్వాల్సిందే..

▶ మొదటి పేజీ తరువాయి

వేసేందుకు అవసరమైన వ్యూహం రచించేలా ఆ పార్టీలు ముందుకు సాగుతున్నాయి. బీజేపీని ఓడించే సత్తా ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకోవాలని భావిస్తున్నాయి. అందులో భాగంగానే గతేడాది మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు సీపీఐ, సీపీఎంలు మద్దతిచ్చాయి. ఉమ్మడిగా ప్రచారం నిర్వహించాయి. అయితే రానున్న ఎన్నికల్లో తమకు ఒంటరిగా పోటీ చేసి గెలిచే సత్తా లేకపోయినా విడిగా పోటీ చేసి బీఆర్ఎస్‌ను కొన్నిచోట్ల ఓడించే దమ్ము మాత్రం ఉందని ఆయా పార్టీల నేతలు అంటున్నారు. తమను తక్కువగా అంచనా వేస్తే బీఆర్ఎస్‌కే నష్టమని ఓ సీనియర్ నేత కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. బీజేపీకి చెక్ పెట్టాలంటే



తమకు గౌరవప్రదమైన సీట్లు ఇవ్వాల్సిందేనని చెబుతున్నారు. మరోవైపు ఇరు పార్టీలు పరస్పరం అభ్యర్థులను పోటీకి నిలపొద్దని సీపీఐ, సీపీఎం ఒక నిర్ణయానికి రానున్నాయి. పరస్పర ఐక్యత, బీఆర్ఎస్‌తో పొత్తుపై మంగళవారం సమావేశంలో నేతలు ప్రాథమికంగా ఒక అంచనాకు రానున్నారు.

ఎన్ని సీట్లు అడుగుదాం?

పొత్తుల విషయంలో ఒకవేళ బీఆర్ఎస్‌తో చర్చించాల్సి వస్తే ఎన్ని సీట్లు అడగాలనే అంశంపైనా సీపీఐ, సీపీఎంలు ఈ సమావేశంలో ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చే అవకాశముంది. చెరో 10 సీట్లు అడగాలని, కనీసం చెరో 5 ఇచ్చేలా అయినా ఒప్పందం చేసుకోవాలన్న ఆలోచనగా ఉంది. ఒకవేళ అదీ సాధ్యం కాకుంటే చివరకు చెరో రెండు అసెంబ్లీ స్థానాలు కోరడంతోపాటు ఇరు పార్టీలు ఒక్కొక్కటి చొప్పున ఎమ్మెల్సీ సీట్లు అయినా సాధించాలని నేతలు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. సీపీఐ కొత్తగూడెం స్థానాన్ని, సీపీఎం భద్రాచలం సీటును తప్పనిసరిగా అడిగే అవకాశమున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు ఇబ్బంది లేకుండా, తమ పార్టీలు బలంగా ఉన్న నియోజకవర్గాలను సీపీఐ, సీపీఎంలు గుర్తిస్తున్నాయి.

ఎన్‌హెచ్ 65ను 6 లేన్లుగా మార్చండి

ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–విజయవాడ మధ్య జాతీయ రహదారి 65ను వెంటనే ఆరులేన్ల రహదారిగా మార్చాలని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీకే చెందిన మరో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను ఇప్పటికే అనేకసార్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని సోమవారం ఉత్తమ్ లోక్‌సభలో గుర్తు చేశారు. ఆరు లేన్ల రహదారిగా మార్చేందుకు అవసరమైన భూసేకరణ సైతం పూర్తయిందని, ప్రాజెక్టును వేగవంతం చేసేలా పనులు ప్రారంభించాలని కోరారు. 'ఆదర్శ స్టేషన్ల పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ల సుందరీకరణ–ఆధునికీకరణ'పై వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డప్ప ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుపై జరిగిన చర్చలో కూడా ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 93 ప్రకారం ర్యాపిడ్ రైల్ కనెక్టివిటీని 2024లోగా ప్రారంభించాలని ఉన్నప్పటికీ ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి– నకిరేకల్–సూర్యాపేట–కోదాడ మీదుగా విజయవాడకు హైస్పీడ్ రైల్ కనెక్టివిటీ కోసం రైల్వేమంత్రిని పలుసార్లు కోరామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఎన్‌హెచ్ 65 వెంట అవసరమైన భూసేకరణ సైతం పూర్తయిందని, కొత్తగా భూసేకరణ అవసరం లేదని చెప్పారు. అందువల్ల హైదరాబాద్ నుంచి కోదాడ మీదుగా విజయవాడకు డైరెక్ట్ రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కోరారు.

ఏ సెంటర్‌కైనా రెడీ

కాళ్లూ చేతులు ఎలా విరుస్తావో చూస్తా

- కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్
- కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేస్తానని ఆయన మాటతప్పారని మండిపాటు
- దళితుడిని బీఆర్ఎస్ అధ్యక్షుడిగా చేసే దమ్ముందా? అని సూటిప్రశ్న
- మణుగూరు, అశ్వాపురంలో 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్ర



మణుగూరులో రేవంత్‌తో ఎమ్మెల్యే సీతక్క తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'ప్రగతి భవన్ పేల్చేయాలి అన్నోళ్ల కాళ్లూ చేతులు విరిచేస్తానంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడారు. నా కాళ్లూ చేతులు ఎలా విరుస్తారో చూస్తా? ఏ సెంటర్‌కు రమ్మంటావో చెప్పు.. అమరవీరుల స్తూపం, మేడారం, అసెంబ్లీ, యాదాద్రి ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. నువ్వు ఏం చేస్తావో చూస్తా' అంటూ సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. తాను మాట పడే మనిషిని కాదన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం మణుగూరు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్ పార్టీలో టీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత మాట మర్చారని విమర్శించారు. నోట్ల రద్దు సహా అనేక అంశాల్లో మోదీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ఇప్పుడు మోదీ కంటే నాటి మన్మోహన్‌సింగ్ పాలనే బాగుందని చెబుతున్నారని, ఇలా ఎటు పడితే అటు మాట్లాడే మనిషి కేసీఆర్ అని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రకటన వెనక్కి పోయినప్పుడు జానారెడ్డి ఆధ్వర్యంలో కోదండరాం నేతృత్వంలో రాజకీయ జేఏసీ ఏర్పాటైందని రేవంత్ గుర్తుచేశారు. అప్పుడు దండాలు పెట్టి, జెండాలు మోసి ప్రజలంతా ఉద్యమం చేస్తే ఇప్పుడు ఆ ప్రజలనే కేసీఆర్ ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను చైతన్య పరిచేందుకు గళం విప్పి గజ్జె కట్టాలంటూ కళాకారులను కోరారు.

చారిత్రక అవసరం...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీకి అండగా నిలవాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పిన మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరను డబుల్, ట్రిపుల్ చేసిందని విమర్శించారు. అక్కడ మోదీ అయినా ఇక్కడ కేడీ అయినా ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. బీజేపీ పెట్టుబడిదారుల పార్టీ అని, బీఆర్ఎస్ దొరల పార్టీ అని ఆరోపించారు. కాంగ్రెస్ ఒక్కటే ప్రజల పార్టీ అని రేవంత్ అన్నారు. దళితుడైన మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా చేశామని, తెలంగాణలో దళితుడిని సీఎంగా చేయకపోయినా కనీసం పార్టీ అధ్యక్షుడిగా అయినా చేసే దమ్ముందా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

అధికారంలోకి వస్తే రుణమాఫీ: తొమ్మిదేళ్లలో పరిష్కారం కాని పోడు భూముల సమస్య ఈ 9 నెలల్లో పరిష్కారం అవుతుందనే నమ్మకం లేదని రేవంత్ పేర్కొన్నారు. అవసరమైతే కాలనాగునైనా, అనకొండనైనా, కొండ చిలువనైనా కౌగిలించుకుంటాం కానీ దోఖే బాజీ కల్వకుంట్ల కుటుంబాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మబోమని రేవంత్ స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని... అప్పుడు రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామన్నారు. పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. టీటీపీఎస్, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, విద్యుత్ ఉద్యోగుల కష్టాలను తీరుస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

రేవంత్ పాదయాత్రకు సీపీఐ నేతల సంఘీభావం...

భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు పట్టుకొని సంఘీభావం తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ నడుమ పొత్తు కుదురుతుందన్న ప్రచారం నేపథ్యంలో సీపీఐ కార్యకర్తలు రేవంత్ పాదయాత్రలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

నిరంతర విద్యుత్‌కు రూ.5వేల కోట్ల రుణం

- ప్రభుత్వ పూచీకత్తుతో డిస్కంలకు రుణ సదుపాయం
- వ్యవసాయానికి కోతల్లేని సరఫరాకు సీఎం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కోతల నివారణకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ప్రభుత్వ పూచీకత్తుతో రూ.5వేల కోట్ల రుణాలు తీసుకునేందుకు రాష్ట్ర సర్కారు అనుమతినిచ్చింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ విద్యుత్ కోతలపై ఆందోళనలు తీవ్రం కావడంతో శాసనసభ వేదికగా ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. 'వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు రోజుకు రూ.28 కోట్లు కావాలని డిస్కంలు కోరాయి. రూ.38 కోట్లైనా ఇస్తాం.. ఇకపై కోతలు విధించడానికి వీల్లేదని ఆదేశించాను' అని సీఎం చెప్పారు. ఈ మేరకు రూ.5వేల కోట్ల రుణం తీసుకునేందుకు డిస్కంలకు ప్రభుత్వం సోమవారం అనుమతినిచ్చింది. గతంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిన సందర్భాల్లో కోతల్లేకుండా సరఫరా చేసేందుకు ఎనర్జీ ఎక్ఛ్సేంజీల నుంచి డిస్కంలు భారీ ఎత్తున విద్యుత్ కొనుగోళ్లు చేసేవి. రోజుకు రూ.100 కోట్లతో 30 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ కొనుగోళ్లు చేసిన సందర్భాలూ ఉన్నాయి. నష్టాలు తీవ్రం కావడంతో గత నవంబర్ నుంచి ఓపెన్ యాక్సెస్ కొనుగోళ్లను తగ్గించుకున్నాయి. దీంతో వ్యవసాయ విద్యుత్‌కు కోతలు తప్పలేదు. ఓపెన్ యాక్సెస్ నుంచి విద్యుత్ కొనుగోళ్లను పెంచడంతోపాటు విద్యుదుత్పత్తి కంపెనీలకు అత్యవసరంగా చెల్లించాల్సిన బకాయిలను తీర్చడానికి రూ.5వేల కోట్ల రుణాలను డిస్కంలు వినియోగించనున్నట్టు తెలిసింది.

'చట్టసభల్లో బీసీలకు న్యాయం చేయండి'



సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో బీసీలకు తొలి విడతలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించి న్యాయం జరిగేలా చూడాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. ఈ అంశంలో అవసరమైన రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, సీపీఎం ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. మార్చి 13 నుంచి మొదలయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ విడతలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టాలని సురేశ్ కోరారు. అధికార బీజేపీ చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లపై కావాల్సిన చట్టసవరణ కోసం సంకల్పిస్తే తాము మద్దతిస్తామని సీతారాం ఏచూరి హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలో బీసీ రాజ్యాధికార సమితి తెలంగాణలో నిర్వహించనున్న బీసీల భారీ బహిరంగ సభకు దేశంలో బీసీలకు అనుకూలంగా ఉన్న అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు సురేశ్ వెల్లడించారు.

సెక్రటేరియట్‌కు రాని సీఎంకు సెక్రటేరియట్ ఎందుకు?: కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: అసలు సెక్రటేరియట్‌కు రాని ముఖ్యమంత్రికి వందల కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన సెక్రటేరియట్ అవసరమా? అని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా తెలంగాణ శాసనసభ సమావేశాలను బీఆర్ఎస్ సమావేశాల వేదికగా మార్చుకున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలకు కావాల్సిన అంశాలు, సమస్యలపై ఏమాత్రం చర్చించకుండా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పోటీపడి మరీ ప్రధాని మోదీని విమర్శించడం, బీజేపీపై బురదజల్లేందుకు నిర్వహించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలన్నీ ఆవు కథలా సాగాయని ఎద్దేవా చేశారు. తమ వైఫల్యాలు బయటపడకుండా సభా వ్యవహారాలను పక్కదారి పట్టించారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వేరు కాదని, రెండు పార్టీలు ఒకటే అనేలా కాంగ్రెస్ రాసిచ్చిన స్క్రిప్ట్ తండ్రి, కొడుకులు చదివారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రధానిని, బీజేపీని విమర్శిస్తుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంతోషంగా బల్లలు చరుస్తున్నారని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో కేంద్రమంత్రిగా కేసీఆర్ రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారో బహిర్గతపరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సభలో చర్చించే ధైర్యం కేసీఆర్‌కు లేదన్నారు. తమ ప్రభుత్వం గుట్టు రట్టు అవుతుందన్న భయంతో సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి కాగ్ రిపోర్ట్ కూడా సభలో ప్రవేశపెట్టలేదని లక్ష్మణ్ ఆరోపించారు.

క్లుప్తంగా...

జోగుళాంబ ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఆలంపూర్ జోగుళాంబ దేవాలయంలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలను నిర్వహించే వెసులుబాటు కల్పిస్తున్న నేపథ్యంలో ఆ జాబితాలో ఇప్పుడు జోగుళాంబ దేవాలయాన్ని కూడా చేర్చారు. ఈమేరకు సోమవారం దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన కార్యాలయంలో ఆ దేవాలయ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇప్పటికే 36 దేవాలయాల్లో ఆర్జిత సేవలు, వసతి బుకింగ్, ప్రసాదం పంపిణీ తదితర సేవలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే వీలు కల్పించినట్లు ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మరిన్ని దేవాలయాల్లో కూడా ఈ సేవలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

జాగృతి ఆధ్వర్యంలో 15,16 తేదీల్లో వాలీబాల్ టోర్నీ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా భారత జాగృతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో లాల్‌బహదూర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగంలో పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. ప్రథమ బహుమతిగా ట్రోఫీ, మెడల్స్‌తో పాటు రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతిగా ట్రోఫీ, మెడల్స్‌తో పాటు రూ.75 వేల నగదు, తృతీయ బహుమతిగా ట్రోఫీ, మెడల్స్ రూ.50 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొనాలని కవిత కోరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కేసీఆర్-2023 కప్ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను కవిత విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భారత జాగృతి జనరల్ సెక్రెటరీ నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్‌సాగర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ సమ్మేళనం పోస్టర్ విడుదల

దళిత క్రైస్తవ సమ్మేళనం పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 15న దళిత క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వెస్లీ డిగ్రీ కాలేజీలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. దళిత క్రైస్తవ అభ్యున్నతి కోసం, బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్న సీఎం జన్మదినాన్ని దళిత క్రైస్తవ సంఘాలు పెద్దఎత్తున నిర్వహించనుండటం అభినందనీయమని పేర్కొన్నారు.

చూచి రాతలో మనోళ్లు చురుకే..!

పాలిటెక్నిక్‌లో పుస్తకాలిచ్చి పరీక్షలు	ప్రయోగాత్మకంగా సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు	59 శాతానికి పెరిగిన ఉత్తీర్ణత	క్రియేటివిటీ పెంచడమే లక్ష్యమంటున్న అధికారులు	వచ్చే ఏడాది నుంచి మరిన్ని సబ్జెక్టులు

సాక్షి, హైదరాబాద్: ఏడాదిపాటు పుస్తకాలు తిరగేయడం... ముఖ్యమైనవి బట్టీపట్టడం... ఆఖరులో పునశ్చరణతో హడావుడి చేయడం.. ఇదీ ఇప్పటివరకూ అందరికీ తెలిసిన పరీక్ష విధానం. ఇందులో పరీక్ష హాల్లోకి చిన్న చిట్టీని కూడా అనుమతించరు. కానీ, ఈ సంప్రదాయ విధానానికి భిన్నంగా రాష్ట్ర సాంకేతిక విద్యామండలి పరీక్షలు నిర్వహించింది. పుస్తకాలు చూసి మరీ పరీక్షలు రాసేందుకు అనుమతించింది. గత నవంబర్‌లో జరిగిన పాలిటెక్నిక్ పరీక్షలో ఈ సరికొత్త పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. అప్లైడ్ ఇంజనీరింగ్ మేథమెటిక్స్ పేపర్‌లో అకడమిక్ పుస్తకాన్ని చూసి పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షకు సంబంధించిన ఫలితాలు తాజాగా వెల్లడయ్యాయి. ఇందులో 59 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పుస్తకాలు చూడకుండా 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన ఇదే సబ్జెక్టు పరీక్షలో కేవలం 35 శాతం మాత్రమే ఉత్తీర్ణత వచ్చింది. ఇక నుంచీ ఇదే తరహా పరీక్ష విధానాన్ని మరికొన్ని సబ్జెక్టులకు విస్తరించాలనే యోచనలో అధికారులున్నారు.



కాపీ కొట్టడం కాదు.. క్రియేటివిటీ పెంచడం

చూచి రాస్తే మార్కులు రావా? రిజల్ట్ పెరిగితే గొప్పా? ఇలాంటి అనుమానులొస్తే పొరపాటే అంటున్నారు అధికారులు. ఇంతకాలం బట్టీ పట్టే పద్ధతిని దూరం చేసి, విద్యార్థుల ఆలోచనాశక్తిని పెంచడమే దీని ఉద్దేశమని చెబుతున్నారు. పరీక్షకు మండలి సూచించిన అకడమిక్ పుస్తకాల్లో రెండింటిని మాత్రమే అనుమతిస్తారు. పరీక్షలో ప్రశ్నలు అడగడంలోనే అసలు కిటుకు ఉంటుంది. ప్రశ్నలను నేరుగా కాకుండా, పరోక్ష విధానంలో అడుగుతారు. క్వశ్చన్ బ్యాంక్‌లో ఉన్నట్టు సమాధానాలు ఈ అకడమిక్ పుస్తకాల్లో నేరుగా దొరకవు. ఉదాహరణకు త్రికోణమితిని పాఠ్యాంశంలో పొందుపరిస్తే.. పరీక్షలో వచ్చే ప్రశ్న ఇదే మూస పద్ధతిలో ఉండదు. ఆ లెక్కను పూర్తిగా సాధన చేస్తే... సూత్రాల ప్రకారం అనుసరిస్తేనే సమాధానం దొరుకుతుంది. ఒక రకంగా ఇది విద్యార్థి మరింత ఆలోచించి సమాధానం ఇవ్వగలిగేలా ప్రోత్సహిస్తుందని నిపుణులు అంటున్నారు. చాప్టర్ మొత్తం చదవడమే కాకుండా, ఏ కోణంలోనైనా సమాధానం రాయగల నేర్పును ముందు నుంచే విద్యార్థి అలవర్చుకోవాలి. అప్పుడే ఓపెన్ బుక్ విధానంలో సమాధానం రాసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గతంలో బట్టీ విధానంలో ట్విస్ట్ చేసి ప్రశ్న ఇస్తే ఆన్సర్ ఇచ్చే ఆలోచన దిశగా విద్యార్థి వెళ్లలేదని ఫలితాలను బట్టి తెలుస్తోందని అధికారులు అంటున్నారు. ఓపెన్ బుక్ విధానంపై ముందే అవగాహన కల్పించడం వల్ల వివిధ కోణాల్లో ఆలోచనాశక్తిని పెంచుకున్నారని చెబుతున్నారు.

పరీక్షల నాణ్యత పెరుగుతుంది



విద్యార్థి పట్టాతో బయటకు రావడం కన్నా... మంచి నైపుణ్యం, ఆలోచనాశక్తితో రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేటి తరం మార్కెట్‌లో మంచి కెరీర్‌కు ఇదే దోహదపడుతుంది. ఓపెన్ బుక్ విధానంతో విద్యార్థి నైపుణ్యాన్ని కొలవడానికి వీలుంటుంది. ఈ దిశగానే కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చాం.

–డాక్టర్ సి.శ్రీనాథ్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి

ఆలోచనకు పదును

క్లోజ్డ్ బుక్ విధానానికి, ఓపెన్ బుక్ విధానానికి చాలా తేడా ఉంది. పుస్తకం దగ్గరున్నా, ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడానికి చాప్టర్ మొత్తం చదవాల్సి వచ్చింది. దీనిపై ముందే అవగాహన కల్పించడంతో సబ్జెక్ట్‌పై కమాండ్ తెచ్చుకున్నాం. బట్టీ పద్ధతి కాకుండా, మరింత ఆలోచించి సమాధానాలు రాశాం. మున్ముందు పోటీ పరీక్షల్లోనూ సులువుగా జవాబులు రాయొచ్చనే విశ్వాసం పెరిగింది.

– ఎస్.ప్రవీణ్ కుమార్, పాలిటెక్నిక్ విద్యార్థి, హైదరాబాద్

రూ.60,000 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

లావాదేవీల సంఖ్య, ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఇక తెలంగాణ ఏర్పాటైన తర్వాత తొలి ఏడాది (2014-15)లో 8.26 లక్షల లావాదేవీలు జరిగి కేవలం రూ.2,707 కోట్ల ఆదాయం ఖజానాకు రావడం గమనార్హం. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి జరిగిన భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల వరకు రెవెన్యూ వచ్చినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ చుట్టూనే..

భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు చాలావరకు హైదరాబాద్ చుట్టూనే జరుగుతున్నాయి. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో మెజార్టీ లావాదేవీలు జరుగుతుండగా, హనుమకొండ, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేటల్లో కూడా భారీగానే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో 10 నెలల్లో 50 వేల వరకు లావాదేవీలు జరగ్గా, మిగిలిన జిల్లాల్లో 30 వేలకుపైగా లావాదేవీలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయేతర భూముల విలువలను బట్టి ఆదాయం సమకూరుతోంది. ఇక రాష్ట్రంలో అతి తక్కువ రిజిస్ట్రేషన్లు ములుగు, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వరంగల్, నారాయణపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో జరుగుతున్నాయి. ఈ జిల్లాల్లో నెలకు సగటున వెయ్యి లోపు లావాదేవీలే జరుగుతుండడం గమనార్హం.

2022 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన రెవెన్యూ (నెలల వారీగా)

నెల	దాక్యుమెంట్ల రెవెన్యూ	(రూ.కోట్లలో)
ఏప్రిల్	1,05,995	1,003.17
మే	1,04,831	920.14
జూన్	1,02,291	892.13
జూలై	95846	779.96
ఆగస్టు	92,401	874.51
సెప్టెంబర్	98,285	864.74
అక్టోబర్	83,444	780.29
నవంబర్	1,00,525	860.32
డిసెంబర్	1,05,914	970.45
జనవరి-23	82,181	699.79

2022-23లో జరిగిన వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగిన టాప్ 5 జిల్లాలు

జిల్లా	దాక్యుమెంట్ల ఆదాయం	(రూ.కోట్లలో)
రంగారెడ్డి	1,89,498	3,074.57
మేడ్చల్	1,32,840	1,966.48
హైదరాబాద్	51,563	1,117.78
సంగారెడ్డి	57,806	665.22
హనుమకొండ	39,737	230.08

రాష్ట్రంలో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఉట్నూర్/ఇంద్రవెల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం ఆయన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పర్యటించారు. ముందుగా ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి పోర్టల్ పనితీరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోడు భూముల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం ఐబీ చౌరస్తాలో మాట్లాడుతూ, పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో కాంగ్రెస్, బీజేపీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సచివాలయం గుమ్మటాలు కూల్చుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. కూల్చాల్సింది గుమ్మటాలు కాదని.. రాష్ట్రంలో అవినీతిలో కురుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడి, బీఎస్పీని ఆదరించాలన్నారు. అనంతరం యాత్ర పెర్కగూడ, శ్యాంపూర్, యెందా, ఉమ్రి, నర్సాపూర్, గోట్టిపటార్ మీదుగా ఇంద్రవెల్లి చేరుకుంది. ఇంద్రవెల్లిలోని బుద్ధనగర్, ప్రబుద్ధనగర్, సట్వాజిగూడ, బుర్సన్‌పటర్ గ్రామాల్లో యాత్ర సాగింది.



ఉట్నూర్‌లో చెప్పులు కుట్టే వ్యక్తితో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

రైతు జలపతిరెడ్డి మరణానికి కారకులపై చర్యలు తీసుకోండి

డీజీపీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: జగిత్యాల జిల్లా నర్సింగాపూర్ రైతు గడ్డం జలపతిరెడ్డి బలవన్మరణానికి కారణమైన న్యాయవాది దామోదర్‌రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. డీజీపీ అంజనీకుమార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వారిద్దరూ డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. రైతు బలవన్మరణంపై జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 4న ఎఫ్ఐఆర్ నమోదు చేసినా పోలీసులు ఇప్పటి వరకు నిందితుడిని అరెస్టు చేయలేదని చెప్పారు. దామోదర్‌రావు మానసికంగా హింసించడం వల్లే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు జలపతిరెడ్డి సూసైడ్ నోటు రాయడంతోపాటు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని డీజీపీకి వివరించారు. జలపతిరెడ్డి రాసిన సూసైడ్ నోట్, ఆ సమయంలో తీసుకున్న వీడియో క్లిప్‌ను డీజీపీకి అందజేసినట్లు తెలిపారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందించారన్నారు.

పథకాల పేర్లతో మోసం చేస్తున్నారు

కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన షర్మిల

జనగామ: రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే ఏంటో చూపించిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని విమర్శించే సీఎం కేసీఆర్... బొంకుడు మాటలు మాట్లాడేది ఎవరో చెప్పాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా విమర్శించారు. వైఎస్సార్‌పై అసెంబ్లీలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను షర్మిల ఖండించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. పథకాల పేరు చెబుతూ... ప్రజలను మోసం చేసేది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 33 ప్రాజెక్టుల నిర్మాణం చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి బొంకుడు మనిషి అయ్యారా? అటువంటి బొంకుడు మాటలు చెప్పే అలవాటు నీకే ఉందని కేసీఆర్‌పై ఆమె నిప్పులు చెరిగారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ దేవుడిగా నిలిచిపోతే... కేసీఆర్‌ను దెయ్యమని పిలుచుకుంటున్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిది పాదయాత్రనో.. దొంగయాత్రనో అర్థం కావడంలేదని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి, కేసీఆర్ చేతిలో పిలకగా మారిన రేవంత్.. ప్రజల గురించి మాట్లాడతాడంటే మనం నమ్మొచ్చా అని ప్రశ్నించారు. షర్మిల వెంట నేతలు ఏపూరి సోమన్న, జిల్లా అధ్యక్షుడు గొరబోయిన సమ్మయ్య ఉన్నారు.



జనగామ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

ఇంటర్ మూల్యాంకనానికి మళ్లీ టెండర్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియేట్ పరీక్ష పేపర్ల ఆన్‌లైన్ మూల్యాంకన కాంట్రాక్టుకు టెండర్లు మళ్లీ పిలుస్తున్నట్టు ఇంటర్మీడియేట్ బోర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రదా భాయ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పిలిచిన టెండర్లలో మేగ్నటిక్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ఒక్కటే పాల్గొందని, దీంతో మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. బోర్డ్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన ఓ జూనియర్ లెక్చరర్ మరో కంపెనీకి కట్టబెడుతున్నట్టు చేసిన ప్రచా రం అవాస్తమని స్పష్టం చేశారు.



స్వేచ్ఛ కంటే ఎక్కువగా ఎవరూ దేన్నీ ప్రేమించలేరు.
ప్రేమ కూడా స్వేచ్ఛ తర్వాతే! స్వేచ్ఛ కోసం ప్రేమను త్యాగం
చేయొచ్చు, కానీ ప్రేమ కోసం స్వేచ్ఛను త్యాగం చేయలేం.
– ఓషో

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 14

సంబరంలో దాగిన సంకటం!

వర్తమాన యుగంలో అపురూపమైన, అత్యవసరమైన ఒక ఖనిజం కోసం ప్రపంచవ్యాప్తంగా భూభౌతిక శాస్త్రవేత్తలు నిరంతరాన్వేషణలో తలమునకలైన వేళ 'నేనున్నాన'ంటూ భారత్‌లోనే అది ప్రత్యక్షం కావటం సంబరం చేసుకోవాల్సిన సందర్భమే. అందుకే జమ్మూ, కశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో నాణ్యమైన లిథియం నిక్షేపాలున్నట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) ప్రకటించినప్పుడు చాలామంది శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేశారు. నిజానికి లిథియం నిక్షేపాలు మన దేశంలో బయటపడటం ఇది మొదటిసారేమీ కాదు. 2021 ఫిబ్రవరిలో కర్ణాటకలో కూడా లిథియం ఆచూకీ కనుక్కున్నారు. అయితే ఆ నిల్వలు 1,600 టన్నులు మాత్రమే. ఇప్పుడు బయటపడిన నిక్షేపాలు దాదాపు 60 లక్షల టన్నులు. వర్తమాన ప్రపంచాన్ని నడిపిస్తున్న శిలాజ ఇంధనాలు క్రమేపీ తరిగిపోతున్నాయని, పైగా వాటి వినియోగం కారణంగా పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నదనీ అర్థమయ్యాక ప్రత్యామ్నాయాల కోసం ఆత్రుతపడటం మొదలైంది. ఆ క్రమంలో 'హరిత ఇంధనాల' పేరిట చాలానే ఉనికిలోకొచ్చాయి. అయితే వీటికున్న పరిమితులను అధిగమించటంలో ఇంకా పూర్తి స్థాయి విజయం సాధ్యం కాలేదు. ఈ తరుణంలో లిథియం-అయాన్ బ్యాటరీ రూపకల్పనకు తోడ్పడగల పరిశోధన చేసినందుకు 2019 సంవత్సరానికి ముగ్గురు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీలో నోబెల్ బహుమతి రావటం ప్రత్యామ్నాయ ఇంధన వెతుకులాటలో కీలక మలుపు. ఆ పరిశోధనల పర్యవసానంగానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ల రంగంలో ఊహించని అభివృద్ధి సాధ్యమైంది. 1991లో ఒక జపాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థ లిథియం అయాన్ బ్యాటరీ అభివృద్ధి చేశాక కంప్యూటర్ ఎక్కడికైనా తీసుకెళ్లే ఉపకరణమైంది. అప్పుడప్పుడే వస్తున్న డిజిటల్ కెమెరాల సైజు గణనీయంగా తగ్గింది. సెల్‌ఫోన్‌ల ఆగమనంలో లిథియం అయాన్ బ్యాటరీ పాత్ర అసాధారణం. గత కొన్నేళ్లుగా విద్యుత్‌తో నడిచే వాహనాల తయారీ కూడా జోరందుకుంది. ఇంకా పేస్‌మేకర్లకూ, అంతరిక్ష నౌకలకూ, జలాంతర్గాములకూ లిథియం హైడ్రాక్సైడ్ కీలకం. ఇక బైపోలార్ వ్యాధి నివారణకు తోడ్పడే ఔషధాల ఉత్పత్తిలో లిథియం కార్బొనేట్ ఎంతో అవసరమని ఇటీవల కనుగొన్నారు. 2020లో ప్రపంచ లిథియం వినియోగం కేవలం 56,000 టన్నులైతే అది ఇప్పటికే రెట్టింపు దాటింది. ఏటా ఆ వినియోగం 22 లక్షల టన్నులకు చేరుకోవచ్చని ఒక అంచనా.

'తెల్ల బంగారం'గా పిలిచే లిథియంపై ఆధారపడటం ఎక్కువవుతున్న తరుణంలో దాని ఖరీదు కూడా పెరుగుతోంది. మన దేశం 2020–21లో రూ. 173 కోట్ల విలువైన లిథియంను దిగుమతి చేసుకోగా, ఆ ఏడాదే మరో 8,811 కోట్ల రూపాయల విలువైన లిథియం అయాన్ బ్యాటరీలు కొనుగోలు చేసింది. నిరుడు ఈ వ్యయం దాదాపు రెట్టింపయింది. రాగల సంవత్సరాల్లో ఇదింకా పెరగటం ఖాయం. కనుకనే లిథియం నిల్వల కోసం అన్వేషణ సాగిస్తూనే ఉంది. గత అయిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయల్లో 20 ప్రాజెక్టులు ప్రత్యేకించి లిథియం కోసమే పనిచేస్తున్నాయి. ఇవిగాక మూడు ప్రభుత్వ రంగ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో ఖనిజ్ బిదేష్ ఇండియా(కబిల్) పేరిట ఒక సంస్థ ఏర్పడి ఆస్ట్రేలియా, అర్జెంటీనా లిథియం గనుల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడుతోంది. ఈ నేపథ్యంలో జమ్మూ, కశ్మీర్‌లో అపారంగా లిథియం నిక్షేపాలున్నట్టు వెల్లడికావటం ఉత్సాహాన్నిచ్చేదే. ప్రపంచంలో భారీయెత్తున లిథియం నిల్వలున్న దేశం బొలీవియా అయితే...ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న చిలీ, ఆస్ట్రేలియా, చైనాల తర్వాత మనమే. రాశిలో అమెరికా కన్నా కూడా మనం ఎక్కువే. ఈ నిక్షేపాల నాణ్యతనూ, వాస్తవ వినియోగ సామర్థ్యాన్నీ మరిన్ని పరీక్షల తర్వాతగానీ పూర్తిగా నిర్ధారించలేమన్నది శాస్త్రవేత్తల మాట. ఇందుకు రెండేళ్ల సమయం పడుతుంది. అంతా సవ్యంగా ఉందనుకున్నాక ఉత్పత్తి మొదలుకావడానికి మరో అయిదారేళ్లు తప్పదు.

ఈ ప్రక్రియంతా పర్యావరణ హితంగా జరగటం సాధ్యమేనా? ఎందుకంటే ఇప్పుడు నిక్షేపాలు బయటపడిన ప్రాంతం హిమాలయ పర్వత సానువుల్లో ఉంది. పర్యావరణపరంగా వచ్చే ప్రమాదం గురించి శాస్త్రవేత్తలు, పర్యావరణ ఉద్యమకారులు చేస్తున్న హెచ్చరికలు బేఖాతరుచేసి దశాబ్దాలుగా జలవిద్యుత్ ప్రాజెక్టులూ, ఇతర నిర్మాణాలూ చేపట్టిన పర్యవసానంగా ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్ పట్టణం ఎలా కుంగిపోతున్నదో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. భూకంప ముప్పు రీత్యా హిమాలయ పర్వత ప్రాంతాలు అత్యంత సున్నితమైనవి. లిథియం నిక్షేపాల వెలికితీత ఆ ముప్పును మరింత పెంచేలా మారకూడదు. ఉక్కు తెరల వెనక కాలక్షేపం చేసే చైనాలో లిథియం వెలికితీత వల్ల ఏర్పడుతున్న సమస్యల గురించి ప్రపంచానికి పెద్దగా తెలియకపోయినా వెనకబడిన దక్షిణ అమెరికా దేశాల్లో జనం ఎదుర్కొంటున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. ఒక టన్ను లిథియం ఉత్పత్తికి 22 లక్షల లీటర్ల నీరు అవసరం కావటంతో చిలీ, బొలీవియా, అర్జెంటీనా దేశాల్లో స్థానికంగా ఉన్న జలవనరులన్నీ హరించుకుపోతున్నాయి. నేల, చెట్టూ, చేమా దెబ్బతింటున్నాయి. దాంతో స్థానిక ప్రజలు ఉద్యమాలు చేస్తున్నారు. ఇలా పర్యావరణాన్ని కాటేసే లిథియంకు బదులు తక్కువ నష్టం ఉండే ఇనుము, సిలికాన్ వంటి లోహాలపై దృష్టిపెట్టాలన్న డిమాండ్ కూడా ప్రపంచవ్యాప్తంగా ఊపందుకుంది. ఏదేమైనా జమ్మూ, కశ్మీర్ లిథియం నిక్షేపాల విషయంలో ఆచితూచి అడుగేయటం అన్ని విధాలా శ్రేయస్కరం.

పాలనా రథానికి ప్రజలే రక్ష!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారతీయులు 140 కోట్ల మంది తనకు రక్షా కవచంగా ఉన్నారని ప్రధాని అన్నారు. మరి అలాంటప్పుడు ఒక డాక్యుమెంటరీని ఎందుకు అంతగా ప్రభుత్వం వ్యతిరేకించింది? భారత సమాజ పరిస్థితులు, ప్రభుత్వ చర్యల గురించిన ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోగోరే భారతీయుల హక్కుల్ని ఇది కాలరాయడం కాదా? ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడటం కష్టసాధ్యమని నమ్మిన నాయకులున్నారు. కానీ జాతీయోద్యమ నాయకుడైన మహావీర్ త్యాగి ప్రజలు భాగస్వాములు కాని అధికారాలు ప్రభుత్వాలకు ఉండటానికి వీల్లేదని వాదించారు. ప్రాథమిక హక్కుల్ని ప్రభుత్వాలు కాలరాచే పరిస్థితుల్లో అలాంటి ప్రభుత్వాల్ని కూలద్రోసే హక్కును ప్రజలకు దఖలు పరచాలన్నారు.

"నా ప్రభుత్వం పైన ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను దేశ ప్రజలు నమ్మబోరు. 140 కోట్లమంది భారతీయులూ నాకు రక్షణగా, సురక్షితమైన కవచంగా ఉన్నారు."
– ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (8 ఫిబ్రవరి 2023)

గుజరాత్‌లో 2002లో మైనారిటీలపై జరిగిన మూకుమ్మడి హత్యాకాండ గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఒక ప్రకటన చేస్తూ– గుజరాత్ ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటంలో గుజరాత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనీ, ఆ తర్వాత వారాల తరబడి సాగిన హింసాకాండను అదుపు చేయలేక పోయిందనీ నిశితంగా విమర్శించింది. అంతేగాదు, గత 20 సంవత్సరాలుగానూ దేశవ్యాప్తంగా వివిధ బాధ్యతాయుత సంస్థల ప్రతినిధులు, మానవ హక్కుల నాయకులు ఈ విపరిణామాన్ని ఖండిస్తూ వచ్చారు. అయినా 2002 నాటి గుజరాత్ హింసాకాండను ప్రోత్సహించిన బాధ్యులెవరిపైనా రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోలేదు. గుజరాత్ ఊచకోతలపై 'ఇండియా – ది మోదీ క్వశ్చన్' మకుటం కింద ఒక డాక్యుమెంటరీని 'బీబీసీ' విడుదల చేసింది. అయితే ఈ డాక్యుమెంటరీ 'భారతదేశ సార్వభౌమాధికారాన్ని, నిజాయితీని అవమాన పరుస్తోం'దన్న పేరిట సామాజిక మాధ్యమాలన్నిటి నుంచి ప్రభుత్వం తొలగించింది. భారత సమాజ పరిస్థితుల గురించి, ప్రభుత్వ చర్యల గురించి ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోగోరే భారతీయుల హక్కుల్ని కాలరాయడం పట్ల శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు తదితర విద్వత్ సంపన్నులు 500 మందికి పైగా విస్మయం వ్యక్తం చేశారు.

పరిణామాలకు అద్దం

నిజానికి 'బీబీసీ' డాక్యుమెంటరీ వచ్చింది గుజరాత్ మారణకాండ అనంతరం 20 సంవత్సరాలకు. అంతకుముందే 2010 నాటికే రాణా అయూబ్ 'గుజరాత్ ఫైల్స్' పేరిట గుజరాత్ బీజేపీ పాలకవర్గ 'మాలోకా'న్ని ప్రత్యక్షరబద్ధంగా నమోదు చేసింది. ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాసింది మరెవరో కాదు, సాక్షాత్తూ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ. 'ఈశావాస్యోపనిషత్'లో కళ్లు తెరిపించే ఒక సూక్తి ఉంది: ''నిజం అనే ముఖాన్ని కనపడనివ్వకుండా ఓ బంగారు కుండీలో దాచి ఉంచుతారు. అసలా జలతారు కుండీలో దాగిన నిజమేమిటి?'' అలాగే నిజమనేది కట్టుకథకు అందని వాస్తవం! అలాంటి 'గుజరాత్ వాస్తవాల'ను రాణా అయూబ్ సాహసంతో బహిర్గతం చేసిందని శ్రీకృష్ణ కితాబిచ్చారు. 'అయూబ్ రచన పరిశోధనాత్మక పాత్రికేయ విధి నిర్వహణలో ఒక సాహస యాత్ర. పాలనా రంగంలో నానాటికీ పెరిగిపోతున్న నిజాయితీకి పాతరేసి, దొంగచాటు రాజకీయ కుట్రలకు మార్గం తీస్తున్న పరిణామాలకు ప్రత్యక్ష సాక్ష్యం' అని పేర్కొన్నారు.

రెండో మాట



రాజ్యాంగ రచనా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అంబేడ్కర్, భారత ప్రభుత్వం ప్రజాస్వామికంగా ఎన్నికైనందున అధికార దుర్వినియోగానికి పాల్పడటం కష్టసాధ్యమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అంబేడ్కర్ అభిప్రాయంతో జాతీయోద్యమ నాయకుల్లో ఒకరైన మహావీర్ త్యాగి(1899–1980) విభేదిస్తూ, అంబేడ్కర్ లాగా ఇలాంటి అభిప్రాయాలు కల నాయకులెవరైనా ఉంటే వారు అలాంటి ప్రకటనలు చేయబోయేముందు కొన్నాళ్లు జైలులో ఉండొస్తే మంచిదని వ్యంగ్యంగా సలహా ఇచ్చారు! ఆ పిమ్మట త్యాగి, రాజ్యాంగ రచన ముసాయిదా సంఘానికి సవాలుగా ఒక ప్రతిపాదన చేస్తూ, ప్రజలకు ఆమోదించిన ప్రాథమిక హక్కుల్ని ముందుముందు ఏర్పడబోయే ప్రభుత్వాలు కాలరాచే పరిస్థితుల్లో అలాంటి ప్రభుత్వాల్ని కూలద్రోసే లేదా మార్చేసే హక్కును ప్రజలకు దఖలు పరిచే అంశాన్ని చర్చించారా లేదా అని ప్రశ్నించారు. ప్రజలకున్న అలాంటి సహజమైన హక్కుకు మీరు గ్యారంటీ ఇవ్వలేదని త్యాగి విమర్శిస్తూ ప్రభుత్వ హక్కులతోపాటు ప్రజల హక్కుల్ని గురించి కూడా ఆలోచించాలన్నారు. ప్రజలు భాగస్వాములు కాని అధికారాలు ప్రభుత్వాలకు ఉండటానికి వీల్లేదని త్యాగి వాదించారు. అందుకు పూర్తిగా సమ్మతిస్తూ డాక్టర్ అంబేడ్కర్, ఉత్తరోత్తరా ప్రివెంటివ్ డిటెన్షన్ (ముందస్తు ఊహపై ఆధారపడి) పైన వ్యక్తుల్ని అరెస్టు చేసి జైల్లో పెట్టే స్వేచ్ఛను భావిప్రభుత్వాలకు అనుమతించే ప్రసక్తి ఉండరాదని పలుమార్లు స్పష్టం చేశారు.

దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రజాస్వామ్యం, ఎన్నికల మాటున 'ఓటు' ఎరలోనూ షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తరగతులకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు. పైగా ఎన్నికల పేరిట సంపన్న వర్గాలు, కుల, మత, రాజకీయ పక్షాలూ చేసిందీ, చేస్తున్నదీ – అన్ని కులాలలోని పేదలు, అణగారిన ప్రజలు చైతన్యం పొందకుండా జాగ్రత్తపడటం మాత్రమే. అంబేడ్కర్ ముసాయిదా రాజ్యాంగ ప్రతిని వెలుగు చూడకుండా రాజ్యాంగ రచనా సంఘంలోని కొందరు సభ్యులు విశ్వ ప్రయత్నం చేశారు. అడ్డదారులలో ఎన్నికల పేరిట కుల, మత సంపన్న వర్గాల సభ్యులు హెచ్చుమంది ఎలా అనతికాలంలోనే 'కుబేర సంతానం'గా మారి భారతదేశ ఆర్థిక వ్యవస్థనే, తారుమారు చేయడానికి వెనుదీయడం లేదో ప్రజలకు ఇప్పుడు అర్థమైపోయింది. రాజ్యం కార్పొరేట్ ఎస్టేట్ వ్యాపారంగా ఎలా మారిపోయిందో రుజువైపోయింది.

స్వతంత్రంగా వ్యవహరించాలి

1951 మేలోనే కేంద్ర, రాష్ట్ర శాసన వేదికల్లోకి ప్రవేశించడానికి ఎవరెవరిని అనర్హులుగా ప్రకటించాలో 'ప్రజా ప్రాతినిధ్య బిల్లు'ను అంబేడ్కర్ ప్రవేశపెడుతూ అవసరమైన సవరణలను కూడా ప్రతిపాదించారు. వాటిలో ప్రధానమైనవి – పార్లమెంట్, ఎన్నికల చట్టం పార్లమెంట్ సభ్యుల స్వేచ్ఛను ప్రభుత్వ స్వేచ్ఛను భిన్నమైనవిగా భావించాలి. మొత్తం పార్లమెంట్‌ను అవినీతికి 'పెద్ద బిడ్డ'గా మార్చకుండా ఉండే విధంగా సభనూ, ఎన్నికల చట్టాన్నీ రూపొందించాలి. పార్లమెంట్ సభ్యులకు రాజకీయ పదవులను కట్టబెట్టడం ద్వారా లేదా ఇతర ప్రలోభాలకు లోను చేయడం ద్వారా మొత్తం పార్లమెంట్‌ను లేదా శాసన వేదికలను అవినీతిపాలు చేసేలా ప్రభుత్వానికి అవకాశం కల్పించకూడదు. దానికి తగిన విధంగా మన శాసన వేదికలు, పార్లమెంట్, ఎన్నికల చట్టమూ ఉండాలని అంబేడ్కర్ అభిలషించారు. పార్లమెంట్ లేదా శాసన వేదిక అనేది నిర్భీతిగా, ప్రభుత్వం నుంచి ఏ ప్రలోభాన్ని ఆశించకుండా స్వతంత్రంగా వ్యవహరించలేని నాడు అలాంటి శాసన వేదికలు నిష్ప్రయోజనకరం. శాసన వేదికలు ప్రభుత్వాలు చెప్పే మాటలకు డూడూ బసవన్నలుగా, నట, గాయక వందిమాగధులుగా వ్యవహరించరాదని కూడా అంబేడ్కర్ (1951 మే 9) నిర్మొహమాటంగా పేర్కొన్నారని మరచి పోరాదు. పార్లమెంట్ ఒక స్టాక్ ఎక్స్ఛేంజీగా (వ్యాపార లావాదేవీల కేంద్రం) ఇప్పటికే (1951 నాటికే) మారిపోయిందని పండిట్ లక్ష్మీకాంత మైత్రా ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి సంప్రదాయానికి 75 ఏళ్లకు కూడా 'క్లాం' వేయడానికి పాలకులకు ఇష్టం లేదు. దీనివల్ల పాలకులు ప్రయోజనం పొందడం సహజం. కనుకనే న్యాయ వ్యవస్థ తన జడత్వాన్ని క్రమంగా వదిలించుకుని చైతన్యావస్థలోకి వచ్చి కఠినమైన నిర్ణయాలు తీసుకోగల సత్తాను సంతరించుకుంటోంది. అందుకే కవి కుమారుడు ఎంతటి కమ్మని సూక్తిని విడిచి వెళ్లాడో గదా – ''బలవంతపు రాజ్యకాంక్షా ఒక పాపము జూచునే ఈశ్వరా?''! తన 'బీదతనం' దేశ దారిద్ర్యమనీ, తన మరణం లోక ప్రళయమనీ భావించి సంచరించే అహంకారుల గురించి సుమతీ శతకకారుడు హెచ్చరించలేదూ?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇలా కూడా ఉంటారు...



మా అన్నను రోజూ స్కిన్ కేర్ ఎలా చేసుకుంటావని అడిగాను. స్కిన్‌కు ప్రత్యేకంగా కేర్ తీసుకోవడం ఏమిటని బదులిచ్చాడు.
– అనంతికా శర్మ, ఎంబీబీఎస్ డాక్టర్

ఇట్టే వచ్చేశాను!



చెన్నై– బెంగళూరు ప్రయాణాల విషయంలో జరిగిన అత్యుత్తమ విషయం ఏమిటంటే, వందే భారత్ రైళ్లు రావడం. బెంగళూరు స్టేషన్‌కు 10.10 కల్లా వచ్చాను. పదకొండు కల్లా ఆఫీసులో ఉన్నాను. రైల్వే మంత్రిత్వ శాఖ వర్గాలకు జేజేలు.
– శ్రీరామ్ వి., ఆంట్రప్రెన్యూర్

వాస్తవం



మనకు తెలిసిన పదార్థాల్లో విటమిన్ బి12 ఉండేది వీటిల్లో మాత్రమే (అన్ని విలువలూ 100 గ్రాముల ఆహారానికి మైక్రోగ్రాముల్లో): లివర్ (90), మటన్ (2.8), చేప (1.4-6), గుడ్డు (1.8), బీఫ్ (1.7), చికెన్(0.3), పాలు (0.14). రోజువారీగా తీసుకోవాల్సింది 1.2 మైక్రో గ్రాములు. మనకు తెలిసిన ఏ మొక్కలోనూ బి12 లేదు.
– సిల్వియా కర్పగం, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్

వ్యతిరేక ప్రచారం



రష్యా ఎప్పుడూ ఆఫ్రికా మీద దాడి చేయలేదు. చెప్పాలంటే, వలసవాదానికి వ్యతిరేకంగా ఆఫ్రికాతో నిలబడింది. ఆయుధాలు పంపింది. స్వాతంత్ర్య సమర యోధులకు శిక్షణ ఇచ్చింది. కానీ ఇప్పటి మీడియా ప్రచారం మమ్మల్ని రష్యాను ద్వేషించాలని కోరుతోంది.
– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

వీవీఐపీల జోరు



బీజేపీ పాలనలో వీవీఐపీ సంస్కృతి ఇండియాలో సజీవంగా ఉండటమే కాదు, ఇంకా పెరుగుతోంది. తన మొదటి పదవీ కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని తగ్గించడానికి నిజంగానే ప్రయత్నించారు. కానీ ఇప్పుడు చేతులు ఎత్తేశారు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?
– ఫ్రాంకోయిస్ గౌటియర్, జర్నలిస్ట్

భవిష్యవాణి తెలీదు



నేను భవిష్యవాణిని చెప్పలేను, మార్మికుడిని కాను, ప్రవక్తను అంతకంటే కాను. టర్కీ మీడియాలో కొందరు సూచిస్తున్నట్టు, పెద్ద భూకంపాలకు కచ్చితమైన తేదీలు ఇవ్వను. నేను పరిశోధకుడిని. భూకంపాలకూ, గ్రహాల స్థితిగతులకూ ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేస్తున్నాను. దానికోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ రూపొందించాను.
– ఫ్రాంక్ హూగర్‌బీట్స్, నెదర్లాండ్స్ పరిశోధకుడు

ఆయనేం చేయాలి?



భూమి లేదు, బిల్డింగ్ లేదు, డాక్టర్ లేదు, ఎంబీబీఎస్ విద్యార్థి లేడు, రోగి కూడా లేడు. కానీ దర్భంగా (బిహార్) ఎయిమ్స్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాత్రం నియమితులయ్యారు. క్షేత్రస్థాయిలో ఏ పనీ చేయకుండా, కేవలం ఓటర్లను ఆకర్షించడానికి జిల్లా పట్టణాల్లో కొత్త ఎయిమ్స్‌లను రాజకీయ పోటీ కోసం ప్రకటించిన ఫలితం ఇది.
– జ్యోతి యాదవ్, జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.నవమి రా.2.43 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అనూరాధ రా.9.36 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.58 నుండి 4.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.33 వరకు, **అమృతఘడియలు:** ప.11.29 నుండి 1.02వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సారాంశం
సరికొండ చలపతి

అ – అమ్మ, ఆ – ఆవు

నేడు ఆవు కథ చెప్పుకునే సందర్భం..

..కానీ ముందు గాడిద కథతో మొదలు పెడదాం.

ఓ ఊర్లో ఒక రైతు, ఆయనకొక గాడిద ఉంది. అది బరువు పనులలో ఆయనకు సాయం చేస్తుంటుంది. రోజంతా దానితో పని చేయించుకుని సాయంత్రం ఓ చెట్టు కింద కట్టేస్తుంటాడు. ఆ చెట్టు పైనుంచి ఈ తతంగాన్ని చూస్తున్న దెయ్యం ఓ రోజు గాడిద కట్టు విప్పేసింది.

దానితో, గాడిద ఒళ్లు విరుచుకుని బయటకి పరిగెత్తి పక్కనే ఉన్న పొలంపై పడింది. దొరికిందల్లా తినేసింది. అక్కడే ఉన్న పొరుగు రైతు భార్య కోపంతో కర్ర పట్టుకుని గట్టిగా కొట్టడంతో గాడిద నెత్తిపై తాకి.. గట్టిగా ఓండ్ర పెడుతూ చనిపోయింది. దాని కేక విని బయటికి వచ్చిన గాడిద యజమాని పొరుగు రైతు భార్యను తిడుతూ ఆమె పైకి పెద్దరాయి విసిరాడు.. అది ఆమె ఆయువు పట్టుపై తాకి ఆమె మరణించింది. దాంతో సీన్ మరింత సీరియస్ అయ్యింది. విషయం తెలిసిన ఆమె భర్త అక్కడికి చేరుకుని కోపంతో, దుఃఖంతో చేతిలో ఉన్న గునపంతో గాడిద యజమానిని ఒక్క పోటు పొడిచాడు.. దానితో ఆయన కూడా హరీమన్నాడు. పరిస్థితి ముదిరింది. విషయం ఊరంతా పాకింది.

గాడిద యజమాని కొడుకులు అక్కడికి చేరుకున్నారు, అప్పటికే గాడిద యజమాని భార్య అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. ఆమె కొడుకులతో కలిసి పొరుగింటి రైతు ఇంటిని తగుల బెట్టేశారు.

ఇదంతా చూసిన పొరుగు రైతు ఆగ్రహం పట్టలేక గాడిద యజమాని, కొడుకులపై దాడి చేసి వారిని చంపినంత పని చేసి చెట్టుకింద కూచుంటాడు. అంతా కోల్పోయిన దుఃఖంతో ఉన్న ఆయన ఆ చెట్టు పైన చిద్విలాసంగా నవ్వుతున్న దెయ్యాన్ని చూసి , దీనంతటికి అసలు కారణం అదే అని గ్రహించాడు.

'.. ఎంత పని చేశావు , మేం నీకేం అపకారం చేశాం. నువ్వు ఇక్కడుంటున్నావని తెల్సీ మేమెవ్వరం నీ జోలికి రాలేదు.. ఇంత విధ్వంసానికి కారణమయ్యా ఎలా నవ్వుతున్నావ్.. ' అని దుఃఖంతో, కోపంతో ప్రశ్నించాడు.

దెయ్యం చెప్పిన సమాధానం ఏమిటనేది తర్వాత.. ఇప్పుడు ఆవు వ్యాసం చూద్దాం.

కల్చరల్ యాంగిల్..

అ – అమ్మ, ఆ – ఆవు.. మనం ఓనమాల నుంచే నేర్చుకున్నది. ఇవి కేవలం ఓనమాలు మాత్రమే కావు.. మన సంస్కృతి అమ్మ తర్వాత ఆవుకు ఇచ్చిన స్థానం అది.

ఇంతకీ విషయం ఏమిటంటే, వాలెంటైన్స్ డే –ఫిబ్రవరి 14 న 'కౌ హగ్ డే'గా జరుపుకోవాలని ఆ రోజు ఆవును కౌగిలించుకోవాలని కేంద్ర పశుసంరక్షక బోర్డు (ఏడబ్ల్యూబీఐ) ప్రకటన జారీ చేసింది,. ఇది స్వచ్ఛందమేనని చెప్పిందనుకోండి. గోవు భారత సంస్కృతికి , గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అనీ, ఆవును కౌగిలించుకుంటే పాజిటివ్ ఎనర్జీ వస్తుందనీ వివరించింది. ఆ మరుసటి రోజే కేంద్ర పశుసంవర్థక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల మంత్రులు ఈ నిర్ణయాన్ని ఆహ్వానించారు. ఈ ప్రకటనకు వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో మోత మోగింది, మీమ్‌ల వర్షం కురిసింది. రాజకీయవర్గాల్లో కూడా సర్వత్రా విమర్శలు రావడంతో ఆ ప్రకటనను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది.

'సోషల్' రెస్పాన్స్...

అయితే ఈ ప్రకటన జారీ, విత్ డ్రా వెనుక అందరిలో అనుమానాలు కనిపించాయి. ఆవును గౌరవించడం, ప్రేమించడం పట్ల ఎవరికీ అభ్యంతరాలు లేవు కానీ, ఈ ప్రకటన వెనుక సాంస్కృతిక, ఆరోగ్య కారణాల కన్నా రాజకీయ అంశాలే ఎక్కువగా ఊహించారు.

- ''మదర్స్‌డే, ఫాదర్స్‌డే, లవర్స్‌డే.. లాంటి పాశ్చాత్య సంస్కృతి వద్దు అనుకుంటే వాటిపై చిన్నప్పటి నుంచి పిల్లల్ని సెన్సిటైజ్ చేద్దాం. కౌ హగ్‌డే లాంటి ప్రయత్నాలు మరో ఉన్మాదానికి దారి తీస్తాయి...'
- 'ఇప్పటికే మన దేశంలో ఆవు చుట్టూ ఎన్ని కాంట్రవర్సీస్ డెవలప్ అవుతున్నాయో చూస్తున్నాం కదా.. ఇప్పుడిలాంటి ప్రయత్నాలు వాటికి మరింత ఆజ్యం పోస్తాయి..'
- 'నేను పెట్ లవర్ని, మీరు అన్నట్లుగా కాసు హగ్ చేసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేస్తా.. మీరన్నట్టుగా ప్రకృతిని, ఆవునూ ప్రేమిస్తా.. ఈ విషయాన్ని ఇంత కన్నా దూరం తీసుకువెళ్లే ప్రయత్నం మాత్రం చెయ్యవద్దు.. మేం గమనిస్తూనే ఉంటాం..'



హెల్త్ యాంగిల్....

విదేశాల్లో ఇప్పటికే ఈ ట్రెండ్ ఉంది. పెట్స్‌ను గానీ, ఆవును గానీ మనం హగ్ చేసుకుంటే ఆక్సిటోసిన్ విడుదలై ఒత్తిడి తగ్గుతుంది. వ్యాయామం, మెడిటేషన్, యోగా, మ్యూజిక్ వినడం లాంటిదే ఈ హగ్ థెరపీ కూడా! అమెరికా, నెదర్లాండ్స్ లాంటి దేశాల్లో ఈ పద్ధతి చాలా కాలంగా ఉంది. గోవులతో కూడిన ఫామ్‌లలో వెల్‌నెస్ సెంటర్‌లు కూడా అక్కడ ఉన్నాయి. ఈ ఫామ్‌లో కుందేళ్లు, రకరకాల పెట్స్ కూడా ఉంటుంటాయి,

పొలిటికల్ యాంగిల్...

కానీ, ఇండియాలో గోవు చుట్టూ ఎన్ని సున్నితాంశాలు, మతపర విషయాలు నెలకొని ఉన్నాయో మనకు తెలుసు. పశుసంరక్షక బోర్డు నుంచి ప్రకటన వెలువడగానే సోషల్ మీడియాలో ఈ కామెంట్స్ వినిపించాయి

- 'బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం మొదలయ్యిందన్న మాట..'
- '' రాజకీయాలెంతైనా చేసుకోండి. ఎవరి దారి వారిది .. మనం ఎంతగానో ఇష్టపడే, గౌరవించే భారతీయ సంస్కృతిని రాజకీయ వీధుల్లో నిలబెట్టి, ఎన్నికల సరుకుగా మార్చితే సమంజసం కాదు.'

ఓ నెటిజెన్ ఇంకాస్త అడుగు ముందుకు వేసి ఇలా అంటున్నారు

'ప్రపంచవ్యాప్తంగా కొంత కాలంగా దేశ సంస్కృతి, మతపర జాతీయవాదం ఎన్నికలలో కనిపిస్తున్నాయి. టర్కీ, లాటిన్ అమెరికా, పశ్చిమ యూరప్, ఒకనాడు సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉన్న దేశాలలో దీని ప్రభావం బాగా కనిపిస్తోంది. భిన్న మతాలు , భిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో ఇలాంటి పోకడలను మేధావులు నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రజలను అలర్ట్ చేయాల్సి ఉంది...'

ఇక దెయ్యం సమాధానం

నవ్వుతూనే దెయ్యం ఇలా జవాబు చెప్పింది

'.. నేనేం తప్పు చేశాను! చాలా కాలంగా గాడిదతో పనిచేయించుకుని కట్టిపడేస్తున్నారు. పెద్ద మనసుతో గాడిద కట్టువిప్పి దానికి సాయం చేశాను. నేను గాడిదను చంపానా, నీ భార్యను చంపానా, లేక నీ ఇల్లు తగులబెట్టానా, గాడిద యజమానిని చంపానా, వారి భార్యాపిల్లలను చితక్కొట్టానా..? .. చేసుకుందంతా మీరే. పైగా నన్నాంటారేమిటీ..' – అని ఎదురు ప్రశ్నించింది.

ఇంకొంచెం చిద్విలాసంగా... 'నేను ఒక్క గాడిద కట్టు విప్పినందుకే ఇలా కొట్టుకు చచ్చారు. గోవులాంటి అనేక సున్నితాంశాలను మీ మధ్యకు వదిలే ప్రయత్నం చేస్తున్నారు. అదెటు దారితీస్తుందో మీకు అర్థం అవుతోంది కదా?...' అని మాయమయ్యింది.

....

కేంద్ర పశుసంరక్షక బోర్డు కౌ హగ్‌పై ప్రకటన జారీ చేశాక, ఆ వార్త వెలువరించిన వీడియోల కింద మెసేజ్‌లు, సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన మీమ్స్ చూడండి..

కత్తులు నూరుతున్న శబ్దం వినిపిస్తుంది.

సున్నితాంశాలు కట్లు తెంపుకుని వచ్చినా, ఎవరైనా కట్లు తెంపి పంపినా ఈ కత్తులకు మరింత పదును పెరిగే ప్రమాదం ఉంది.

నా ఇంటి తలుపులు తెరిచే ఉంచా...



ఎవరైనా నీ హృదయాన్ని పగులగొట్టినపుడు
ఎవరైనా నిన్ను ఒంటరిగా వదిలేసినపుడు
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నా ఇంటి తలుపులు తెరిచి ఉంచా నీ కోసమే
ఎపుడు తెరిచే ఉంటాయి నీ కోసమే

ఇపుడు నా అవసరం లేదు నీకు
ప్రేమించేవారు ఎందరో నీకు
అందమైన ప్రవాహం నువ్వు
కావాలని కోరుకుంటే నువ్వు
వికసించవా ఎన్నో కలువలు

అద్దంలో నీ నీడ భయపెడితే
నీ యవ్వనం వసివాడుతుంటే
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నీకు నేను ఎపుడు అభివాదం చేస్తూనే ఉంటాను

ప్రేమకు పరతులు ఉండవు
నీ ప్రేమ పరతులతో నిండింది
నీ చూపులో నక్షత్రాలవెలుగు నిండింది
నీ దృష్టిలో నువ్వు పడిపోయినపుడు
నీ అంధకారంలో నువ్వే కూరుకున్నపుడు
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నేను దీపాలు వెలిగించి ఉంచాను నీ కోసమే

– అరుణ డేనియల్

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం మిర్చి ముంచెత్తింది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా రైతులు 60,132 బస్తాల మిర్చిని విక్రయానికి తీసుకొచ్చారు. ఈనెల 7న 56,664 బస్తాలు రాగా సోమవారం మరో 3 వేలకు పైగా బస్తాలు అదనంగా వచ్చాయి. పంట కోతలు జోరందుకోవటంతో విక్రయాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాతో పాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, హన్మకొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు ఇక్కడికి మిర్చి తీసుకొస్తున్నారు. ఈమేరకు మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.18,150, కనిష్టంగా రూ.12 వేల ధర పలకగా, కొనుగోళ్లను మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం పర్యవేక్షించారు.

ఆశ వర్కర్‌గా వచ్చి బాలికకు సూదిమందు ఇచ్చి..

- కిడ్నాప్‌చేసేందుకు యత్నించి ఉండొచ్చని అనుమానం
- పుట్టోనిపల్లితండాలో ఇంజెక్షన్ కలకలం
- ఆలస్యంగా వెలుగులోకి...

నవాబుపేట: పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న గిరిజన బాలికకు గుర్తు తెలియని మహిళ ఇంజెక్షన్ ఇచ్చి పరారైన ఘటన కలకలం రేపుతోంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని పుట్టోనిపల్లితండాలో చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తండాకు చెందిన అలివేలు, లక్ష్మణ్‌నాయక్ దంపతుల కూతురు అనన్య (8) తండాలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. గత శుక్రవారం పాఠశాల వదిలిన తర్వాత అనన్య ఒంటరిగా రోడ్డుపక్కన ఆడుకుంటుండగా గుర్తు తెలియని మహిళ ఆశ కార్యకర్త మాదిరి వచ్చి విద్యార్థిని స్కూల్ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేసింది. దీంతో బాలిక బ్యాగ్‌ను లాక్కుంటున్న తరుణంలో సదరు మహిళ బాలిక చేతికి ఇంజెక్షన్ చేసింది. బాలిక కేకలు వేయడంతో ఆ మహిళ పారిపోయింది. ఎవరో తెల్లచీర కట్టుకున్న మహిళ బెదిరించి తన చేతికి ఇంజెక్షన్ చేసిందని ఆ బాలిక ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పింది. అప్పటికే బాలిక జ్వరంతో ఉండటంతో తల్లి ఇంట్లో ఉన్న జ్వరం మాత్ర వేసింది. కానీ, మరుసటి రోజు ఉదయం జ్వరం తగ్గకపోగా వాంతులు, విరేచనాలు కూడా కావడంతో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. సోమవారం సైతం బాలికకు జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులు నవాబుపేట ఎస్‌ఐ పురుషోత్తంకు ఘటన వివరాలు తెలిపారు. అయితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు. కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించి ఉంటారని, బ్యాగును లాక్కుంటే పాప తమ వెంట వస్తుందని భావించి ఉంటారని బాలిక తండ్రి లక్ష్మణ్ నాయక్ చెప్పారు.

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను ఇంకా రద్దు చేయలేదేం?

- సర్కార్‌కు హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను ఇంకా ఎందుకు రద్దు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా మాస్టర్ ప్లాన్‌పై ముందుకెళ్లవద్దని అధికారులకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేసింది. రైతులను సంప్రదించకుండానే కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ రూపొందించారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిల్ వేశారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపటి ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

21 నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

- వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహణ
- ఆహ్వాన పత్రిక ముద్రించి పూజలు చేసిన ఆచార్యులు
- 28న జరిగే శ్రీస్వామివారి కల్యాణానికి రానున్న సీఎం?



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలకు పూజలు చేస్తున్న ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన తరువాత జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు కావడంతో అధికారులు మరింత ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలకు ఆలయ ఆచార్యులతో అధికారులు సోమవారం పూజలు చేయించారు.

బ్రహ్మోత్సవాలలో జరిగే పూజా కార్యక్రమాలు ఇవీ..

- 21వ తేదీ ఉదయం 10గంటలకు విష్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోహన జరిపిస్తారు.
- 22న ఉదయం 8గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.30గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవనం.
- 23న ఉదయం అలంకార, వాహన సేవలకు శ్రీకారం చుడతారు. ఉదయం 9గంటలకు మత్స్యావతార అలంకార సేవ, వేదపారాయణం. రాత్రి 7గంటలకు శేష వాహన సేవ ఉంటుంది.
- 24న ఉదయం 9గంటలకు వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి 7గంటలకు హంస వాహన సేవ.
- 25న ఉదయం 9గంటలకు శ్రీకృష్ణాలంకార సేవ. రాత్రి 7గంటలకు పొన్న వాహన సేవ.
- 26న ఉదయం 9గంటలకు గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి 7గంటలకు సింహ వాహన సేవ.
- 27న ఉదయం 9గంటలకు జగన్మోహిని అలంకార సేవ. రాత్రి 7గంటలకు అశ్వవాహన సేవ, అనంతరం శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం.
- 28న ఉదయం 9గంటలకు శ్రీరామ అలంకార (హనుమంత వాహనం) సేవ. రాత్రి 8గంటల నుంచి గజవాహన సేవ, శ్రీస్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం.
- మార్చి 1వ తేదీన ఉదయం 9గంటలకు గరుడ వాహన సేవ. రాత్రి 7గంటల నుంచి దివ్య విమాన రథోత్సవం.
- 2వ తేదీన ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం. సాయంత్రం 6గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన.
- 3వ తేదీన ఉదయం 10గంటలకు శ్రీస్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు సమాప్తి అవుతాయి.

ఉత్తర మాడవీధిలో కల్యాణం..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ప్రధానాలయ ఉత్తర మాడవీధిలో తిరుకల్యాణ వేడుకను నిర్వహించనున్నట్లు అధికారులు ఆహ్వాన పత్రికలో తెలియజేశారు. ఈ కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.3,000 చెల్లించి శ్రీస్వామి వారి ఆశీస్సులు పొందాలని అధికారులు కోరుతున్నారు.

కల్యాణానికి సీఎం వచ్చే అవకాశం

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 28వ తేదీన రాత్రి శ్రీ స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం జరగనుంది. ఈ కల్యాణ వేడుకకు ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పించేందుకు ఆ రోజు ఉదయం సీఎం కేసీఆర్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే ఆలయ అధికారులు, అర్చకులు సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక ఇవ్వనున్నారు.

ఇన్విజిలేటర్ మందలించాడని.. ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ఫీజు కోసం వేధించారని మృతురాలి తండ్రి ఆరోపణ



రమాదేవి (ఫైల్)

మేడిపల్లి: పరీక్షాహాల్‌లో ఇన్విజిలేటర్ మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీ చైతన్య కాలేజీ ఇంటర్ విద్యార్థిని రమాదేవి (17) కళాశాల హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కర్నూల్ జిల్లా, బల్కూరు మండలం చెంచుగూడ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నిమ్మల రాములు కుమార్తె రమాదేవి మేడ్చల్ జిల్లా ఫీర్జాదిగూడలోని శ్రీ చైతన్య కాలేజీలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా సోమవారం బోటనీ పరీక్ష రాస్తున్న సమయంలో ఇన్విజిలేటర్ రమాదేవిని మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై పరీక్ష పూర్తికాగానే కళాశాల హాస్టల్ మూడవ అంతస్తులోని తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు ఆమెను కిందకు దింపి వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విషయం తెలియగానే ఏఐఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్, ఎస్ఎఫ్ఐ, ఎస్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కళాశాలలో ఒత్తిడి, వేధింపుల వల్లనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. ఆందోళనకారులను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రమాదేవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు కోసమే వేధించారు..!

బల్కూర్: గత వారం తన కూతురిని ఫీజు కోసం పదేపదే అడిగారని, వేరుశనగ పంట డబ్బులు చేతికొచ్చిన తర్వాత చెల్లిస్తామని చెప్పామని నిమ్మల రాములు చెప్పారు. అయినా వినకుండా పదేపదే ఫీజు చెల్లించాలని తోటి విద్యార్థుల ముందు అవమానించడంతో భరించలేక ఆత్మహత్య చేసుకుందని ఆయన ఆరోపిస్తున్నారు. తన కుమార్తె మృతదేహాన్ని కళాశాల యాజమాన్యం గాంధీ ఆస్పత్రికి తరలించి అక్కడ అడ్రస్ లేకుండాపోయిందని మండిపడ్డారు. విద్యార్థిని మృతితో చెంచుగూడెంలో విషాదం ఏర్పడింది. రాములు గ్రామంలో తనకున్న ఎకరా భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

'ఆర్టీఐకి ఎన్ని దరఖాస్తులు చేసినా.. సమాధానం లేదు'

సాక్షి, హైదరాబాద్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో భారీగా అవినీతి జరుగుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమళ్ల సమ్మయ్య ఆరోపించారు. పథకాల అమలు, నిధుల వినియోగంపై ప్రాజెక్టు స్థాయిలో సమాచారాన్ని తెలుసుకునేందుకు పదుల సంఖ్యలో సమాచార హక్కు చట్టం కింద దర ఖాస్తు చేసుకున్నా.. ఒక్క దానికి కూడా సమాధానం రాలే దని తెలిపారు. కనీసం సమాచారాన్ని ఎందుకు వెల్లడించడంలేదనే కారణాన్ని కూడా ఆ శాఖ అధికారులు చెప్పకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని 145 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో పలు పథకాల్లో అవినీతిపై ఒక మేజిస్ట్రేట్ స్థాయి అధికారి విచారించి బహిర్గతం చేసినప్పటికీ ఆ అంశాలపైన మహిళాభివృద్ధి శాఖ చర్యలు తీసుకోకపోవడం గమనార్హమని సమ్మయ్య పేర్కొన్నారు. ఉన్నతాధికారి నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు అవినీతి తాండవిస్తోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాజెక్టులపై దరఖాస్తులకూ సమాధానాలు రాలేదన్నారు.

అభివృద్ధి నిధుల విడుదలపై కౌంటర్ వేయండి

- ఎమ్మెల్యే రఘునందన్ పిటిషన్‌పై హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్), అసెంబ్లీ అభివృద్ధి నిధుల (ఏడీఎఫ్) విడుదల, కేటాయింపుపై వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నియోజకవర్గ నిధుల విడుదలలో వివక్షపై దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. మూడేళ్లగా దుబ్బాక నియోజకవర్గానికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని, సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలను కోర్టుకు అందజేశారు. బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగానే నియోజకవర్గానికి ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ఇవ్వడం లేదని... అధికార పార్టీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మాత్రం ఈ నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదిస్తూ ప్రభుత్వ నిర్ణయం వల్ల దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. దీనిపై తక్షణమే స్పందించి ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అనంతరం అదనపు ఏజీ రామచంద్రరావు వాదిస్తూ ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు అంశం శాసనసభ పరిధిలోనిదని, సీఎం, శాసనసభ నిర్ణయాలకు అనుగుణంగా కేటాయింపులు ఉంటాయని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రధాన కార్యదర్శి, జీఏడీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లతోపాటు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు. 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.

488 కేజీలు... రూ.97 లక్షలు

- భద్రాచలంలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఖమ్మంలో 401 కిలోలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎస్పీ వినీత్, పోలీసు అధికారులు

కొత్తగూడెంటౌన్/ఖమ్మం క్రైం: భారీ మొత్తంలో నిషేధిత గంజాయిని తరలిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెంలో సోమవారం ఎస్పీ డాక్టర్ వినీత్ చెప్పిన వివరాలిలా.. విశ్వసనీయ సమాచారంతో భద్రాచలం ఫారెస్టు చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం సాయంత్రం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీసీఎస్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. భద్రాచలం బ్రిడ్జి వద్ద 2 ఇన్నోవా కార్ల డ్రైవర్లు పోలీసులను చూసి కార్లను వదిలేసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. సారపాక సమీపాన తాళ్లగొమ్మూరుకు చెందిన డి.శివశంకర్, భద్రాచలం సారపాక కాలనీకి చెందిన నాగేంద్రబాబు పట్టుబడగా, వీరి వాహనాల్లో రూ.97.60 లక్షల విలువైన 488 కేజీల గంజాయి లభించింది. గతంలోనూ శివశంకర్‌పై గంజాయి తరలింపు కేసులు ఉండగా, పీడీ యాక్ట్ నమోదుకు ప్రతిపాదించినట్టు ఎస్పీ వినీత్ తెలిపారు.

ఖమ్మంలో రూ.40లక్షల విలువైన గంజాయి

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి మహారాష్ట్రలోని అకోలా పట్టణానికి డీసీఎంలో తరలిస్తున్న గంజాయిని ఖమ్మం టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్ వివరాలు వెల్లడించారు. అకోలాకు చెందిన షేక్ ఆసిఫ్, సాజిద్ అహ్మద్ ఖాన్ విశాఖ నుంచి డీసీఎంలో గంజాయి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏసీపీ గణేష్ ఆధ్వర్యాన టూటౌన్ పోలీసులు ఆదివారం టేకులపల్లి బ్రిడ్జి వద్ద తనిఖీ చేపట్టగా 401 కేజీల ఎండు గంజాయి(పొడిరూపం)ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.40లక్షలు ఉంటుందని , స్వాధీనం చేసుకున్న వ్యాన్‌తో కలిపితే మొత్తం సొత్తు విలువ రూ.62లక్షలు ఉంటుందని సీపీ చెప్పారు.

100 కేజీల గంజాయి పట్టివేత ?

భద్రాచలం అర్బన్: భద్రాచలం పట్టణంలో ఆదివారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీసీఎస్ పోలీసులు, భద్రాచలం టౌన్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో రెండు కార్లలో వంద కేజీల గంజాయిని తరలిస్తున్న ఐదుగురు పట్టుబడినట్లు తెలిసింది. ఈ ఐదుగురిలో ఢిల్లీకి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ ఉన్నట్టు సమాచారం. ఈ విషయమై పోలీసులు ఇంకా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. కాగా గత శనివారం 488 కేజీల గంజాయి పట్టుబడగా, సోమవారం ఆ వివరాలను ఎస్పీ వినీత్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

కేసీఆర్ మాటల్లో నిర్వేదం.. తడబాటు

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం గెలిచిందా లేక నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు గెలిచారా అన్న దానిపై పబ్లిక్‌పోల్‌కు సీఎం కేసీఆర్ సిద్ధమా? అని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సవాల్ విసిరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో కేసీఆర్ మాట లు నిర్వేదంతో కూడుకుని ఉన్నాయని, తడబడుతున్నట్టు కనిపించారని అన్నారు. కేసీఆర్ ప్రసంగంలో సవాళ్లు కనిపించలేదని, కేవలం విజ్ఞప్తులతోనే సాగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను మచ్చిక చేసుకుంటున్నట్టు, బీజేపీనేత ఈటల రాజేందర్‌కు స్నేహం హస్తం అందిస్తున్నట్టు మాట్లాడే ప్రయత్నం చేశారన్నారు. మేకిన్ ఇండియా జోకిన్ ఇండియా కాదని గ్రహించాలన్నారు. మోదీ కర్మయోగే కానీ, క్యాష్ యోగి కాదన్నారు. కేసీఆర్ బడ్జెట్‌కు లెక్కలు లేవు, ఎక్కాలు లేవని ఎద్దేవా చేశారు. బీసీలకు బడ్జెట్‌లో సున్నా కేటాయింపులున్నాయని విమర్శించారు.

'బీఆర్ఎస్ సర్కార్‌కు ఇదే చివరి బడ్జెట్ భేటీ'

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ సర్కార్‌కు, సీఎం కేసీఆర్‌కు ఇవే చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో యావత్ సభా సమయాన్ని రాజకీయాలకే ఉపయోగించుకున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. బడ్జెట్‌పై, పద్దులపై, అంచనాలపై చర్చలు జరిపి ఆర్థిక పరిస్థితి మెరుగునకు చర్యలు చేపట్టాల్సింది పోయి, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మొత్తం రాజకీయ అంశాలకే పరిమితం చేశారన్నారు. సోమవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ కాస్తా కేసీఆర్ ప్రసంగాలతో రాజకీయసభలా, బహిరంగసభ మాదిరిగా సాగిందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికార బంధం ఉండబోతోందనేది కేసీఆర్ మాటలతో స్పష్టమైందన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్-ఎంఐఎంల మధ్య చీకటి ఒప్పందం ఉందని ప్రభాక ర్ ఆరోపించారు. సరికొత్త రాజకీయ సమీకరణాలకు నాందిగా, పునాదిగా కేసీఆర్ ప్రసంగాలున్నాయన్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖేల్ ఖతమై, బీజేపీ ఖేల్ షురూ అయిందని తెలిపారు. గవర్నర్ల నియామకాలపై కూడా విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని గవర్నర్‌ను చేస్తే రాజకీయ రంగు పులమడం దిగజారుడుతనానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు.

ఆర్గానిక్ ఆలోచన భేష్!

- రైతు రామారావుకు మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందనలు
- 'సాక్షి'లో వచ్చిన కథనంతో రైతుకు ఫోన్



ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలకకు చెందిన ఆదర్శ రైతు చెరుకూరి రామారావు తన కుమారుడి వివాహాన్ని ప్లాస్టిక్‌కు దూరంగా, సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల వంటలతో జరిపించారు. ఈ విషయమై 'ఆదర్శ రైతు ఇంట.. ఆర్గానిక్ పెళ్లంట'శీర్షికన ఆదివారం 'సాక్షి'ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. ఇది చూసిన వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి రైతు రామారావుకు సోమవారం ఫోన్ చేసి మాట్లాడారు. ఆర్గానిక్ పెళ్లి చేయటం అభినందనీయమని చెబుతూ వధూవరులు కిరణ్, ఉదయశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి ఖమ్మం పర్యటనకు వచ్చినప్పుడు కోయచెలకలోని ఆర్గానిక్ క్షేత్రాన్ని సందర్శిస్తానని, మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన కిరణ్ స్వయంగా ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

కలెక్టరేట్‌పై దంపతుల ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేస్తున్న దంపతులు

జనగామ: తమ తాతనుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి.. అన్యాయం చేశారని ఆరోపిస్తూ సోమవారం జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్ పైకి ఎక్కి ఓ దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇలా వీరు ఈ సమస్యపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఇది మూడోసారని తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగారావు, రేవతి దంపతులు బతుకు దెరువు కోసం ఐదేళ్ల క్రితం ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఏలుబాకకు వెళ్లారు. అక్కడ నర్సింగారావు కారు డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా, గ్రామంలో తమ తాత నుంచి వారసత్వంగా వచ్చిన 4 ఎకరాల భూమిని అప్పటి తహసీల్దార్ రమేశ్, వీఆర్ఓ క్రాంతి అదే గ్రామానికి చెందిన కొందరి పేరిట రిజిస్ట్రేషన్ చేశారని నర్సింగారావు ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎన్ని సార్లు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసి..: నర్సింగారావు దంపతులు ఉదయం 11 గంటల తర్వాత గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లనుంచి తమ సమస్య పరిష్కారంకోసం తిరుగుతున్నామని, త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. 'మీకు న్యాయం జరిగేలా చూస్తున్నా.. కొంత ఆలస్యం జరుగుతుంది, కొద్దిగా ఓపిక పట్టండి'అని సమాధానం చెప్పారు. అయితే ఓపిక నశించిన ఆ దంపతులు కలెక్టరేట్ పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నర్సింగారావు దంపతులు ఒంటిపై డీజిల్ పోసుకుని చేతిలో అగ్గిపెట్టె పట్టుకుని.. తాము చచ్చిపోతున్నామని, ఇక్కడ న్యాయం జరగదని అరవడంతో అక్కడికి వచ్చిన అధికారులు, పోలీసులు, జనం గంటసేపు వారిని బతిమిలాడారు. చివరికి పై నుంచి ఆ దంపతులపై నీళ్లు పోయగా, అక్కడే ఉన్న పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకుని కిందకు తీసుకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం తహసీల్దార్ రవీందర్ వారితో మాట్లాడారు. పట్టా రద్దు వ్యవహారం కోర్టు ద్వారా రావాల్సి ఉందని.. తమ చేతుల్లో లేదని, కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని దంపతులకు చెప్పి పంపించారు.

ఫిర్యాదు చేసినందుకు వేధింపులు, చిత్రహింసలు..



సిద్దప్పతో మాట్లాడుతున్న ఎస్సై ఉదయ్ శేఖర్

కామారెడ్డి క్రైం: వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని, పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారని ఓ యువకుడు కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. మద్నూర్ మండలం అవల్‌గావ్ గ్రామానికి చెందిన పి. సిద్దప్ప సోమవారం ప్రజావాణి జరుగుతున్న సమయంలో కలెక్టరేట్ వద్దకు వచ్చాడు. ప్రధాన గేటు వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఉదయ్ శేఖర్ ఇది గమనించి అతడిని అడ్డుకున్నారు. ఎందుకు ఇలా చేశావని సిద్దప్పను అడగ్గా, తాను గతేడాది మే నెలలో మద్నూర్ మార్కెట్ కమిటీలో జరిగిన రూ. 5 కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, కానీ ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని చెప్పాడు. ఫిర్యాదు చేసిన విషయాన్ని స్థానిక అధికారుల ద్వారా తెలుసుకున్న అధికార పార్టీ నాయకులు తనపై లేనిపోని కేసులు పెట్టిస్తున్నారని వాపోయాడు. మద్నూర్ పోలీస్ స్టేషన్లో థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలకు గురి చేశారనీ, కుటుంబ సభ్యులను కూడా భయభ్రాంతులకు గురి చేయడంతో వారు స్థానికంగా ఉండటానికి భయపడుతున్నారని తెలిపాడు. ఈ ఏడాది జనవరి 23న కూడా తనపై జరుగుతున్న వేధింపులు, చిత్రహింసలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, లేదంటే ఆత్మహత్యకు అనుమతి ఇవ్వాలని దరఖాస్తు ఇచ్చానని తెలిపాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని వివరించాడు. మార్కెట్ కమిటీ పరిధిలో జరిగిన అవినీతిపై తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నాయని చెప్పాడు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడిస్తామని పోలీసులు అతడిని కార్యాలయంలోనే కొద్దిసేపు ఉంచారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కలెక్టరేట్ వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటన విషయంలో అధికారుల తీరుపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై కలెక్టరేట్ పాలనాధికారి రవీందర్‌ను వివరణ కోరగా, ఆత్మహత్యకు యత్నించడం సరికాదన్నారు. జరిగిన ఘటన ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. అన్నింటిపై కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

క్లుప్తంగా...

ఏ చర్యలకైనా సిద్ధం!

చైనా నిఘా బెలూన్లపై సునాక్



లండన్: తమ దేశాన్ని భద్రంగా ఉంచేందుకు ఎటువంటి చర్యకైనా వెనుకాడబోమని బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ అన్నారు. అట్లాంటిక్ మిత్ర దేశాలతో నిత్యం టచ్‌లో ఉంటూ, రక్షణపరంగా సన్నద్ధతతో ఉన్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన ఉత్తర ఇంగ్లండ్‌లోని ఓ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశాన్ని సురక్షితంగా ఉంచేందుకు అవసరమైన ఎటువంటి చర్యలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రజలు గ్రహించాలని కోరారు. తమ దేశ గగనతలాన్ని కాపాడుకునేందుకు టైఫూన్ యుద్ధ విమానాలను అప్రమత్తంగా ఉంచామన్నారు. అనుమానిత చైనా నిఘా బెలూన్లను అమెరికా సైన్యం కూల్చివేయడం, యూకేకు కూడా బెలూన్ల బెడద ఉందన్న వార్తలపై రిషి పై విధంగా స్పందించారు.

ఆకాంక్షలను నెరవేర్చండి


కొలీజియం సిఫార్సులపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకం, బదిలీల విషయంలో కొలీజియం ఆకాంక్షలను(సిఫార్సులను) చాలావరకు నెరవేర్చాలని(ఆమోదించాలని) కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. కొలీజియం సిఫార్సులను ఆమోదించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై జస్టిస్ ఎస్కే కౌల్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జడ్జీల నియామకానికి సంబంధించి కొన్ని అంశాల పట్ల తాము ఆందోళన చెందుతున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణకు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరు కాలేదు. కొలీజియం సిఫార్సులను చాలావరకు ఆమోదించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని అటార్నీ జనరల్‌కు తెలియజేయాలని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 2వ తేదీకి వాయిదా వేసింది.

మేమొస్తే త్రిపుర అభివృద్ధి: మోదీ

అగర్తల: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల లబ్ధి పొందని కుటుంబం త్రిపురలో లేనే లేదని ప్రధాని మోదీ అన్నారు. ప్రశాంతత, అభివృద్ధి కావాలంటే బీజేపీకే ఓటేయాలని ప్రజలను కోరారు. అగర్తలాలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. విశ్వాసపాత్రుడైన సేవకుని మాదిరిగా బీజేపీ త్రిపుర అభివృద్ధికి పనిచేస్తుందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఎంలు అధికారంలోకి వస్తే రాష్ట్రం వెనుకబాటుకు గురవుతుందన్నారు.

ఎవరీ ప్రభాకరన్?



బతికే ఉన్నాడన్న ప్రకటనతో కలకలం

ప్రత్యేక తమిళ రాజ్యం కోసం శ్రీలంకలో నెత్తుటేర్లు

హతమార్చినట్టు 2009లోనే ప్రకటించిన లంక సైన్యం

వేలుపిళ్లై ప్రభాకరన్. తమిళులకు ఆరాధ్యుడు. శ్రీలంక ప్రభుత్వం దృష్టిలో రక్తపుటేర్లు పారించిన ఉగ్రవాది. భారత్ దృష్టిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని పొట్టన పెట్టుకున్న హంతకుడు. 2009లో శ్రీలంక సైన్యం దాడిలో హతమైనట్టు ప్రపంచమంతా నమ్ముతుండగా, ఆయన బతికే ఉన్నారంటూ తమిళ నేత నెడుమారన్ తాజాగా చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది...

పెద్దపులిగా పేరుబడ్డ ప్రభాకరన్‌ది ఆద్యంతం ఆసక్తికర ప్రస్థానం. శ్రీలంకలోని తమిళులకు ప్రత్యేక దేశం కావాలన్న ఆశయ సాధనకు మూడు దశాబ్దాలకు పైగా లంక సైన్యంపై సాయుధ పోరాటం సాగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులకు ఆరాధ్య నాయకుడిగా కీర్తి పొందిన ప్రభాకరన్ 1954 నవంబర్ 26న శ్రీలంకలోని ఉత్తర తీర ప్రాంత పట్టణం వల్వెట్టితురైలో జన్మించారు. ఆయన తండ్రి ప్రభుత్వ అధికారిగా పనిచేశారు. స్థానిక సింహళీయులు, లంక సైనికుల అరాచకాలను కళ్లారా చూసిన ప్రభాకరన్ తట్టుకోలేకపోయారు. బడి మానేసి విప్లవోద్యమం వైపు అడుగులేశారు.

ఎల్టీటీఈ... 'త్రివిధ' ఉగ్ర సంస్థ!

ప్రభాకరన్ తొలుత తమిళుల ఆందోళన కార్యక్రమాలు, నిరసనల్లో పాల్గొన్నారు. నెమ్మదిగా తమిళ యువకులను చేరదీసి 1972లో 'తమిళ్ న్యూ టైగర్స్' పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. 1975లో దాని పేరును లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ)గా మార్చారు. అప్పటినుంచి మూడు దశాబ్దాల పాటు ఎల్టీటీఈ పేరు ప్రపంచమంతటా మారుమోగింది. టైగర్స్, సీ టైగర్స్ (నావికాదళం), ఎయిర్ టైగర్స్ (వైమానిక దళం) పేరిట త్రివిధ దళాలున్న ఏకైక ఉగ్రవాద సంస్థగా ఎల్టీటీఈ చరిత్ర సృష్టించింది! అంతేగాక ఎల్టీటీఈలో ఆత్మాహుతి దళాలను, 'సైనేడ్ మరణాల'ను ప్రవేశపెట్టి ప్రభాకరన్ సంచలనం సృష్టించారు. తమిళులకు ప్రత్యేక దేశం కోసం లంక సైన్యంతో ఎల్టీటీఈ దళాలు ఏళ్ల తరబడి హోరాహోరీ తలపడ్డాయి. ఈ యుద్ధంలో లక్ష మందికి పైగా బలయ్యారు. బాధితుల్లో సింహళ జాతీయులతో పాటు తమిళులు కూడా ఉన్నారు. తమిళులు ముద్దుగా 'తంబి' అని పిలుచుకొనే ప్రభాకరన్ ఆయుధాలతో పాటు కొన్నిసార్లు దౌత్య మార్గాన్ని కూడా ప్రయత్నించి విఫలమయ్యారు. 1985లో భారత చొరవతో, 2002లో నార్వే మధ్యవర్తిగా శ్రీలంక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఇంటర్‌పోల్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దర్యాప్తు సంస్థలు ప్రభాకరన్‌ను మోస్ట్ వాంటెడ్‌గా ప్రకటించాయి.

రాజీవ్ హత్య

ప్రముఖ నేతలను పాశవికంగా పొట్టన పెట్టుకున్న తీరు ఎల్టీటీఈ రక్తచరిత్రలో ఓ ప్రత్యేక అధ్యాయం. భారత ప్రధాని రాజీవ్‌గాంధీ శాంతి పరిరక్షణ పేరిట లంకకు భారత సైన్యాన్ని పంపడంతో ప్రభాకరన్ తీవ్రంగా మండిపడ్డారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరులో మానవ బాంబు దాడితో ఆయనను బలి తీసుకున్నారు. అనంతరం 1993లో శ్రీలంక అధ్యక్షుడు రణసింఘె ప్రేమదాస కూడా ఎల్టీటీఈ ఆత్మాహుతి బాంబు దాడికి బలయ్యారు. అంతేగాక చంద్రికా కుమారతుంగ, మైత్రిపాల సిరిసేన సహా పలువురు లంక అధ్యక్షులను, ప్రధానులను హతమార్చేందుకు ఎల్టీటీఈ విఫలయత్నం చేసింది. ఇక దాని దాడుల్లో బలైన శ్రీలంక మంత్రులు, రాజకీయ నాయకులు, సైనిక ఉన్నతాధికారుల జాబితాకైతే అంతు లేదు!

వెంటాడి, వేటాడి...

దశాబ్దాలపాటు నెత్తుటేర్లు పారించిన ఎల్టీటీఈపై మహింద రాజపక్సె హయాంలో లంక సైన్యం ఉక్కుపాదం మోపింది. ముప్పేట దాడితో సంస్థను నిర్వీర్యం చేసింది. మిగిలిన కొద్దిమందీ చెల్లాచెదురయ్యారు. ప్రభాకరన్ కూడా మారుమూల ప్రాంతాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది! ఆయన కోసం సైన్యం కనీవినీ ఎరగని రీతిలో వేటకు దిగింది. చివరికి 2009 మే 18న శ్రీలంకలోని ముల్లైతీవులో హోరాహోరీ పోరాటంలో ప్రభాకరన్‌ను మట్టుబెట్టినట్టు ప్రకటించింది. మృతదేహం ఫొటోలను కూడా విడుదల చేసింది. దాడిలో అతని కుమారుడు బాలచంద్రన్ కూడా చనిపోయినట్టు పేర్కొంది.

కొడుకు, కూతురు సజీవమే?

ప్రభాకరన్ వ్యక్తిగత జీవితం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. 1984 అక్టోబర్ 1న చెన్నై సమీపంలోని తిరుపోరూర్‌లో మదివదనిని ఆయన పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె ద్వారక, కుమారులు చార్లెస్ ఆంథోనీ, బాలచంద్రన్ ఉన్నారు. బాలచంద్రన్ లంక సైనికుల చేతిలో మరణించగా మిగతా వారి ఆచూకీ తెలియదు. వారు లంకలో లేరని, విదేశాల్లో తలదాచుకుంటున్నారని తమిళులు నమ్ముతుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభాకరన్ బతికే ఉన్నారు

- త్వరలోనే జనం ముందుకొస్తారు
- తమిళ జాతీయోద్యమ నేత నెడుమారన్

సాక్షి, చెన్నై/తంజావూర్: లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈళం(ఎల్టీటీఈ) అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ బతికే ఉన్నారని తమిళ జాతీయోద్యమ నేత పాళ నెడుమారన్ సంచలన ప్రకటన చేశారు. "ప్రభాకరన్ గురించి కొందరు పథకం ప్రకారం రేకెత్తించిన అనుమానాలకు నేను తెరదించుతున్నా. భార్యా కూతురితో సహా ప్రభాకరన్ క్షేమంగా ఉన్నారు. ఆయన జనం ముందుకు రావడానికి ఇప్పుడు పూర్తి అనుకూల వాతావరణముంది'' అని నెడుమారన్ సోమవారం తమిళనాడులో మీడియాకు వెల్లడించారు. "శ్రీలంకలో ఈళం తమిళుల పునఃప్రవేశంపై ప్రభాకరన్ త్వరలోనే ప్రకటన చేయబోతున్నారు. నేను చెప్పిందంతా వంద శాతం నిజమే'' అని ఉద్ఘాటించారు. ప్రభాకరన్ ఇప్పుడెక్కడ ఉన్నదీ మాత్రం ఇపుడే చెప్పనన్నారు. శ్రీలంకతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళులంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రభాకరన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎల్టీటీఈ ఏనాడూ భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించలేదన్నారు. ప్రభాకరన్ బతికుంటే అంతకన్నా సంతోషకరమైన వార్త మరొకటి ఉండదని డీఎండీకే అధినేత వైగో, పలు పార్టీల నేతలన్నారు.

పెద్ద జోక్: శ్రీలంక


కొలంబో: ప్రభాకరన్ బతికే ఉన్నాడనడాన్ని పెద్ద జోక్‌గా శ్రీలంక రక్షణ శాఖ అధికార ప్రతినిధి నళిన్ హెరాత్ అభివర్ణించారు. "ప్రభాకరన్ 2009 మే 18న హతమయ్యాడు. ఇది డీఎన్‌ఏ పరీక్షలోనూ నిర్ధారణ అయింది'' అన్నారు.

ఆకాశంలో సగమైనా... నాగాలాండ్‌లో మాత్రం శూన్యం

అసెంబ్లీలో మహిళలకు ఒక్కసారీ దక్కని ప్రాతినిధ్యం

ఎస్.రాజమహేంద్రారెడ్డి

ఆమె. ఎందులోనూ తక్కువ కాదు. ఆకాశంలో సగం. అన్నింటా కూడా సగం. ఇంటికే పరిమితమనేది గతించిన మాట. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా, ధాటిగా తనను తాను నిరూపించుకుంటోంది. మహిళలు అన్ని రంగాల్లోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నారు. కానీ నాగాలాండ్‌లో మాత్రం మహిళలు ఒక విషయంలో మరీ వెనకబడ్డారు. ఇక్కడా తప్పు వారిది కాదు... అక్కడి పురుషాధిక్య సమాజానిది. ఆ రాష్ట్రంలో చదువులో, ఉద్యోగాల్లో లేని కట్టుబాటు రాజకీయాలకు వచ్చేసరికి మాత్రం పెద్ద అడ్డుకట్టగా మారింది. నాగాలాండ్ శాసనసభకు ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు!



నాగాలాండ్ 1963లో రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత ఇప్పటిదాకా శాసనసభకు 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ 13 సభల్లోనూ మహిళలకు అసలే ప్రాతినిధ్యం దక్కలేదు. 13 ఎన్నికల్లోనూ బరిలో దిగిన మహిళల సంఖ్య కేవలం 20 మాత్రమే. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ఐదుగురు మహిళలు పోటీ చేశారు. కానీ వీరిలో ముగ్గురికి డిపాజిట్ కూడా దక్కలేదు. ఓవరాల్‌గా ఇప్పటిదాకా బరిలో దిగిన 20 మందిలో చాలామంది మహిళలకూ అదే ఫలితం దక్కింది! మహిళలు ప్రధాని అవడమే గాక ముఖ్యమంత్రి పదవి కూడా చేపట్టిన మన దేశంలో ఒక్క నాగాలాండ్‌లోనే ఎందుకీ దుస్థితి? అక్కడేమన్నా అక్షరాస్యత తక్కువగా ఉందా అంటే, ఆ సమస్యే లేదు. రాష్ట్రంలో మహిళల్లో కూడా అక్షరాస్యత ఏకంగా 76.11 శాతం. ఇది దేశ సగటు అక్షరాస్యత (64.6 శాతం) కన్నా ఎక్కువ. ఇంత అక్షరాస్యత ఉన్నా నాగా మహిళలు సాటి మహిళలకు ఓటేసేందుకు సుముఖంగా లేరు! రాష్ట్ర మొత్తం ఓటర్ల సంఖ్య 13.17 లక్షలు. వీరిలో మహిళా ఓటర్ల సంఖ్య దాదాపు సగం, అంటే 6.56 లక్షలు. అయినా ఎందుకీ చిన్నచూపు?

ఎందుకీ వివక్ష?

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2017లో నాగాలాండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమై నిరసనలు, ఆందోళనల దాకా వెళ్లింది! అక్కడ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యంపై ఎంత వ్యతిరేక భావన ఉందో దీన్నిబట్టే అర్థమవుతోంది. ఈ రిజర్వేషన్లను నిరసిస్తూ పెద్ద ఎత్తున చెలరేగిన హింసలో ఇద్దరు ప్రాణాలు కూడా కోల్పోయారు! రాజ్యాంగంలోని 371 (ఎ) ఆర్టికల్‌లో పేర్కొన్న ప్రత్యేక హక్కులకు ఇది విరుద్ధమన్నది నిరసనకారుల వాదన. నిర్ణయాధికారాల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండకూడదన్నది వారి డిమాండ్. నాగాలాండ్‌లో అత్యధిక శాతం ప్రజలు దీన్ని బలంగా విశ్వసిస్తారు. దీన్ని మార్చేందుకు మహిళల సాధికారత కోసం గళమెత్తే పలు స్వచ్ఛంద సంస్థలు ఎంత కృషి చేసినా లాభం లేకపోయింది. మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి నిఫ్యూ రియో పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నా పెద్దగా ఫలితమైతే లేదు. ఆయన తన నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ తరఫున ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు మహిళలకు టికెటిచ్చారు. కానీ మొత్తం 60 సీట్ల శాసనసభలో రెండే టికెట్లివ్వడం ఏ మేరకు సమన్యాయం చేసినట్టవుతుందో! కాంగ్రెస్, బీజేపీ అయితే మహిళలకు ఒక్కో టికెట్‌తోనే సరిపెట్టాయి. ప్రజలతో పాటు పార్టీలు కూడా మహిళల రాజకీయ ప్రాతినిధ్యానికి సరైన ప్రాధాన్యమివ్వడం లేదని ఈ సీట్ల కేటాయింపు చెప్పకనే చెబుతోంది. పార్లమెంటులో కూడా నాగాలాండ్ మహిళలకు దక్కిన ప్రాతినిధ్యం స్వల్పాతిస్వల్పం. అప్పుడెప్పుడో 1977లో రానో షైజా లోక్‌సభకు ఎన్నికవగా, తాజాగా 2022లో ఫంగ్నోన్ కొన్యాక్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రజలతో పాటు పార్టీల వైఖరి కూడా మారినప్పుడు మాత్రమే నాగాలాండ్ అసెంబ్లీలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది.

నాగాలాండ్ అసెంబ్లీకి మేఘాలయ, త్రిపురలతో పాటు ఈ నెలాఖర్లోగా పోలింగ్ పూర్తవుతుంది. త్రిపురకు ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీలకు 27న పోలింగ్ జరగనుంది. కేవలం ఆరుగురు మహిళలు మాత్రమే నామినేషన్ వేశారు. వారిలో ఇద్దరు అధికార ఎన్డీపీపీ అభ్యర్థులు, బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఒక్కో అభ్యర్థి మిగలగా మరో ఇద్దరు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఆ నలుగురిలో ఒక్కరైనా నెగ్గి చరిత్ర సృష్టిస్తారో లేదో చూడాలి. కనీసం సగం మందైనా గెలిస్తే మహిళల రాజకీయ ప్రాతినిధ్యంపై నాగాలాండ్ ప్రజల్లో ఉన్న విముఖత మెల్లమెల్లగా తొలగిపోతున్నట్టు భావించవచ్చు. ఈ ప్రశ్నకు సమాధానం మార్చి 2న వెలువడే ఫలితాల్లో లభిస్తుంది.

భూకంప మృతులు 35,000



అదియామాన్: తుర్కియే, సిరియాలో వారం రోజుల క్రితం సంభవించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పటి దాకా 35,000 మందిపైగా మరణించారని అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కొందరు శిథిలాల్లో చిక్కుకొని సజీవంగా బయటపడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా తుర్కియేలోని దక్షిణ హతాయ్ ప్రావిన్స్‌లో 13 ఏళ్ల బాలుడు క్షేమంగా బయటపడ్డాడు. తుర్కియేలో ఉష్ణోగ్రత మైనస్ 6 డిగ్రీలకు పడిపోయింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వాపోతున్నారు. భూకంపం వల్ల తుర్కియేకు 84.1 బిలియన్ డాలర్లకుపైగా నష్టం వాటిల్లినట్లు టర్కిష్ ఎంటర్‌ప్రైజ్ అండ్ బిజినెస్ కాన్ఫెడరేషన్ అంచనా వేసింది.

'అదానీ'పై అదే దుమారం

తొలి విడత బడ్జెట్ సమావేశాలకు తెర.. మార్చి 13 నుంచి మలి విడత

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ తొలి విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ముగిశాయి. రెండో విడత సమావేశాలు మార్చి 13న ప్రారంభం కానున్నాయి. అదానీ వ్యవహారంపై సోమవారం కూడా రాజ్యసభలో విపక్ష ఆందోళనలు కొనసాగాయి. సభ ప్రారంభానికి ముందే 14 విపక్ష పార్టీలు సమావేశమై దీనిపై చర్చించాయి. కాంగ్రెస్ సహా డీఎంకే, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేడీయూ తదితర పార్టీల నేతలు హాజరయ్యారు. జేపీసీ గానీ సుప్రీం న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ కమిటీకి డిమాండ్ చేయాలని నిర్ణయించాయి. అనంతరం బీఆర్ఎస్ సహా పలు విపక్ష పార్టీల ఎంపీలు సభలో వాయిదా తీర్మానాలిచ్చారు. సభ ప్రారంభమైన వెంటనే ఈ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. జేపీసీకి డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దీనిపై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అభ్యంతరం తెలిపారు. జేపీసీ వేయాలని నినాదాలు చేస్తున్న 8 మంది సభ్యుల పేర్లను సైతం చదివి వినిపించారు. అయితే, వారిపై ఎలాంటి చర్యలను ప్రకటించలేదు. సభను నడిపేందుకు ఇది మార్గం కాదని, ఇప్పటికే చాలా సమయం వృథా అయిందని, సభ్యులు సహకరించాలని కోరారు. విపక్ష ఎంపీలు ఆందోళన విరమించకపోవడంతో సభను 11.50 గంటలకు వాయిదా వేశారు. సభ ఆరంభం అయ్యాక సైతం విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడంతో చివరికి మార్చి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదానీ గ్రూప్‌లో అవకతవకలు జరిగాయంటూ హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదికపై ప్రతిపక్షాల ఆందోళనలతోనే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి భాగమంతా గడిచిన విషయం తెలిసిందే. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం, ఆ తర్వాత బడ్జెట్, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సాధారణ బడ్జెట్‌పై చర్చ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం మినహా ఇతర కార్యకలాపాలేవీ జరగలేదు.

'హిండెన్‌బర్గ్ నివేదిక'పై కమిటీకి ఓకే

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్‌లో మోసాలను అరికట్టడానికి నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్న సుప్రీంకోర్టు సూచన పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ నివేదిక, అనంతర పరిణామాలను మదింపు చేసేందుకు ప్రభుత్వ నియంత్రణ సంస్థ అయిన సెబీకి పూర్తి సమర్థత ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టుకు నివేదించారు. దీనిపై సుప్రీంకోర్టు సూచించిన మేరకు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటుకు కేంద్రానికి అభ్యంతరం లేదని వెల్లడించారు. అదానీ ఉదంతంపై చర్యలు తీసుకోవాలంటూ లాయర్లు విశాల్ తివారీ, ఎంఎల్ శర్మ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. మార్కెట్ ఒడిదుడుకులతో నష్టపోకుండా మదుపరుల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరముందని పేర్కొంది. నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీ వేయాలని సూచించింది. అయితే విచారణ జరిపే క్రమంలో సెబీ పాత్ర, ప్రాధాన్యాలకు భంగం వాటిల్లకుండా చూస్తే అందుకు అభ్యంతరం లేదని మెహతా తెలిపారు. నివేదికను సీల్డ్ కవర్లో సమర్పించేందుకు అనుమతించాలని కోరారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో ప్రమాణం చేయిస్తున్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీల ప్రమాణం

న్యూఢిల్లీ: నూతనంగా నియమితులైన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ రాజేశ్ బిందాల్ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో 34 మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ఇక పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడు

తమ కోస్ట్‌గార్డ్‌పైకి లేజర్ బీమ్స్‌ను ప్రయోగించిందన్న ఫిలిప్పీన్స్

మనీలా: దక్షిణ చైనా సముద్రంపై పెత్తనం తమదేనంటున్న డ్రాగన్ దేశం దుందుడుకు చర్యకు పాల్పడింది. వివాదాస్పద జలాల్లోని ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డ్ ఓడపైకి చైనా కోస్ట్‌గార్డ్ షిప్ మిలటరీ గ్రేడ్ లేజర్ కిరణాలను ప్రయోగించింది. దీంతో అందులోని తమ సిబ్బందిలో కొందరికి కొద్దిసేపు కళ్లు కనిపించకుండా పోయాయి. ఈ చర్యతో చైనా తమ సార్వభౌమ హక్కులకు తీవ్ర భంగం కలిగించిందని ఫిలిప్పీన్స్ ఆరోపించింది. తమ ఓడ బీఆర్‌పీ మలపస్కువాను దగ్గర్లోని రాతి దిబ్బ వైపు వెళ్లకుండా చైనా ఓడ అడ్డుకుందని తెలిపింది. ఈ క్రమంలో ప్రమాదకరంగా 137 మీటర్ల అతి సమీపానికి చేరుకుందని వివరించింది.

మరో వస్తువును కూల్చివేసిన అమెరికా

వాషింగ్టన్/బీజింగ్: తమ గగనతలంలో మరో గుర్తు తెలియని వస్తువును అమెరికా కూల్చివేసింది. మిషిగాన్ రాష్ట్రంలోని లేక్ హురోన్‌పైన 20 వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న అష్టభుజి ఆకారమున్న వస్తువును ఆదివారం ఉదయం గుర్తించారు. అధ్యక్షుడు బైడెన్ ఉత్తర్వులతో ఎఫ్–16 యుద్ధ విమానం నుంచి ఏఐఎం9ఎక్స్ క్షిపణిని ప్రయోగించి దాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ తెలిపింది. ఆ వస్తువుకు నిఘా సామర్థ్యమున్నదీ లేనిదీ తెలియాల్సి ఉంది. అమెరికా ఇప్పటి వరకు మొత్తం నాలుగింటిని కూల్చి వేసింది. సౌత్ కరోలినా వద్ద కూల్చివేసిన భారీ బెలూన్‌కు మాత్రమే నిఘా సామర్థ్యమున్నట్లు అమెరికా తెలిపింది. ఇలా ఉండగా, ఏడాదిగా తమ గగనతలంలో అనుమతి లేకుండా అమెరికాకు చెందిన 10కి పైగా బెలూన్లు ఎగిరాయని చైనా సోమవారం ఆరోపించింది. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయం తెలపలేదు. అమెరికా బెలూన్లు ఇతర దేశాల గగనతలంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడం సర్వసాధారణ విషయమని వ్యాఖ్యానించింది. దీనిపై అమెరికా అధ్యక్ష భవనం స్పందించింది. చైనాపైకి తాము ఎలాంటి నిఘా బెలూన్లను ప్రయోగించలేదని పేర్కొంది.

రష్యా నుంచి తక్షణమే వచ్చేయండి

తమ పౌరులకు అమెరికా ప్రభుత్వం హెచ్చరిక

వాషింగ్టన్: రష్యాలో ఉంటున్న, అక్కడికి ప్రయాణం చేస్తున్న తమ పౌరులు తక్షణమే వెనక్కి వచ్చేయాలని అమెరికా కోరింది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా అకారణంగా అమెరికా పౌరులను అరెస్ట్ చేసి వేధించే ప్రమాదముందని హెచ్చరించింది. 'రష్యా భద్రతా సంస్థలు అమెరికా పౌరులపై నిరాధార ఆరోపణలు చేసి, నిర్బంధంలో ఉంచుతున్నాయి. వారికి న్యాయ సాయం, అవసరమైన వైద్య చికిత్సలను సైతం అందకుండా చేస్తున్నాయి. రహస్య విచారణలు జరుపుతూ, ఎటువంటి రుజువులు లేకుండా దోషులుగా ప్రకటిస్తున్నాయి. మత ప్రచారకులైన అమెరికా పౌరులపై సైతం గూఢచర్యం కేసులను మోపి, విచారణల పేరుతో వేధిస్తున్నాయి' అని అందులో పేర్కొంది. సైన్యంలోకి రిక్రూట్‌మెంట్లను ప్రారంభించాలన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర్వుల నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా తమ పౌరులకు ఇదే విధమైన హెచ్చరికలు చేసింది.

రక్షణ రంగంలో మేటిగా భారత్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- రక్షణ ఉత్పత్తుల తయారీలో అగ్రగామిగా ఎదుగుతున్నాం
- 75 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్నాం... బెంగళూరులో 'ఏరో ఇండియా–2023' ప్రారంభం
- ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన
- అలరించిన దేశ విదేశీ విమానాల విన్యాసాలు



ఏరో ఇండియా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

సాక్షి, బెంగళూరు: రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ అప్రతిహత వేగంతో ముందుకు దూసుకుపోతోందని, ఈ విషయంలో ప్రపంచంలోని అగ్రదేశాల సరసన చేరబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మన దేశంలో గత తొమ్మిదేళ్లలో రక్షణ ఉత్పత్తులు భారీగా పెరిగాయని ఉద్ఘాటించారు. సానుకూల ఆర్థిక విధానాలతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన 'ఏరో ఇండియా–2023'ను ప్రధాని మోదీ సోమవారం కర్ణాటక రాజధాని బెంగళూరు శివారులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్షణ పరికరాల కోసం ఒకప్పుడు దిగుమతులపై ఆధారపడిన భారత్ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని అన్నారు. 75 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నామని వివరించారు. విదేశీ పరికరాలకు మన దేశాన్ని ఒక మార్కెట్‌గా పరిగణించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. శక్తివంతమైన రక్షణ భాగస్వామిగా భారత్ తన సామర్థ్యాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు.

5 బిలియన్ డాలర్ల ఎగుమతులు

రక్షణ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని, ఎన్నెన్నో ఘనతలు సాధించామని నరేంద్ర మోదీ తెలియజేశారు. మిలటరీ హార్డ్‌వేర్ ఉత్పత్తి విషయంలో మన దేశం పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని చెప్పారు. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 1.5 బిలియన్ డాలర్ల నుంచి 2024–25 నాటికి 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసుకున్న 'తేజస్ లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్, ఐఎన్‌ఎస్ విక్రాంత్'లు రక్షణ ఉత్పత్తుల రంగంలో మన అసలైన ప్రతిభా పాటవాలకు చక్కటి ఉదాహరణలని వెల్లడించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రైవేట్ సెక్టార్‌ను ఆహ్వానిస్తున్నామని ప్రధానమంత్రి అన్నారు. ఏరో ఇండియా ప్రదర్శనలో వివిధ దేశాల వైమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. లైట్ కాంబాట్ హెలికాప్టర్‌లో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ప్రయాణించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు త్రివిధ దళాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు రోజులపాటు జరిగే 'ఏరో ఇండియా'లో దాదాపు 100 దేశాల రక్షణ శాఖ మంత్రులు, ప్రతినిధులు, దేశ విదేశాలకు చెందిన 800కు పైగా డిఫెన్స్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. రక్షణ రంగంలో రూ.75,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 250 ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని భారత రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రధాని మోదీతో ప్రముఖుల భేటీ



సినీ నటులు యశ్, రిషబ్ శెట్టీలతో మోదీ

'ఏరో ఇండియా'ను ప్రారంభించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీతో బెంగళూరులో పలువురు ప్రముఖులు భేటీ అయ్యారు. కన్నడ సినీ నటులు యశ్, రిషబ్ శెట్టి, దివంగత పునీత్ రాజ్‌కుమార్ భార్య అశ్విని, మాజీ క్రికెటర్లు అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్, యువ క్రికెటర్లు మయాంక్ అగర్వాల్, మనీశ్ పాండేతోపాటు పలు రంగాల పెద్దలు మోదీని కలుసుకున్నారు. ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో డిన్నర్ సందర్భంగా ఈ సమావేశం జరిగింది. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు, గుర్తింపును మరింత ఇనుమడింపజేసేందుకు దక్షిణాది సినీనటులు కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించినట్లు తెలిసింది.

ప్రత్యేక ఆకర్షణగా అమెరికా ఎఫ్-13ఏ ఫైటర్ జెట్లు

ఏరో ఇండియా ప్రదర్శనలో అమెరికాకు చెందిన ఐదో తరం సూపర్‌సానిక్ మల్టీరోల్ ఎఫ్–35ఏ యుద్ధవిమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎఫ్–35ఏ లైట్నింగ్–2, ఎఫ్–13ఏ జాయింట్ స్ట్రైక్ ఫైటర్ అమెరికాలోని ఎయిర్‌బేస్‌ల నుంచి సోమవారం బెంగళూరుకు చేరుకున్నాయి. అమెరికా వైమానిక దళానికి చెందిన ఈ అత్యాధునిక ఫైటర్ జెట్లు భారత్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. అంతేకాకుండా ఎఫ్–16 ఫైటింగ్ ఫాల్కన్స్, ఎఫ్/ఏ–18ఈ, ఎఫ్/ఏ–18ఎఫ్ యుద్ధ విమానాలు సైతం అమెరికా నుంచి వచ్చాయి.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 14 | ఫిబ్రవరి | 2023

న్యూస్‌రీల్

పోర్ట్ ఫోలియో జడ్జిని కలిసిన న్యాయవాదులు



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్య వర్గసభ్యులు జిల్లా పోర్టు ఫోలియో జడ్జి (పరిపాలన)జస్టిస్ కన్నెగంటి లలితను సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ కోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేయడంతోపాటు మరో రెండు అదనపు కోర్టులను మంజూరు చేయాలని కోరారు. కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు ఆరెల్లి రాములు, కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్ జడ్జిని కలిసిన వారిలో ఉన్నారు.

ఉపాధిహామీ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలి



కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పే స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ఉపాధిహామీ జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. సెర్ప్ కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసి పే స్కేల్ ప్రకటించిందని, అదే శాఖలో పనిచేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులకు అవకాశం కల్పించలేదని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ ప్రతినిధులు శోభారాణి, స్పందన, రమ, పద్మ, కిషన్ తదితరులున్నారు.

24 గంటల కరెంట్ ఇవ్వాలి



కొత్తపల్లి(కరీంనగర్): వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ భగస్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫ్లకార్డులతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. అనంతరం డీఈటీ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 24 గంటల ఉచిత విద్యుత్ అంటూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వకుండా రైతులను అయోమయానికి గురిచేస్తోందన్నారు. రాత్రి వేళలో విద్యుత్ అందించడం వల్ల రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్రటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే విద్యుత్ సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, శ్రావణ్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణన చేపట్టాలి



కరీంనగర్: దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో బీసీల కులగణన వెంటనే చేపట్టాలని, రాష్ట్రంలో 62 శాతం ఉన్న బీసీలకు రెండు శాతం నిధులు కేటాయించడం సరికాదని బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు 29 శాతం నుంచి 50 శాతం పెంచాలని, బీసీల డిమాండ్లపై అసెంబ్లీ, పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ.. బీహార్ ప్రభుత్వం మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగుల కనుకయ్య, నారోజు రాకేశ్‌చారి, ఐల ప్రసన్న, రంగు సంపత్, ఎడ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

- తీరం చేరిన ప్రేమకథలు
- లవ్‌లో.. లైఫ్‌లో గెలిచిన ప్రేమ పక్షులు
- ఆదర్శంగా నిలుస్తోన్న జంటలు
- నేడు వాలెంటైన్స్ డే ప్రత్యేక కథనం

ఒప్పించాం.. మెప్పించాం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రేమ.. కులమతాలకు అతీతమైన భావన. టీనేజీ వయసులో మొదలయ్యే ప్రేమకథలు ఆకర్షణతో మొదలై.. అక్కడితో ముగుస్తాయి. కానీ, పరిణితితో కూడిన ప్రేమకథలు కచ్చితంగా విజయతీరాలు చేరతాయి. ఒక చేత్తో కెరీర్, మరో చేత్తో ప్రేమను సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. ఖండాలు దాటినా, ఏళ్లకు ఏళ్లు గడిచినా ఎదురుచూపుల్లో బతికేస్తారు. చివరికి తమ లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ తరువాత పెద్దల్ని ఒప్పిస్తారు. కొందరికి ఈ అవకాశం లేకపోవచ్చు. అయినా వీరు చేరుకున్న విజయతీరాలు, సమాజంలో వీరికి దొరికే స్థానం వీరిపై ఉన్న వ్యతిరేక భావనను క్రమంగా దూరం చేస్తుంది, అందరినీ దగ్గర చేస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులమతాలకు అతీతంగా ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలపై కథనం.



మాది లవ్ కం అరేంజ్ మ్యారేజ్

సిరిసిల్లక్రైం: ఉద్యోగంలో సెటిల్ అయ్యాక మా స్నేహితులతో మా మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవాల్సిన అవసరం రాలేదు. అందరినీ ఒప్పించి సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాం. నా భార్య దివ్యాన్షీ కంటి డాక్టర్. ఈ తరం యువతకు నేను చెప్పేది ఒక్కటే.. కెరీర్‌పై దృష్టి పెట్టి లక్ష్యం సాధిస్తే అన్ని మనవద్దకు వచ్చి చేరుతాయి. ఆకర్షణకు గురైతే లైఫ్ ఆగమవుతుంది.

– సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్– డాక్టర్ దివ్యాన్షీ దంపతులు

అనాథ యువతికి అన్నీ తానై..



శేఖర్, రమ్య దంపతులు

కథలాపూర్(వేములవాడ): అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచాడు ఓ సామాజిక సేవకుడు. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన కాసారపు శేఖర్ షైన్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేని అదే గ్రామానికి చెందిన రమ్యను ప్రేమించాడు. 2013లో శేఖర్, రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఆమెకు అన్నీ తానయ్యాడు. వీరికి శ్రీహర్ష, రిషికేశ్ ఇద్దరు కుమారులు. శేఖర్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో 2018లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. కులాంతరమే కాదు.. అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న శేఖర్‌ను పలువురు అభినందించారు.

నేనే ప్రపోజ్ చేశా..



ఏదో సందర్భంలో తన ఫ్రెండ్ ప్రశాంత్‌ను పరిచయం చేశారు. ఆ పరిచయమే కొన్నాళ్లకు ఇష్టంగా మారింది. ధైర్యం చేసి నేనే పెళ్లి ప్రేమను ప్రతిపాదించా. అమ్మానాన్న అంగీకరించలేదు. గొడవలు కూడా అయ్యాయి. సొంతంగా నిర్ణయం తీసుకుని అగ్రహారం ఆంజనేయ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకున్నాం. కొన్నాళ్ల తరువాత ఇరు కుటుంబాల వాళ్లు అంగీకరించి కలిసిపోయారు. ప్రస్తుతం అంతా సంతోషంగానే ఉంది.

– లహరి, ప్రశాంత్

టీనేజ్ ప్రేమతో సమస్యలు



చదువు పూర్తికాకుండానే టీనేజ్‌లో ప్రేమలో పడుతున్న వారు చాలా మంది ఆ తరువాత కాలంలో ప్రేమ, ఆకర్షణ తేడాలు తెలుసుకుని తమ అభిప్రాయాలు మార్చుకుంటున్నారు. ప్రేమికులు ఇద్దరిలో ఏ ఒక్కరు తమ అభిప్రాయాన్ని మార్చుకున్నా ఇంకొకరు గౌరవించే రీతిలో ప్రేమ ఉండాలి. అంతే కాని ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌ల్లో పెడతానని బ్లాక్‌మెయిలింగ్ దిగడం సరికాదు. ఇలాంటి విషయాల్లో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తే కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. – రాజశేఖర్‌రాజు, సీఐ, కోరుట్ల



రవికిరణ్, స్వాతి దంపతులు

ప్రేమ ముందు ఓడిన వైకల్యం

పెద్దపల్లిరూరల్: 'నా స్వాతి బంగారం.. నేను మరుగుజ్జుగా పుట్టినా నాకు ఆ భగవంతుడు స్వాతి రూపంలో మంచి జీవితాన్నే ఇచ్చాడు' అని చెప్పుకొచ్చాడు రవికిరణ్. స్వాతి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు నుంచి పెద్దపల్లికి వలస వచ్చింది. వారు రవికిరణ్ ఇంటి సమీపంలో అద్దెకు రావడంతో స్వాతితో ఏర్పడ్డ పరిచయం పరిణయానికి దారితీసింది. స్వాతి కుటుంబీకులు వ్యతిరేకించడంతో అప్పటి సీఐ హబీబ్‌ఖాన్‌ను ఆశ్రయించగా ఠాణాలోనే పెళ్లి జరిపించారని రవికిరణ్, స్వాతి పేర్కొన్నారు. వారికి ఓ బాబు, ఇద్దరు కూతుళ్లు జన్మించినా అనారోగ్య కారణాలతో బాబు, ఓ కూతురు చనిపోయారని బాధపడ్డారు. అయినా ఉన్న ఒక్కగానొక్క కూతురు ఆశాజ్యోతిని తమకున్నంతలో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. మరుగుజ్జునైన తనకు ప్రభుత్వం నుంచి దివ్యాంగ పింఛన్ అందుతోందని, మెప్మాలో పనిచేసినందుకు మరో నాలుగు వేలతోనే నెట్టుకొస్తున్నన్నాడు.

ఖండాలు దాటిన ప్రేమ



నేను ఎస్సారార్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నక్రమంలో నాకు రమేశ్ పరిచమయ్యాడు. రోజూ మా కాలేజీకి వచ్చేవాడు. ఒకరోజు నాకు ప్రపోజ్ చేశాడు. అయితే, జీవితంలో పైకి రావాలన్న నా కలను వివరించాను. అయినా తను వెనకడుగు వేయలేదు. నాకు పూర్తిగా సహకరించాడు. ఉన్నత విద్య కోసం నేను బ్రిటన్ వెళ్లాను. పీజీ పూర్తయి ఉద్యోగంలో చేరాక ఇండియా వచ్చాను. నా కోసం ఎదురుచూస్తున్న రమేశ్‌తో వివాహం జరిగింది. కులాలు వేరుకావడంతో మొదట్లో మా పెద్దలు వ్యతిరేకించినా.. కెరీర్‌లో నిలదొక్కుకున్న తీరుకు మా ప్రేమను అంగీకరించారు. ఇపుడు లండన్‌లో రెండు రెస్టారెంట్లు, ఒక కేక్‌షాప్ నడుపుతున్నాం. నలుగురికి ఉపాధి కల్పిస్తున్నం. ఏటా మా ఇద్దరి పిల్లలతో ఇండియాకు వస్తాం. – సుష్మ– రమేశ్

ప్రేమ కోసం దేశంలోనే..



మాది మంథని, మా వారిది కరీంనగర్. నేను అపుడు పీజీ చదువుతున్నా. మా ఆయన ప్రభాకర్ అప్పటికే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఒక పెళ్లి వేడుకలో అనుకోకుండా కలిశాం. పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నాం. మాకు ఇపుడు ఒక పాప. మా ప్రేమను అర్థం చేసుకున్న పెద్దలు చివరికి మమ్మల్ని క్షమించేశారు. హైదరాబాద్‌లో ఓ ఇంటి వారిమయ్యాం. విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా మా పేరెంట్స్‌ను చూసుకునేందుకు మా ప్రభాకర్ వాటిని సున్నితంగా తిరస్కరిస్తారు. ఏమాత్రం సెలవు దొరికినా మా పేరెంట్స్‌కే టైం కేటాయిస్తాం.

– స్వప్న– ప్రభాకర్

అప్పట్లో చాలా కష్టపడ్డాం



నాది జగిత్యాల, ఆమెది కరీంనగర్. డిగ్రీ చదువుకునే రోజుల్లో మాకు ఎన్‌సీసీలో పరిచయం. పీజీకి వెళ్లాక కూడా కొనసాగింది. అపుడే ఎస్సై నోటిఫికేషన్ వచ్చింది. దీంతో తనకు దాదాపుగా ఏడాది దూరంగా ఉండి ప్రిపేరయ్యా. ఈ లోపు విషయం ఇంట్లో తెలిసిపోయింది. దీంతో తన కుటుంబ సభ్యులు మొదట్లో వ్యతిరేకించారు. నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యాక మరో ఏడాది దూరంగా ఉన్నాం. పోస్టింగ్ తీసుకున్నాక వెళ్లి వారిని ఒప్పించా. తొలుత వ్యతిరేకించినా... కొన్నిరోజులకు కలిసిపోయాం. ఇపుడు నేను సీఐగా మానుకోటలో విధులు నిర్వహిస్తున్నా. మాకిద్దరు పాపలు. కులాలు వేరైనా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటే అంతా ఆమోదిస్తారు.

– సుష్మ– రవిరాజ్



ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వివేకానంద డిగ్రీ, పీజీ కాలేజీలో 'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెళ్లి నిర్ణయం పెద్దలకే..

నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' డిబేట్

కరీంనగర్‌క్రైం: నేటి యువత విద్య, ఉద్యోగం, జీవితంలో స్థిరపడడం వంటి వాటిపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. ప్రేమ పెళ్లి వద్దు.. పెద్దలు కుదిర్చిన పెళ్లి ముద్దు అంటూ స్పష్టమైన వైఖరిని ప్రదర్శిస్తోంది. మంగళవారం ప్రేమికుల దినోత్సవం నేపథ్యంలో కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో 60 మంది డిగ్రీ, పీజీ చదువుతున్న యువతీయువకులతో చర్చావేదిక నిర్వహించింది. ఎక్కువమంది పెద్దలు కుదిర్చిన పెళ్లికే జై కొట్టారు.

(ప్రేమ వివాహాలపై 60 మంది యువతీయువకులను వివిధ ప్రశ్నలు అడుగగా వారి సమాధానాలు ఈ కింది విధంగా ఉన్నాయి.)

ప్రశ్న	సమాధానం	సంఖ్య
1. కెరీర్ తర్వాత పెళ్లంటారా.. ముందేనా	కెరీర్ ఫస్ట్	56
	వయసు రాగానే పెళ్లి చేసుకోవాలి	04
2. టీనేజ్ లవ్‌పై మీ అభిప్రాయం	ఆకర్షణ మాత్రమే	45
	టీనేజ్‌లో అవసరం లేదు	15
3. ప్రేమ పెళ్లిళ్లు అవసరమా	అవసరం లేదు	50
	అవసరమే	10
4. ప్రేమ వివాహాలు భవిష్యత్తు తరాలపై ప్రభావం చూపుతాయా	కచ్చితంగా చూపుతాయి	55
	చూపవు	05
5. ప్రస్తుతం ప్రేమలో సోషల్ మీడియా పాత్ర ఉందంటారా	ఎక్కువగా ఉంటుంది	58
	ఏ మాత్రం ఉండదు	02
6. లవ్ మ్యారేజా.. పెద్దలు కుదిర్చిన పెళ్లి బెటరా	పెద్దలు కుదిర్చిన పెళ్లి	50
	లవ్ అరేంజ్ మ్యారేజీలు	07
	లవ్ మ్యారేజీలు	03

పెద్దలు కుదిర్చిన పెళ్లే నయం



పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటేనే మంచిదని నా అభిప్రాయం. ఎంతో కష్టపడి పెంచిన తల్లిదండ్రుల కల నెరవేర్చుతా. కష్టపడి చదివి నా లక్ష్యాన్ని చేరుకుంటా.

– విభావరి, కరీంనగర్

లవ్ మ్యారేజ్‌తో..



పెళ్లి అంటే రెండు జీవితాల కలయిక. లవ్ మ్యారేజీతో ఇద్దరి మధ్య మరింత అనుబంధం పెరుగుతుందని నమ్ముతా. తల్లిదండ్రుల చూపిన బాటలో నడిచి మొదట కెరీర్‌పై దృష్టి పెట్టి ఫైనల్‌గా మ్యారేజ్ గురించి ఆలోచిస్తా.

– సాయితేజస్విని, గోదావరిఖని

పెద్దల ఇష్టం మేరకు..



పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు బలంగా ఉంటాయని నా నమ్మకం. ఇప్పటి వరకు నేను చూసినదానిలో ప్రేమ పేరుతో చాలా మంది జీవితాలు నాశనం చేసుకున్నారు. మన కుటుంబ పరిస్థితులు, విలువలు తెలిసినవారితో తల్లిదండ్రులే పెళ్లి కుదుర్చుతారు.

– కె.శ్రావ్య, కరీంనగర్

లవ్ అండ్ అరేంజ్ బెస్ట్



లవ్ కమ్ అరేంజ్ మ్యారేజీలు నయమని నా అభిప్రాయం. మనసుకు నచ్చినవారిని ఇష్టపడి కుటుంబ సభ్యుల సమ్మతితో పెళ్లి చేసుకుంటే ఇంకా మంచిది. తల్లిదండ్రులను కాదని ప్రేమ పెళ్లిల్లు చేసుకోవడం మూర్ఖత్వమే.

– రిశ్వేంధర్, జగిత్యాల

అర్థం చేసుకోవాలి



లవ్, అరేంజ్ మ్యారేజీ ఏదైనా ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఏ సమస్య ఉండదు. మనల్ని అర్థం చేసుకునే లైఫ్ పార్ట్‌నర్ దొరికితే ఏ మ్యారేజీ అయినా లైఫ్ హ్యాపీగా ఉంటుంది. – రాహుల్ శ్రీషా

లక్ష్యం వైపు పయనించాలి



చదువుకునే వయసులో ప్రేమ, పెళ్లి గురించి కాకుండా కెరీర్‌పై దృష్టి పెట్టి సక్సెస్ అవ్వాలి. లక్ష్యం వైపు పయనించాలి. పెళ్లి విషయంలో తల్లిదండ్రులు చెప్పిన మాటలు వింటే మంచిదని నా అభిప్రాయం.

– డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలి

- రోడ్డుపై బైఠాయించిన మహిళలు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

చొప్పదండి: అధికారులు ఎంపిక చేసిన అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి ప్రధాన రహదారిపై సోమవారం మహిళలు బైఠాయించారు. అధికారులు డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించగా, పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. అర్హులు 138 మంది వరకు ఉండగా, డ్రాలో 47 మందినే ఎంపిక చేశారు. దీంతో డ్రాలో ఎంపిక కాని దరఖాస్తుదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హులందరికీ కేటాయించాలని డిమాండ్ చేశారు. అందరి సమక్షంలో డ్రా నిర్వహించామని, తదుపరి మంజూరులో అందరికీ అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పగా, ఆగ్రహానికి లోనయ్యారు. ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. ఎస్‌ఐ ఉపేంద్రచారి ఆందోళనకారులతో మాట్లాడి విరమింపజేశారు. కాంగ్రెస్ నాయకుడు సునీల్ ఆందోళనకారులకు మద్దతు పలికారు.

లబ్ధిదారుల ఎంపిక

పాత వెదురుగట్టరోడ్డులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూంలకు అర్హులైన లబ్ధిదారులను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, తహసీల్దార్ అంబటి రజిత చిన్నారుల ద్వారా డ్రా తీసి పేర్లు ప్రకటించారు. సుమారు 500 మంది దరఖాస్తులు చేసుకోగా.. 138 మందిని గుర్తించారు. 76 డబుల్ ఇండ్లను కేటాయించారు.

కమిషనరేట్‌లో కంటి వెలుగు



కంటి పరీక్ష చేయించుకుంటున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం పోలీసు కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ ఎల్.సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని పోలీసు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీపీతోపాటు పోలీసు కుటుంబాలకు చెందిన 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. డీఎంహెచ్‌వో జువేరియా, అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, టౌన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు, సీఏఆర్ ఏసీపీ సి.ప్రతాప్, ఎస్‌బీఐ జి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు సురేశ్, మల్లేశం, జానిమియా పాల్గొన్నారు.

పోకిరీలపై నిరంతరం నిఘా

ఎక్కువమంది జమకూడి ఉండే ప్రదేశాల్లో షీ బృందాలు రహస్య నిఘా కొనసాగించాలని సీపీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. సోమవారం కమిషనరేట్‌లో షీ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులకు భద్రతపై మరింత భరోసా కల్పించేందుకు పోకిరీలను రహస్యంగా పట్టుకునే చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలను బృందాలు వినియోగించాలన్నారు. వాట్సాప్, సెల్‌ఫోన్, ట్విట్టర్, ఫేస్ బుక్‌ల ద్వారా సమాచారం అందిన వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఎన్నిక


మౌనిక


నీరజ

విద్యానగర్(కరీంనగర్): ఖమ్మం జిల్లా మధిరలో జరిగిన డీవైఎఫ్ఐ యంగ్ ఉమెన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో కరీంనగర్ జిల్లాకు చెందిన నీరజ రాష్ట్ర కో కన్వీనర్‌గా, మౌనిక రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికను డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేశ్ తెలిపారు.

వాగేశ్వరికి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

మానకొండూర్: తిమ్మాపూర్ మండలంలోని రామక్రిష్ణాకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడు అర్హత వచ్చినట్లు కళాశాల ప్రధాన కార్యదర్శి గంధ్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 18,19 తేదీలలో న్యాక్ బృందం కళాశాలలో సదుపాయాలను ఏడు అంశాలలో పరిశీలించినట్లు తెలిపారు. పరిపాలన ఫలితాలు ప్లేస్‌మెంట్స్ టీచింగ్ విధానం పరిశోధన, నవకల్పనలు కళాశాలలో ఏర్పాటు చేసిన సదుపాయలపై విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పరిశీలన మొత్తానికి నాలుగు పాయింట్లకు గాను వాగేశ్వరి కళాశాలకు 3.28 అందించి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కేటాయించినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకిషన్, సొసైటీ ట్రెజరర్ శోభాదేవి, మెంటర్లు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,900

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 7,900 పలికింది. మార్కెట్‌కు 82 వాహనాలలో 1,028 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,900, మోడల్ ధర రూ.7,700, కనిష్ట ధర రూ.7,000 పలికింది. గన్నీ సంచుల్లో 25 మంది రైతులు 24 క్వింటాళ్ల పత్తి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.6,000 పలికింది.

ఇద్దరు డ్రైవర్లపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామశివారు పెట్రోల్ బంక్ ఎదుట ఆదివారం రాత్రి ప్రమాదం జరిగి బిట్ల మహేందర్ మృతి చెందిన ఘటనలో ఇద్దరు డ్రైవర్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. పెట్రోల్ బంక్ సీసీ పుటేజీ ఆధారంగా కారును గుర్తించామని, అజాగ్రత్తగా రాంగ్ రూట్లో కారు నడిపిన డ్రైవర్ వెల్దె అరవింద్‌తో పాటు లారీ డ్రైవర్ కనవేని రాంచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్..


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గొల్లపల్లి ప్రధాన రహదారిపై సోమవారం ఎస్సై శేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద సోమవారం పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు. కరీంనగర్ నుంచి గంగాధర మీదుగా ఫాజుల్‌నగర్ వస్తుండగా ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. దాదాపు 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మార్చి 31లోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- నియోజకవర్గాల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు
- ప్రజలు కోరుకునేలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి కమలాకర్


మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: కరీంనగర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పీఆర్, ఆర్అండ్‌బీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు, కరీంనగర్ నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధులతో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పెండింగ్ పనుల వారీగా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేశారని, వాటిని మార్చి 31లోగా పూర్తి చేసి ఏప్రిల్ నుండి కొత్త ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులను మంజూరు చేసుకొని మరింత అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకోవాలని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన పనులకు అంచనాలు సిద్ధం చేయాలని, పనులలో నిర్లక్ష్యంగా వ్యవహరించే గుత్తేదారులను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చెరువులకు సమృద్ధిగా నీరందించి కరీంనగర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిపామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ పనులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జడ్పీ సీఈఓ ప్రియాంక, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, జడ్పీటీసీలు కరుణ, పి.లలిత, పీఆర్ ఎస్ఈ, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఇరిగేషన్ ఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు సాఫీగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 77 కేంద్రాల్లో 31,455 మంది మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల కోసం ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. ఉదయం 8:30 వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రం లోపల ఉండాలని తెలిపారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లలో భద్రపరచాలని, పోలీస్ స్టేషన్ల నుంచి తీసుకెళ్లడానికి ప్రభుత్వ లెక్చరర్‌లను మాత్రమే నియమించాలని ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని.. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంగాధర మండలం న్యాలకొండపల్లి, మానకొండూర్ మండలం దేవంపల్లి పరీక్ష కేంద్రాలు దూరంగా ఉన్నందున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులు కోరగా.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులను సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో అనుమతించకూడదని, పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాలను లీక్ చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రాజ్యలక్ష్మీ, ఏసీపీ మదన్ లాల్, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు, జిల్లా వైద్యాధికారి జువేరియా, విద్యుత్ శాఖ ఎస్ఈ వి.గంగాధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను ఆదానీకి కట్టబెడుతున్న మోడీ

- ఆదానీ ఆస్తులను జప్తు చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి


ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

కరీంనగర్: దేశ సంపదను కొల్లగొట్టి ఆదానికి కట్టబెట్టడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆదానీ ఆస్తులను జప్తు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతు వ్యతిరేక, కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని, ఆదానీ స్టాక్స్‌లో కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఎం నరేంద్ర మోడీ అండదండలతో ప్రపంచంలోనే రెండో కుబేరుడిగా ఎదిగిన ఆదానీ.. ఎల్ఐసీ నుంచి 80 వేల కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి 5,300 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి 7 వేల కోట్లు, ఎస్‌బీఐ నుంచి 25 వేల కోట్లు.. ఇలా అనేక బ్యాంకుల నుంచి ఆదానీ కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపించారు. సీబీఐ, ఈడీలతో విచారణ జరిపి ఆదానీ ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, టేకుమల్ల సమ్మ, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. రాంపూర్‌కు చెందిన మూదం చంద్రకళ(60) హుజూరాబాద్- జమ్మికుంట ప్రధాన రహదారిపై వెళ్తున్న క్రమంలో లారీ అతివేగంగా వచ్చి వెనుకనుంచి ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి మహిళ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు ఓ మహిళ పొలంలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని మర్రివానిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. మర్రివానిపల్లికి చెందిన కనుకుల జయ(40) సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం తన చేనులో కలుపు తీయడానికి ఉదయం 7గంటలకు ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా వ్యవసాయ బావి వద్ద నిర్జీవంగా పడి ఉంది. జయ చిన్న కుమారుడు వినయ్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి భర్త కేశవరెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ బాధ్యతలు జయ చూసుకుంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో శివంగాలపల్లి తొలి సర్పంచ్ ..


పెద్దరాములు (ఫైల్)

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం శివంగాలపల్లి తొలి సర్పంచ్ కొలగాని పెద్దరాములు(72) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. శివంగాలపల్లి 1981లో గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కొలగాని పెద్దరాములు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1981 నుంచి 1986 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. సోమవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికాక కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య లింగవ్వ, ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నారు.

అన్నపై కత్తితో దాడి

- అడ్డుకున్న మరొకరికి గాయాలు


గాయపడిన సాగర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో అన్నపై కత్తితో తమ్ముడు దాడిచేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజీవ్‌నగర్‌కు చెందిన కాసారపు నారాయణకు ఇద్దరు కుమారులు సాగర్, చందు. సాగర్ అదే కాలనీలో వడ్రంగి షాపు నిర్వహిస్తూ వేరుగా జీవిస్తున్నాడు. చందు తల్లిదండ్రులతో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. సోమవారం అన్న సాగర్‌తో గొడవ పడి కత్తితో దాడిచేశాడు. సాగర్ చేతిపై గాయం కాగా.. అడ్డుకునేందుకు వచ్చిన బ్రహ్మాచారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారైనట్లు స్థానికులు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్టీపీసీ రామగుండంలో సోమవారం చోటుచేసుకుంది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌కు చెందిన చొల్లేటి రవీందర్ (62) ఆటోడ్రైవర్. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. రవీందర్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్సై చక్రపాణి తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కరీంనగర్: భవన నిర్మాణ కార్మికులకు అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వెల్ఫేర్ బోర్డులో సెస్ ద్వారా రూ.3,700 కోట్లు జమయ్యాయని.. వాటిని బోర్డు అడ్వైజర్ కమిటీ నిర్ణయాలతో ఖర్చు చేయాలని అన్నారు. కానీ.. ప్రభుత్వం బోర్డు నిధులను అక్రమంగా దారి మళ్లిస్తోందని మండిపడ్డారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ డబ్బులు ఇచ్చిన వారికే క్లెయిమ్ పరిష్కారం చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ప్రమాద, సహజ మరణాలు, వివాహ, ప్రసూతి కానుకలు, ఇతర బెనిఫిట్స్ పెండింగ్‌లో పెట్టి కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారు. అనంతరం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరే రమేశ్, కోశాధికారి వట్టి జగదీశ్, ఉపాధ్యక్షుడు పల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న అడ్వైజర్ మైనింగ్ డీఎన్.ప్రసాద్

రామగిరి(మంథని): సింగరేణిలో అత్యాధునిక యంత్రాలను వినియోగించుకుని ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని అడ్వైజర్ మైనింగ్ డీఎస్. ప్రసాద్ సూచించారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలను సందర్శించి ఉత్పత్తిపై ఆరా తీశారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. రక్షణ, బొగ్గు ఉత్పత్తి, ఓసీపీ గనుల్లో ఓబీ, బొగ్గు రవాణా అంశాలపై చర్చించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొద్దిరోజులే ఉందని, ప్రణాళిక ప్రకారం ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ సీతారామం, ఎస్ఓటూ జీఎం డి.బైద్య, ప్రాజెక్ట్ అధికారులు ఎస్.రాధాకృష్ణ, ఎం.నరేందర్, కె.నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురాం, డీజీఎంలు కాశీవిశ్వేశ్వరరావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలి

గోదావరిఖని: వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని డీఎస్.ప్రసాద్ కోరారు. సోమవారం ఆర్జీ-1 ఏరియా జీడీకే-5 ఓసీపీని పరిశీలించారు. ఓసీపీలో ఉన్న ఫైర్, బొగ్గు నాణ్యత, యంత్రాల పనితీరు తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాపై అధికారులతో సమీక్షించారు. ఆర్జీ-1 జీఎం కె.నారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ అనిల్ గబాలే ఉన్నారు. అనంతరం ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 క్వారీని పరిశీలించారు. ఓసీపీ-3 వ్యూ పాయింట్ ద్వారా పనిస్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్, ఎస్ఓటూ జీఎం అబ్దుల్ సలీం, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, ఓసీపీ-3 మేనేజర్ డి.రమేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మృతుడు గల్ఫ్ కార్మికుడు


గెల్లె రాజేశ్(ఫైల్)

కోరుట్లరూరల్: యూసుఫ్‌నగర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిలాపూర్ గ్రామానికి చెందిన గెల్లె రాజేశ్(36) మృతి చెందాడు. రాజేశ్ పనినిమిత్తం యూసుఫ్‌నగర్ వెళ్లాడు. పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. రాత్రి యూసుఫ్‌నగర్ శివారులోని తాతమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు అంబులెన్సులో కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

15 రోజుల క్రితమే గల్ఫ్ నుంచి ..

రాజేశ్ 8 ఏళ్లుగా గల్ఫ్‌లో కార్మికుడిగా పనిచేస్తూ సెలవులపై స్వగ్రామానికి వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో 15 రోజుల క్రితమే రెండు నెలల సెలవులపై ఇంటికి వచ్చాడు. ఆయనకు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటిపెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. తండ్రి కోసం కుమారులు రోదించిన తీరు పలువురిని కలచివేసింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పిల్లలకు ఆస్తులను బదిలీ చేయవద్దు


మాట్లాడుతున్న సముద్రాల జనార్దన్ రావు

విద్యానగర్(కరీంనగర్): వృద్ధులు తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయవద్దని కరీంనగర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్ రావు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో కరీంనగర్ జిల్లా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. వృద్ధులు తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయడం వల్ల వారు సోమరులుగా తయారై ఆస్తులను అమ్ముకుంటారని, తల్లిదండ్రులపై నిర్లక్ష్య స్వభావం ఏర్పడుతోందని అన్నారు. సీనియర్ సిటిజన్స్ చట్టం 2007పై అవగాహన కల్పించారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి తోట లక్ష్మణ్ రావు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంస్థ అధ్యక్షుడు మోసం అంజయ్య, ప్రధాన కార్యదర్శి దామెర మహేందర్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి తొడుపునూరి ఆనందం, జనరల్ మేనేజర్ చింతల సత్యనారాయణ, బూర్గుపల్లి నరేందర్, దొమ్మాట లక్ష్మీనారాయణ, రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


వీసీ మల్లేశ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: నియమ నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ పరీక్షల ఫీజులను అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, అలాగే వాటి గుర్తింపును రద్దు చేయాలని సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం వేస్తున్నారన్నారు. బీకాం, బీఏ, బీబీఏ విద్యార్థులకు యునివర్సిటీ నిబంధనల ప్రకారం 900 ఫీజు తీసుకోవాల్సిన కళాశాలలు దాదాపు రూ.1500 వరకు వసూలు చేస్తున్నాయన్నారు. బీఎస్సీ సైన్స్ విద్యార్థులకు 1,150 ఫీజు తీసుకోవాల్సిన యాజమాన్యం 1,700 వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జీలు శివ, నందు, సాయి, నాగరాజు, వంశీ, సాయిచరణ్, అబ్దుల్, సాయిక్రిష్ణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలకు అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట పతకాలు



పతకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: సమర్థవంతమైన సేవలందించినందుకు కరీంనగర్ కమిషరేట్‌లో వివిధ స్థాయికు చెందిన 17 మంది పోలీసులకు ప్రభుత్వం 2021లో ప్రకటించిన అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట పతకాలను సోమవారం సీపీ ఎల్.సుబ్బారాయుడు అందచేశారు. కరీంనగర్ సీసీఎస్‌కు చెందిన ఏఎస్సై జి.వీరయ్య, వీణవంక ఠాణా కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్, కరీంనగర్ ట్రాఫిక్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఎ.రవీందర్‌రెడ్డి, జమ్మికుంట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ విభాగం హెడ్‌కానిస్టేబుల్ జి.రాజమౌళి అతి ఉత్కృష్ట పతకాలు అందుకున్నారు. జమ్మికుంట ఠాణాకు చెందిన ఏఎస్సై కె.రఘుపతిరెడ్డి ప్రస్తుతం శిక్షణలో ఉండడంతో హాజరుకాలేదు. ఉత్కృష్ట పతకాలు అందుకున్న వారిలో కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎండీ బషీర్‌ఖాన్, చొప్పదండి ఠాణా కానిస్టేబుల్ పి.కాంతారావు, ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్ ఎం.బ్రహ్మయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బి.రాజయ్య, మానకొండూరు ఠాణా కానిస్టేబుల్ టి.శ్రీనివాస్, రామడుగు స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.పరుశరాములు, స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన హోంగార్డు ఎం.చంద్రశేఖర్, కళాబృందం హోంగార్డు టి.శ్రీనివాస్, ఎల్ఎండీ కాలనీకి చెందిన హోంగార్డు కె.రాజు, వీణవంక ఠాణా హోంగార్డు ఎస్.రవీందర్, సీఎస్బీకి కానిస్టేబుల్ బి.రామన్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు సమర్థవంతమైన సేవలందిస్తూ రివార్డులు, అవార్డులు అందుకునేందుకు పోటీపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్ (శాంతిభద్రతలు), జి.చంద్రమోహన్, ఏసీపీలు సత్యనారాయణ, సి.ప్రతాప్, ఎస్బీఐ జి.వెంకటేశ్వర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

మిగిలింది 47 రోజులే..


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎంలు

రామగిరి(మంథని): ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు లక్ష్య సాధనకు 47రోజులే ఉందని సంస్థ డైరెక్టర్లు ఎస్.బలరాం (ఫైనాన్స్, పర్సనల్), డి.సత్యనారాయణరావు (ఈఅండ్ ఎం), ఎన్‌వీకే.శ్రీనివాస్(ఆపరేషన్స్), జి.వెంకటేశ్వరరెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బొగ్గు ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ప్రతిరోజూ 2.3లక్షల టన్నులకు తగ్గకుండా ఉత్పత్తి, రవాణా చేయాలని, ఇందుకు ఏరియా జీఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆదేశించారు. షిఫ్టులవారీగా రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఓవర్‌బర్డెన్ తొలగింపు కాంట్రాక్టులు సమకూర్చామని, ఏరియాల వారీగా జీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు, మేనేజర్లతో సమీక్షలు నిర్వహించుకుని రోజుకు 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీసేలా చూడాలన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జె.అల్విన్ మాట్లాడుతూ ఉత్పత్తితోపాటు నాణ్యతపైనా దృష్టి సారించాలని సూచించారు. సాధించాల్సిన లక్ష్యాలను జీఎం(కోఆర్డినేషన్)ఎం.సురేశ్ వివరించారు.

‘ఫ్యామిలీ డే’ ఘనంగా నిర్వహించాలి


మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సీఈఆర్‌క్లబ్ ఫ్యామిలీడే వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ కోరారు. ఈనెల17న యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో వేడుకలు ఉంటాయన్నారు. 15న సాయంత్రం నాలుగు గంటలకు మహిళా ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు క్యారమ్, చెస్, షెటిల్ బాడ్మింటన్, బాల్ ఇన్‌బాస్కెట్, బెలూన్‌త్రెడ్ పోటీలు ఉంటాయని, 16న సాయంత్రం నాలుగు గంటలకు ఉద్యోగులు, వారి పిల్లలకు లాన్‌టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, బాడీ బిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలుంటాయని, విజేతలకు ఫ్యామిలీడే రోజు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక భోజనాలు ఉంటాయని వివరించారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతకు సన్మానం



ఆంజనేయులు గౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ ప్రభాకర్, నాయకులు

కరీంనగర్‌టౌన్: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాస్టర్ వన్ 93 కేజీల విభాగంలో రాష్ట్రం తరఫున పాల్గొన్న కరీంనగర్ జిల్లా చిప్పకుర్తికి చెందిన పులి ఆంజనేయులు గౌడ్ బంగారు పతకం సాధించడం గర్వకారణమని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనను తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. రాబోయే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ దేశానికి పతకం తీసుకురావడమే లక్ష్యంగా మరింత కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఓట్లు చీల్చి బీజేపీకి లాభం చేస్తున్న ఎంఐఎం'

కరీంనగర్‌టౌన్: ప్రజలకు ప్రవేశం లేని ప్రగతి భవన్‌ను విజ్ఞాన కేంద్రం చేస్తాం అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అంటే తప్పేముందని కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. మీ నాయకుల రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే బీజేపీ బలపడుతోందన్నారు. తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం ఏం చేసిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. బలం లేని దగ్గర కూడా పోటీ చేసి, ఓట్లు చీల్చి, బీజేపీకి లాభం చేస్తుంది మీరు కాదా అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని మతాలు, కులాల సంక్షేమం కోరుకుంటోందని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తపల్లి: మండలంలోని రేకుర్తి శ్రీమురళీకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకవర్గ, ఆఫీసు బేరర్ల ఎన్నికలు సోమవారం నిర్వహించినట్లు జిల్లా సహకార కార్యాలయ జూనియర్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.తిరుమల్‌రావు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా బోయిని పోచమల్లయ్య, ఉపాధ్యక్షుడిగా బత్తిని భిక్షపతి, కార్యదర్శిగా ఆసరి కవిత, డైరెక్టర్లుగా దుబాల లక్ష్మణ్, చిలుకూరి ఉషశ్రీ, ఏనుగుల రవికిరణ్, బోయిని లక్ష్మీ మానస, బోయిని లక్ష్మీప్రసన్న, బండారి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న నాగరాజు, శివజ్యోతి

విద్యానగర్: భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ, వాసవి కపుల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ గంజ్ హైస్కూల్, సరస్వతి శిశుమందిర్‌లలో పదోతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, స్టడీ మెటీరియల్, పెన్నులు అందజేశారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో భరోసా సంస్థ అధ్యక్షుడు అక్కినేపల్లి నాగరాజు, శివజ్యోతి, వాసవి క్లబ్ అధ్యక్షుడు కైలాస నవీన్, సరస్వతి శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు సముద్రాల రాజమౌళి, సంస్థ సభ్యులు లక్ష్మణ్, శ్వేత, అఖిల్, నిఖిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర(చొప్పదండి): విద్యార్థులు ఆందోళన చెందొద్దని, పట్టుదలతో చదివాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. వసతిగృహంలో ఉంటూ చదువుకోవడం ఇష్టం లేక ఆదివారం గంగాధర మండలంలోని మధురానగర్ జ్యోతి బాపూలే గురుకుల విద్యాలయం పదో విద్యార్థిని మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యా యత్నం చేసింది. విద్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిర్వాసితులకు పరిహారం

గంగాధర(చొప్పదండి): నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న మంగపేట నిర్వాసితులకు పరిహారం మంజూరు చేయించానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. 86 ఎకరాల భూమి, బావులు కోల్పోతున్న వారికి ప్రభుత్వం రూ.16.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. 18 ఏళ్లుగా పరిహారం కోసం నిర్వాసితులు పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు.

పల్లెల్లో అక్రమ లేఅవుట్ల దందా

- అనుమతుల్లేకుండా అడ్డగోలుగా వెంచర్ల ఏర్పాటు
- కొత్తపల్లి మండలంలో రియల్టర్ల ఇష్టారాజ్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని పంచాయతీ, సుడా అధికారులు



కమాన్‌పూర్ శివారులో అక్రమ వెంచర్లు

కొత్తపల్లి: మండలంలో కమాన్‌పూర్, బద్దిపల్లి, ఎలగందుల, ఆసిఫ్‌నగర్ గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల దందా జోరుగా సాగుతోంది. కరీంనగర్ నగర శివారు పల్లెల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. దీంతో కొందరు రియల్టర్లు వ్యవసాయ భూముల్లో అనధికారికంగా ప్లాటింగ్ చేస్తూ క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు, సుడా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు సుడా నుంచి లేఅవుట్ అనుమతి తీసుకోవడం లేదని అంటున్నారు. చట్టాల్లోని లొసుగులతో గుంట, రెండు గుంటల భూములను కూడా వ్యవసాయ భూములుగా చూపిస్తూ ధరణి ద్వారా తహసీల్దార్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని చెబుతున్నారు.

'నాలా' కన్వర్షన్ చేయించి, విక్రయం

వ్యవసాయ భూములను రియల్ వెంచర్లుగా మార్చేందుకు 'నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ యాక్ట్'(నాలా) కింద వ్యవసాయేతర భూమిగా మార్చడం తప్పనిసరి. అయితే కొంత మంది రియల్టర్లు వ్యవసాయేతర భూమిని ప్లాట్లుగా విభజించి 'నాలా' కన్వర్షన్ చేయించి, గుంటలు, గజాల చొప్పున విక్రయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

ఇష్టానుసారంగా వెంచర్లు..

కమాన్‌పూర్ శివారు తూకుంట, ఎల్లమ్మ గుడి, ఎస్సీ కాలనీ సమీపాన, బద్దిపల్లి చౌరస్తా, ఆసిఫ్‌నగర్ ముత్యాలమ్మ గుడి వెనక ప్రాంతం, ఎలగందులలో వెంచర్లు వెలిశాయి. సుడా అనుమతి పొందకుండానే క్రయవిక్రయాలు సాగుతున్నాయి. వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చాలంటే ఎకరం భూమిలో 10 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. వెంచర్ చేపడుతున్న స్థలంలో ప్రజల అవసరాల దృష్ట్యా మౌలిక వసుతులైన 30 ఫీట్ల రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి. ఇవేవీ లేకుండా ఇష్టానుసారంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం..

అక్రమ వెంచర్లతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ విషయాన్ని రెవెన్యూ, సుడా, గ్రామ పంచాయతీ అధికారులు 'మామూలు'గా తీసుకుంటుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ వెంచర్లపై విచారణ చేపట్టి, లేఅవుట్ స్థలాలను గుర్తించడంతోపాటు ప్రభుత్వ భూములను వెలికితీయాలని కోరుతున్నారు.

విచారణ జరుపుతాం..

వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చాలంటే జీవోఎంఎస్ 168 ప్రకారం సుడా అనుమతి తీసుకోవాలి. అలాగే ప్రభుత్వ నిబంధనలకు లోబడి, వెంచర్లు ఏర్పాటు చేయాలి. కొత్తపల్లి మండలంలో అక్రమంగా వెలసిన వెంచర్లపై విచారణ జరుపుతాం.

– శ్రీనివాస్, ఎంపీవో

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా డ్రైనేజీ

కరీంనగర్‌లోని విద్యుత్ ప్రధాన కార్యాలయం ఎదుట డ్రైనేజీ పైకప్పు లేకుండా ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లేవారు అందులో పడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి, ప్రధాన దారులకు ఇరువైపులా డ్రైనేజీలపై పైకప్పు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఇస్లావత్ సేవా, మున్సిపల్ కమిషనర్
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 98499 05876

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

- మేయర్ వై.సునీల్‌రావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. సోమవారం 31వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ లెక్కల స్వప్నతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రెండో దఫా శిబిరాలు నగర వ్యాప్తంగా మరో 10 డివిజన్లలో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ డివిజన్‌లో 15 రోజులపాటు ఇవి ప్రజలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను మేయర్ వై.సునీల్‌రావు ఆదేశించారు. సోమవారం కరీంనగర్‌లోని 8, 11, 32వ డివిజన్లలో కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి పర్యటించారు. 8వ డివిజన్ అలుగునూరు చేపల కాలనీలో కార్పొరేటర్ సల్ల శారదతో కలిసి సీసీరోడ్లు, డ్రైనేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్ గౌతమినగర్‌లో కార్పొరేటర్ ఆకుల నర్మదతో కలిసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. 32వ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ ముదిరాజ్ కాలనీలో కార్పొరేటర్ మర్రి భావనతో కలిసి డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభించారు. పనులన్నీ నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ల సహకారంతో నగరంలోని 60 డివిజన్లలో పెద్ద ఎత్తున పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నూతనంగా మరో రూ.150 కోట్లతో ప్రతీ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 8 విలీన గ్రామాలున్న డివిజన్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈఈ కిష్టయ్య, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



మంత్రికి ప్రసాదం అందిస్తున్న ముస్లిం నాయకులు

కరీంనగర్: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని ముస్లిం నాయకులు ఇటీవల అజ్మీర్ యాత్రలో భాగంగా దర్గాను సందర్శించి, వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మంత్రిని కలిసి, కంకణం, ప్రసాదం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీ సాధించి, ప్రధానమంత్రి అయితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు జమీలుద్దీన్, డీఎంసీ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్, కొత్తపల్లి మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మునావర్ ఖాన్, నాయకులు జునైద్, ఇఫ్తేకార్, జమీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చేగుర్తిలో ఈ నెల 19న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సంబంధిత వాల్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకు దళిత సంఘాల ప్రతినిధులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. సర్పంచులు చామనపల్లి అరుణ, పురుమల్ల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్, కోండ్ర స్వరూప, రవీందర్, గోష్కి శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'నిధుల దుర్వినియోగంపై దృష్టిసారించండి'

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిధుల దుర్వినియోగంపై దృష్టిసారించాలని సామాజిక కార్యకర్త చిలుముల సుమన్ కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే తప్పుడు బిల్లులు, లెక్కలతో వాటిని మింగుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండా లంచాలు తీసుకుంటూ అర్హత లేని వారికి ఉద్యోగాలు కట్టబెడుతున్నారని అన్నారు. శానిటేషన్ సిబ్బందిని ఇష్టానుసారం ఇళ్లలో పనులకు వాడుకుంటూ పేషెంట్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వాహనాల డీజిల్ బిల్లుల విషయంలో తప్పుడు లెక్కలతో నిధులు మింగుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రణవిని అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రేకుర్తిలోని ప్యారడైజ్ హై స్కూల్‌కు చెందిన ఎస్.ప్రణవి(3వ తరగతి) ప్రతిభ కనబరిచి, బంగారు పతకం సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ విద్యార్థినిని అభినందించారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఎ.మధు, ఏవో కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు స్పోర్ట్స్ కమిషనర్‌గా సాయిరాం



కరీంనగర్ స్పోర్ట్స్: తమిళనాడులోని చెన్నైలో ఈ నెల 17 నుంచి 22 వరకు జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్, కేడెట్ బాలబాలికల జూడో పోటీలకు స్పోర్ట్స్ కమిషనర్‌గా జిల్లాలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలకు చెందిన జూడో కోచ్ బి.సాయిరాం యాదవ్ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అతను జూడోలో ఎన్‌ఎస్‌ఎన్‌ఐఎస్ కోర్సు పూర్తి చేసి, ఇటీవలే క్రీడా పాఠశాలలో కోచ్‌గా నియమితుడయ్యాడని పేర్కొన్నారు. కాగా సాయిరాం గతంలో జరిగిన పలు జాతీయస్థాయి జూడో పోటీలకు రెఫరీగా వ్యవహరించి, పలువురి మన్ననలు పొందాడన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, మానేరు విద్యాసంస్థల అధినేత, జూడో సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, మహ్మద్ కరీం, జూడో సంఘం బాధ్యులు, కోచ్‌లు ఎల్‌వీ.రమణ, సిలివేరి మహేందర్, కిష్టయ్య, గణేశ్ తదితరులు అభినందించారు.

భూ ఆక్రమణపై విచారణ జరిపించండి

- అధికారులకు కమాన్‌పూర్‌వాసుల ఫిర్యాదు



అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని 137 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ జరిపించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. కమాన్‌పూర్ శివారులో ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 137లో పట్టాదారులకు 1964లో 17 గుంటల భూమి ఉందన్నారు. ప్రస్తుతం రహదారి విస్తరణలో భాగంగా 8 గుంటల భూమి పోగా ప్రభుత్వం నుంచి సదరు పట్టాదారులు పరిహారం తీసుకున్నట్లు తెలిపారు. అయితే 2020–2021 సంవత్సరం రికార్డులో 27 గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారని పేర్కొన్నారు. దీన్ని ఆధారంగా చేసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టాదారుల నుంచి భూమి కొనుగోలు చేసి, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో బోన మునీందర్, కుంట తిరుపతి, సిరిపురం నాగప్రసాద్, బోనాల తిరుమల్, అరిగెల మల్లేశం, ఆకుల శంకరయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న శివకుమార్

శాతవాహన యూనివర్సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం విదేశీ విద్యపై గ్లోబల్ ఎడ్యుకేషన్–కర్రీస్ ఫోరం(జీఈసీఎఫ్), తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీఈసీఎఫ్ ఇంటర్నేషనల్ అకాడమిక్ కౌన్సెలర్ శివకుమార్ మాట్లాడుతూ.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ (ఐఈఎల్‌టీ, టోఫెల్, పీటీఐ), వీసా ప్రాసెసింగ్, ఫీజు వివరాలు, ఉచిత శిక్షణ తరగతులు, స్కాలర్‌షిప్, విదేశీ విద్యకు కావాల్సిన బ్యాంకు లోన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ సీహెచ్.మారుతి, జె. ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. ఇంగ్లిష్ భాషలో నైపుణ్య ప్రాముఖ్యతను వివరించారు. టీఎస్‌కేసీ మెంటర్ డి.రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదానీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

విద్యానగర్: అదానీ కంపెనీల షేర్లు పతనమవడం వల్ల వాటిలో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ తీవ్రంగా నష్టపోయిందని ప్రజామిత్ర సంస్థ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. వెంటనే ఆయా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీ సంస్థలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.వేల కోట్లు రుణంగా ఇచ్చిందన్నారు. వాటి గారడీ వల్ల ఎల్ఐసీ, ఎస్‌బీఐలతోపాటు దేశంలోని 60 కోట్ల మంది నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ఆస్తులను అమ్మే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డోముల నిర్మాణంపై అవగాహన లేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ వాటిని కూల్చివేస్తామని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. డోము నిర్మాణం భారత నిర్మాణ రంగంలోనే ప్రారంభమై ఇతర దేశాలకు వెళ్లిందని తెలిపారు. విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. కేంద్ర విధానాలను వ్యతిరేకించడంలో ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కరీంనగర్ స్పోర్ట్స్: కర్ణాటక రాష్ట్రంలోని కర్ణాటక లా విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 17 వరకు జరగనున్న ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ఎండీ.సర్వర్ తెలిపారు. ఇటీవల నగునూర్‌లో జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో రాణించిన ఎ.క్రాంతి, బి.అర్జున్‌లను జాతీయస్థాయికి ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

ప్రభుత్వ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు

కొత్తపల్లి: బద్దిపల్లి, చింతకుంట గ్రామాల్లో ప్రభుత్వ భూములు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై, వారిని ఇందుకు ప్రేరేపించిన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. చింతకుంటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కరీంనగర్‌కు చెందిన పలువురు మహిళలు ఆక్రమించుకోవాలని చూడటం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. గతంలో బద్దిపల్లిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్నారు. ఇకపై ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, రైస్‌మిల్, ఆదిత్య అపార్టుమెంట్, చేపల మార్కెట్, శ్రీహరి నగర్, సంతోష్‌నగర్, సత్యనారాయణ స్వామి దేవాలయం, సిద్ధార్థ స్కూల్, వాసర ఆసుపత్రి, పారమిత స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గంగాధర(చొప్పదండి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్ యాదవ్ కోరారు. గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో సోమవారం బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వ జిమ్మిక్కులను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు దూళం కల్యాణ్, కోల అశోక్, రేండ్ల శ్రీనివాస్, తిరుపతి,ఉప్పు శ్రీనివాస్, కొక్కుల శ్రీధర్, మహేశ్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓర్వలేకనే ప్రతిపక్షాల ఆరోపణలు'

వీణవంక(హుజూరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు అప్పని హరీశ్‌వర్మ అన్నారు. వీణవంక మండలంలోని రామకృష్ణాపూర్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని, అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఇవ్వడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ దేశ రాజకీయాలను శాసిస్తుందని తెలిపారు.

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కరీంనగర్ కల్చరల్: విద్యానగర్‌లోని ప్రాచీన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ప్రధానార్చకుడు వానమామలై పవనకుమారాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం గరుడ వాహనసేవ, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధనలు, సప్తావరణాలు, ఋత్విక్ సన్మానం జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్ రెడ్డి, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేసవి మంటలు..!

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతోంది. అయితే ఎల్ నినో సీజన్ మొదలయ్యేందుకు ఇంకా మూడు నాలుగు నెలలు ఉన్నందున ఈ అంచనాలు తప్పు కావచ్చునని కూడా పేర్కొంది. కాగా ఈ నెలాఖరుకు తాజా అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ డైరెక్టర్ ఎం.మహాపాత్ర తెలిపారు. ఇలా ఉండగా వాతావరణంలో అనూహ్య మార్పుల వల్ల అతి భారీ, అకాల వర్షాలు, అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ వేసవిలో వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు.

సమాచారం ఆందోళనకరమే: స్కైమెట్

ఈ ఏడాది ఎల్ నినో, లా నినా పరిస్థితులపై అందిన ప్రాథమిక సమాచారం ఆందోళనకరంగానే ఉందని దేశంలోనే తొలి ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమెట్‌కు చెందిన మహేశ్ పలవట్ చెబుతున్నారు. 'పరిస్థితులు లా నినా నుంచి ఎల్ నినో వైపునకు మారుతున్నాయంటేనే ప్రమాదం ముంచుకొస్తోందని అర్థం. రుతుపవనాల సమయంలో ఎల్ నినో ఏర్పడితే ఈ ఏడాది వర్షాలు తగ్గుతాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. 2020లోనే లా నినా పరిస్థితులు ఏర్పడి, ప్రస్తుతం కూడా అదే కొనసాగుతున్నా ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో ఉండటం, గత ఏడాది కొన్నిసార్లు విపరీతమైన వడగాడ్పులు నమోదు కావడం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫ్రిబవరి, మార్చిల్లోనూ ఉష్ణోగ్రతలు కొంచెం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత మాత్రం అసాధారణ స్థాయిలో ఉండవచ్చు..' అని పలవట్ పేర్కొన్నారు.

సముద్ర జలాలు వెచ్చబడితే అధిక ఉష్ణోగ్రతలు

లా నినా పరిస్థితుల్లో తూర్పు నుంచి పశ్చిమం వైపు వీచే వాణిజ్య పవనాలు బలంగా ఉంటాయి. దీనివల్ల సముద్ర ఉపరితలంపై ఉండే వెచ్చటి నీరు పశ్చిమ దిక్కుకు ఎక్కువగా కదులుతుంది. అదే సమయంలో సముద్రపు లోపలి భాగంలోని శీతల జల ప్రవాహాలు తూర్పువైపునకు ప్రయాణిస్తాయి. అధిక వర్షాలకు కారణమవుతాయి. ఎల్ నినోలో పరిణామాలు మాత్రం దీనికి వ్యతిరేక దిశలో ఉంటాయి. వాణిజ్య పవనాలు బలహీనపడి ఉపరితలంపైన వెచ్చటి నీరు తూర్పు దిక్కుకు అంటే మన వైపు ప్రయాణిస్తుంది. అప్పటికే చల్లగా ఉన్న నీటిని ఇవి వెచ్చబెడతాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. ఇండోనేసియా, ఆస్ట్రేలియాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాల్లో తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా రుతుపవనాలు బలహీనపడిపోతాయి. కరువులు, కార్చిచ్చులు ఎక్కువవుతాయి.

సగటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

ఉష్ణోగ్రతలు నమోదు చేయడం మొదలుపెట్టిన తరువాత అత్యధిక వేడి నమోదైన సంవత్సరాల్లో 2022ది ఐదో స్థానం. ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడితే ఈ రికార్డులు చెరిగిపోయే అవకాశం ఉంది. సగటు ఉష్ణోగ్రతలు శతాబ్దం క్రితంతో పోలిస్తే 1.5 డిగ్రీ సెల్సియస్ వరకు పెరగవచ్చునని అంచనా. గత ఏడాది భారత్‌లో కనీసం తొమ్మిది నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాడ్పులు రావచ్చని గత ఏడాది ఐఎండీ హెచ్చరించింది.

ఏర్పాట్లు చేసుకోమన్నాం..

మధ్యమ స్థాయి ఎల్‌నినో రుతుపవనాలపై ప్రభావం చూపగలదు. దీనివల్ల కురిసే వర్షాల మోతాదు తగ్గుతుంది. కానీ ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రం రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉంటాయని చెప్పలేం. రానున్న మూడు నాలుగు నెలల్లో బంగాళాఖాతం, అరేబియా సముద్రాల ఉపరితల జలాల ఉష్ణోగ్రతల్లో తేడాల ఆధారంగా రుతుపవనాల తీవ్రతలో తేడాలు రావచ్చు. మొత్తం మీద ఈ సారి ఎండలు తీవ్రంగానే ఉండబోతున్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కూడా సూచించాం.

–ఎం.రాజీవన్, ఎర్త్ సైన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి

ప్రజాస్వామ్య స్ఫూర్తితో గవర్నర్ సేవలు

- విశ్వభూషణ్ హరిచందన్‌ను కొనియాడిన ఏపీ ముఖ్యమంత్రి జగన్
- గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సీఎం దంపతులు


గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, సతీమణి భారతి

సాక్షి, అమరావతి: అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఎంతో రాజకీయ పరిణతి కనబరిచారని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఆయన గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను ప్రజలు సదా గుర్తుంచుకుంటారన్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్‌తో సీఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌లో సోమవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉప కార్యదర్శి నారాయణస్వామి స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో సీఎం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించి సత్సంబంధాలు సాగేలా కీలక పాత్ర పోషించారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులను అధిగమించి రాష్ట్రం ప్రగతిపథంలో పయనించడానికి గవర్నర్ ఎంతో సహకరించారన్నారు. విశ్వభూషణ్ హరిచందన్ బదిలీ కావడం బాధాకరమైనా మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుగుతారన్నారు.

అటవీ పరిహారం పెంపు

- వన్యప్రాణుల దాడుల్లో మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని వైల్డ్ లైఫ్ బోర్డు ప్రతిపాదనలు
- అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వన్యప్రాణుల దాడుల్లో (పులులతో సహా) మరణాలు, పంట నష్టాలకు పరిహారం పెంచాలని రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం రూ.ఐదు లక్షలు ఉన్న పరిహారాన్ని పది లక్షలకు పెంచుతూ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నారు. సాధారణ గాయాలైతే వాస్తవ వైద్యం ఖర్చు (లక్షకు మించకుండా), తీవ్రంగా గాయపడితే వైద్యానికి అయ్యే ఖర్చు (మూడు లక్షలకు మించకుండా), అంగవైకల్యం ఏర్పడితే లక్ష పరిహారం, పెంపుడు జంతువులు చనిపోతే వాస్తవ అంచనా, పంట నష్టానికి ప్రస్తుతం ఎకరాకు ఆరువేలు ఉన్న పరిహారాన్ని రూ.7,500కు పెంచాలని, పండ్ల తోటలకు నష్టపరిహారం కూడా రూ.7,500కు (గరిష్టంగా యాభై వేల దాకా) పెంచాలని కమిటీ ప్రతిపాదించింది. సోమవారం అరణ్య భవన్‌లో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి మండలి (వైల్డ్ లైఫ్ బోర్డు), మనుషులు – జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించే చర్యల సూచనల కమిటీ సమావేశాలు జరిగాయి.

- అటవీశాఖ నేతృత్వంలో అడవుల రక్షణ, వన్యప్రాణి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ వివరించారు. రాష్ట్రంలో మొదటి సారి చేపట్టిన పులుల ఆవాసాల్లో ఉన్న మానవ ఆవాసాల తరలింపు (కవ్వాల్ లో రెండు గ్రామాలు) ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.

వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

- హైదరాబాద్ వనస్థలిపురంలో బస్ టెర్మినల్ నిర్మాణానికి వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది.
- హరిణి వనస్థలికి చెందిన 1.354 హెక్టార్ల అటవీ భూమి నిబంధనలకు అనుగుణంగా మళ్లింపును అనుమతిని ఇచ్చారు. జాతీయ రహదారిలో విపరీతంగా పెరిగిన రద్దీ, ప్రయాణీకుల సౌకర్యం కోసం ఈ టెర్మినల్ నిర్మాణం కానుంది.
- శ్రీశైలం రహదారి విస్తరణ కోసం వచ్చిన ప్రతిపాదనను అమ్రాబాద్ లో ఉన్న వన్యప్రాణి సంరక్షణ దృష్టిలో పెట్టుకుని బోర్డు తిరస్కరించింది. ఇతర రోడ్లు, ఇరిగేషన్, (కడెం పరిధిలో లక్ష్మీపూర్ లిఫ్ట్, నాగార్జున సాగర్ పరిధిలో పెద్ద గుట్ట లిఫ్ట్) కేబుల్ పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. వన్యప్రాణులు ప్రమాదంలో పడ్డప్పుడు కాపాడేందుకు అవసరమైన రెస్క్యూ టీమ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, సభ్యులు కోవ లక్ష్మి, రాఘవ, బానోతు రవి కుమార్, అనిల్ కుమార్, పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ) ఎం.సీ.పర్గెయిన్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఓఎస్డీ శంకరన్ పాల్గొన్నారు.

నికర అప్పు 2,83,452 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ బ్యాంకులు, నాబార్డు లాంటి ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాలను సంవత్సరాలవారీగా వెల్లడించాలని కోరుతూ నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం మేరకు ఈ అప్పుల లెక్కలను వివరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు రుణాలేవీ తీసుకోలేదని పేర్కొన్నారు. 2014 జూన్ 2 నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి రూ.2.84 లక్షల కోట్ల నికర అప్పు తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. నికర అప్పుతోపాటు నాబార్డు, వివిధ బ్యాంకుల నుంచి పలు కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను కూడా ఈ సమాధానంలో కేంద్రం సవివరంగా పేర్కొంది. ఈ వివరాల ప్రకారం రాష్ట్ర అప్పులు 2016–17లో రూ. లక్ష కోట్ల మార్కు దాటితే 2019–20లో రూ. 2 లక్షల కోట్ల మార్కు దాటాయని వెల్లడించింది.

12 బ్యాంకుల నుంచి కార్పొరేషన్ల రుణాలు

రాష్ట్రం ఏర్పాటయ్యాక 12 జాతీయ బ్యాంకుల నుంచి కార్పొరేషన్లకు రుణాలు లభించినట్లు కేంద్రం లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించింది. ఈ బ్యాంకులన్నింటి ద్వారా 2014 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు మొత్తం రూ. 1.28 లక్షల కోట్లను ప్రభుత్వం పూచీకత్తు ఉండి కార్పొరేషన్లకు ఇప్పించిందని తెలిపింది.

భగీరథకు 'నిడా'రుణాలు

నాబార్డు ద్వారా వివిధ నిధుల కింద కూడా తెలంగాణ ప్రభుత్వరంగ కార్పొరేషన్లు రుణాలు తీసుకున్నాయని కేంద్రం వెల్లడించింది. ఇందులో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్‌ఐడీఎఫ్) కింద రూ. 7,144 కోట్లు, వేర్‌హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (డబ్ల్యూఐఎఫ్) కింద రూ. 85,227.94 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ ఫండ్ (ఎఫ్‌పీఎఫ్) కింద రూ. 1,007.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు తెలిపింది. నాబార్డు మౌలిక వసతుల అభివృద్ధి సాయం (నిడా) కింద రూ. 11,424 కోట్లను అప్పుగా తీసుకున్నట్లు వివరించింది. ఇందులో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు తెలంగాణ తాగునీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ (టీడీడబ్ల్యూఎస్‌సీఎల్) ద్వారా ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని సెగ్మెంట్లలో భగీరథ పనులు చేసేందుకు రుణాలు తీసుకున్నారని తెలిపింది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీ) ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, కొమురెల్లి మల్లన్న రిజర్వాయర్, నృసింహసాగర్ (బస్వాపూర్) రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఈ రుణాలు సేకరించినట్లు పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో స్పష్టం చేశారు.

తెలంగాణ ఏర్పాటైన తర్వాత తీసుకున్న రుణాలు (సంవత్సరాల వారీగా)

సంవత్సరం	నికర అప్పు	ఆ ఏడాది పెరిగిన అప్పులు (రూ. కోట్లలో)
2014 జూన్ 2 నాటికి	75,577	-
2014-15	83,698	8,121
2015-16	99,213	15,515
2016-17	1,29,532	30,319
2017-18	1,52,190	22,658
2018-19	1,75,281	23,091
2019-20	2,05,858	30,577
2020-21	2,44,019	38,161
2021-22	2,83,452	39,433


నాబార్డు ద్వారా మంజూరైన, తీసుకున్న అప్పులు (2022 అక్టోబర్ నాటికి)

నిధి	మంజూరైన రుణం	వచ్చిన రుణం (రూ. కోట్లలో)
ఆర్ఐడీఎఫ్	8,873	7,144
డబ్ల్యూఐఎఫ్	97,278.89	85,227.94
ఎఫ్‌పీఎఫ్	2,883.00	1,007.10
నిడా	14,516.65	11,424.66

(నోట్: ఈ రుణాలు వివిధ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించినవి. ఇవి కాక వివిధ ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రూ. 1.28 లక్షల కోట్లకుపైగా రుణాలను ప్రభుత్వం పూచీకత్తు ఉండి ఇప్పించిందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇలా కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు కేంద్ర లెక్కల ప్రకారం రూ. 2.42 లక్షల కోట్ల వరకు ఉన్నాయి)

హైకోర్టులో 'కార్వీ'కి ఊరట

ఈడీ అప్పీల్ కొట్టివేత




సాక్షి, హైదరాబాద్: కార్వీ గ్రూప్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి హైకోర్టు సింగిల్ జడ్జి రెండు నెలల సమయం ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. వాదనలు విన్న ధర్మాసనం అప్పీల్‌ను కొట్టివేసింది. ఖాతాదారులకు చెందిన షేర్లను తాకట్టు పెట్టి రుణం పొంది వాటిని డొల్ల కంపెనీలకు మళ్లించారన్న ఆరోపణలపై కార్వీపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ... షేర్లు, భూములు, భవనాలు, విదేశీ కరెన్సీ, బంగారు ఆభరణాలను జప్తు చేయడం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సంస్థ సీఎండీ పార్థసారథి సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి... ఈడీ ఎడ్జుడికేటింగ్ అథారిటీ ఆస్తుల జప్తు నోటీసులపై సమాధానం ఇవ్వడానికి కార్వీకి 2 నెలల సమయం ఇచ్చారు. ఈ తీర్పును తప్పుబడుతూ ఈడీ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అథారిటీ 180 రోజుల్లో రిపోర్టు అందజేయాల్సి ఉంటుందని, అదనంగా సమయం ఇవ్వడం సరికాదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సమయ వెసులుబాటు ఇచ్చే అధికారం కోర్టులకు ఉంటుందని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన రెండు నెలల గడువు మరో వారంలో ముగియనుండగా ఇప్పుడు సవాల్ చేయడాన్ని తప్పుబడుతూ అప్పీల్‌ను కొట్టివేసింది.

జీవ వైవిధ్యానికి ప్రతీక 'కవ్వాల్'

- జన్నారం అటవీ డివిజన్ వివిధ వన్యప్రాణులకు నిలయం
- అరుదైన కృష్ణజింకలు, గడ్డి జింకలు, కొండగొర్రెల సంచారం


అడవి బర్రెలు


చిరుతపులుల జోరు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అరుదైన జంతువులకు జన్నారం అటవీ డివిజన్ ఆశ్రయమిస్తోంది. అడవిలో అటవీశాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు చిక్కిన వన్యప్రాణుల చిత్రాలను డిప్యూటీ కన్జర్వేటర్, ఎఫ్‌డీవో మాధవరావు సోమవారం విడుదల చేశారు. అరుదైన కృష్ణజింకలు, చిరుతపులులు, చుక్కల దుప్పులు, అడవికుక్కలు, నక్కలు, కొండగొర్రెలు, అడవిదున్నలు, నీలు గాయిలు, తోడేళ్లు, వివిధ రకాల జంతువుల ఆవాసాలుగా జన్నారం అడవులు ఉన్నాయి. గత రెండేళ్లుగా అటవీశాఖ గడ్డి మైదానాలు, నీటికుంటలు విరివిగా ఏర్పాటు చేయడంతో వన్యప్రాణుల సంతతి పెరుగుతోంది. పులి తప్ప మిగతా అన్ని వన్యప్రాణులు ఉన్నాయి. రాకపోకలు సాగించే పులి ఎప్పటికైనా ఆగకుండా ఉంటుందా అనే ఆశతో అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. పులికి అవసరమైన ఆవాసం, ఆహారం కొరత లేకుండా చూస్తున్నారు.


కివెట్ క్యాట్




ఆడ, మగ కృష్ణ జింకలు

మూగబోయిన సప్తస్వరాలు..!

- అలంకారప్రాయంగా విద్యాలయం
- అధ్యాపకుల నియామకంలో ప్రభుత్వం అలసత్వం
- కళాశాల కోసం మహిళా భవనం కేటాయింపు
- మరమ్మతు నిధుల కోసం ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏకైక కళాశాల దుస్థితి


మంథనిలోని సంగీత నృత్య విద్యాలయం

మంథని:ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న ఏకైక సంగీత, నృత్య విద్యాలయం అలంకారప్రాయమైంది. సప్తస్వరాలు పలికించే అధ్యాపకుల నియామకం లేక కళాశాలకు ఆదరణ కరువైంది. ప్రాచీన పుణ్యక్షేత్రాల్లో ఒక్కటై.. వేద విద్య పుట్టి విరాజిల్లిన మంథనిలో సంగీత కళాశాల నెలకొల్పితే ప్రాచీన కళలు కాపాడబడతాయని 1992లో ఇక్కడ కళాశాలను ప్రారంభించారు. కొద్ది కాలం పూర్తిస్థాయి అధ్యాపకులు, కార్యాలయం సిబ్బందితో బాగానే నడిచిన కళాశాల.. రానురాను గాడితప్పింది.

రెగ్యులర్ ప్రిన్సిపాల్.. ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులు

కళాశాలలో 18 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా ప్రిన్సిపాల్ మాత్రమే రెగ్యులర్. ఇద్దరు అటెండర్లు, స్వీపర్ ఉన్నారు. మృదంగం మాస్టారు హైదరాబాద్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిన మృదంగం విద్య నేర్పుతున్నారు, వయోలిన్, కూచిపూడి, సితార, గాత్రం, వయోలిన్, హిందూస్థానీ, గాయక అకంపనిస్టు, మృదంగం అకంపనిస్టు, వీణ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియర్ అసిస్టెంట్ డెప్యూటేషన్‌పై వెళ్లగా.. జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టు కూడా ఖాళీగా ఉంది. నైట్ వాచ్‌మన్ కూడా లేడు. కళా శాల ప్రారంభంలో అధ్యాపకులందరినీ సమకూర్చిన సాంస్కృతిక శాఖ.. క్రమంగా ఇక్కడ పనిచేసిన వారిని వేరేచోటుకు డెప్యూటేషన్‌పై పంపడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది.

గతమెంతో ఘనం.. ఇప్పుడు దయనీయం

కళాశాలలో వేదవిద్య నేర్చుకున్న ఎంతోమంది జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక బహుమతులు అందుకుని అప్పట్లో కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారు. కొంతకాలంగా విద్యాలయంలో అధ్యాపకుల కొరత ఉండగా.. వాటిని పూర్తిచేయడంలో భాషా సాంస్కృతిక శాఖ దృష్టి కేంద్రీకరించలేకపోతోంది. సప్తస్వరాలతో వందలాది మంది విద్యార్థులతో కళకళలాడాల్సిన కళాశాల పరిస్థితి దయనీయంగా మారింది. కేవలం అటెండర్లు మాత్రమే వంతులవారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ కళాశాల ఉందనే విషయాన్నే ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరిచిపోయారనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఏ ఒక్క ప్రజాప్రతినిధిగానీ.. అధికారిగానీ కళాశాలను సందర్శించిన సందర్భాలు లేవు. ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక కళాశాల పనితీరు బాగాలేదని, కొత్త రాష్ట్రంలోనైనా పరిస్థితి మారుతుందనే ఆశాభావాన్ని సంగీత ప్రియులు వ్యక్తంచేసినా మార్పు మాత్రం కన్పించడంలేదు.

పక్కా భవనం.. నిధుల కోసం ప్రయత్నాలు

కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో నెలనెలా రూ.15వేల నుంచి రూ.20 వేల అద్దె భారం పడుతోంది. గతంలో మహిళామండలి స్థలాన్ని కళాశాలకు కేటాయించారు. మహిళా మండలికి పక్కా భవనం నిర్మించారు. కళాశాల ప్రిన్సిపల్ పక్కా భవనం కోసం రెండేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ మహిళా మండలి భవనాన్ని కళాశాలకు కేటాయిస్తూ మున్సిపాలిటీ తీర్మానం చేసింది. అయితే భవనం అసంపూర్తిగా ఉండడంతో అందులో కళాశాల కొనసాగించాలంటే నిధులు అవసరమవుతాయి.

ఆసక్తి చూపని విద్యార్థులు

సప్తస్వరాలు పలికించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మృదంగం, పేరణీ నృత్యానికి మాత్రమే కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉండడంతో 20 నుంచి 25 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఇందులో పట్టుమని పది మంది విద్యార్థులు కూడా కళాశాలకు రావడం లేదు.


కళాశాలకు కేటాయించిన మహిళా భవనం

కళాశాలకు త్వరలోనే మంచి రోజులు



నేను వచ్చిన కొద్దినెలల్లోనే కళాశాల పక్కాభవనానికి ప్రయత్నించి స్థానిక ప్రజాప్రతినిధుల సాయంతో సాధించుకున్నం. మరమ్మతు నిధులకు ప్రయత్నిస్తున్న. త్వరలో భర్తీ చేయబోయే పోస్టుల్లో ఇక్కడికి కర్నాటక ఓకల్, కూచిపూడితోపాటు మరి కొంతమంది అధ్యాపకులు చేరుతారనే విశ్వాసం ఉంది. పక్కా భవనం, అధ్యాపకులు వస్తే కళాశాలకు మంచి రోజులు వస్తాయి.

– పాండురంగ్ ముతాలిక్, ప్రిన్సిపాల్, సంగీత విద్యాలయం, మంథని

సిర్పూర్(టి)లో పులి కలకలం


రోడ్డు సమీపంలో పులి

సిర్పూర్(టి): కుమురంభీం జిల్లాలో రహదారి పక్కన తిరుగుతూ ఓ బెబ్బులి ప్రయాణికులను హడలెత్తించింది. సిర్పూర్(టి) మండలం వేంపల్లి గ్రామ సమీపంలోని సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన అటవీ ప్రాంతంలో సంచరిస్తూ పులి సోమవారం వాహనదారుల కంట పడింది. కారులో కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న కొంత మంది యువకులు పెద్దపులిని గమనించి సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పులి పాదముద్రలు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో ఒంటరిగా బైక్‌లపై వెళ్లొద్దని ఎఫ్ఎస్‌వో పోశెట్టి సూచించారు.


ఆర్జీయూకేటీలో త్రీడీ ప్రింటింగ్‌పై ఎఫ్‌డీపీ


త్రీడీ ప్రింటింగ్‌పై వివరిస్తున్న అధ్యాపకులు


హాజరైన విద్యార్థులు

భైంసా: ఆలోచన ప్రక్రియకు త్రీడీ ప్రింటింగ్ ద్వారా భౌతిక నమూనా తీసుకురావచ్చని ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్ అన్నారు. నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో డిపార్ట్‌మెంటు ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్, డెవలప్‌మెంట్ అండ్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్, డిజైన్‌పై వారంరోజులపాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్ హాజరై మాట్లాడారు. శిక్షకులకు శిక్షణ ఇవ్వాలని, తద్వారా వారు విద్యార్థులకు మరింత అర్థవంతంగా బోధిస్తారన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని త్రీడీ ప్రింటింగ్ అత్యాధునిక ప్రయోగశాల, సౌకర్యాలున్నాయని తెలిపారు. విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా సందర్శించవచ్చని తెలిపారు. వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ వెంకటరమణ మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ సంస్థలతో దాదాపు 16 ఎంవోయూలు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్జీయూకేటీని అత్యున్నత విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన విద్యార్థులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రిన్సిపాల్‌కు జాతీయ పురస్కారం


రామకృష్ణ

శాతవాహనయూనివర్సిటీ: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కవి, సాహితీవేత్త, శాతవాహన విద్యాలయం పాలకమండలి సభ్యుడు కల్వకుంట రామకృష్ణను జాతీయస్థాయి భారత్ భాష భూషణ్ అవార్డుకు ఎంపిక చేశారని అఖిల భారత భాష సాహిత్య సమ్మేళన ప్రధాన కార్యదర్శి కృతి చతుర్వేది తెలిపారు. ఈ నెల 17న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించే పురస్కార ప్రధానోత్సవ సభలో మధ్యప్రదేశ్ వైద్య విద్య, పునరావాస శాఖ మంత్రి విశ్వాస్ సారంగ్, సీనియర్ కవి, డాక్టర్ యతేంద్రనాథ్ రామ్, డాక్టర్ రామ్‌వలబ్ ఆచార్య చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేయనున్నారు. రామకృష్ణ ఎంపికపై శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య మల్లేశ్ సంకశాల, ఓఎస్డీ డాక్టర్ వన్నాల రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకులు తదితరులు అభినందనలు తెలిపారు.



ప్రేమకానుక

సింపుల్ & స్వీట్



ఖరీదైన గిఫ్ట్‌లలోనే ప్రేమ ఉండదు. ప్రేమ గొప్పతనం అదే కదా! సింపుల్‌గా, తక్కువ ఖర్చుతో ప్రేమకానుకలు ఇవ్వడానికి మార్కెట్‌లో బోలెడు ఆప్షన్స్ ఉన్నాయి. మచ్చుకు కొన్ని...
● హార్ట్ షేప్డ్ మగ్స్, హార్ట్ షేప్డ్ చాక్లెట్స్ ● 365 లవ్ మెసేజ్‌లు, తియ్యటి టోఫీలతో కూడిన జార్ ● రొమాంటిక్ గ్రీటింగ్ కార్డ్స్ ● వాలెంటైన్స్ డే క్రిస్టల్ మెమెంటో ● ఫ్లోటింగ్ హార్ట్స్ గ్లాస్‌ఫ్రేమ్స్ ● 'ఇట్ వాజ్ ఆల్వేస్ యూ' ఫొటో పోస్టర్ ● రొటేటింగ్ పర్సనలైజ్‌డ్ పెన్ స్టాండ్ ● మెటల్ ఫొటో కీచైన్ ● వుడెన్ పర్సనలైజ్ జిగ్‌సా పజిల్ ● లవ్ నెవర్ ఎండ్స్ ఫ్రేమ్ ● లవ్ సర్టిఫికెట్ విత్ ఫ్రేమ్

టెక్‌సావి అయితే... ● ఫుజీ ఫిల్మ్ ఇన్‌స్టాక్స్ మినీ-11 కంపాక్ట్ ఇన్‌స్టంట్ కెమెరాతో క్రెడిట్-కార్డ్ సైజ్‌లో ఫొటోలు తీసుకోవచ్చు ● బిసైడ్ ల్యాంప్: మన వాయిస్‌తో రకరకాల రంగులను ఇల్లంతా వెదజల్లుతుంది ● రకరకాల హెయిర్‌స్టైల్స్‌ను ఇష్టపడే వారి కోసం: డైసన్ ఎయిర్‌రాప్ ● వీడియో గేమ్ ప్రేమికుల కోసం... ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్ కన్సోల్, లాగిటెక్ ఎ30 గేమింగ్ హెడ్‌సెట్ ● సంగీత ప్రేమికుల కోసం... జేబియల్ మినీబ్లూ స్పీకర్, అమెజాన్ ఎకో స్టూడియో స్పీకర్, శాంసంగ్ ఎంఎక్స్-ఎస్టీ 40బీ సౌండ్ టవర్ ● సెల్‌ఫోన్‌లోని మీ విలువైన జ్ఞాపకాల ఫొటోలను అప్పటికప్పుడు ప్రింట్ తీసుకోవడానికి... హెచ్‌పీ స్ప్రోకెట్ పోర్టబుల్ ప్రింటర్.









ఇంటిప్

బంగాళ దుంపలను చెక్కు తీసి పడేసి వండుతుంటారు. ఇలా పారవేసే పచ్చి బంగాళ దుంప తొక్కలో విటమిన్ సి తోబాటు కొన్ని రకాల ఎంజైములు ఉంటాయి. అందువల్ల ఈ తొక్కలను ఒక గంటపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తరువాత అలసిపోయిన కళ్లమీద, కళ్ల చుట్టూ పెట్టుకుని 20 నిమిషాలపాటు ఉంచుకోవాలి. తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు ఉన్న ఒత్తిడి, అలసట తగ్గి ఫ్రెష్‌గా కనిపిస్తాయి.





బ్యూటిప్

కురులకు ఉల్లి, కరివేపాకు

సహజసిద్ధంగా జుట్టును నల్లగా చేసుకునేందుకు... గుప్పెడు కరివేపాకును మిక్సీలో వేసి పేస్టులా చేసుకోండి. ఆ తర్వాత ఒక ఉల్లిపాయను తీసుకుని ముక్కలుగా తరిగి మిక్సీలో వేసి రసం తీసుకోవాలి. కరివేపాకు పేస్టులో ఉల్లిరసాన్ని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల వరకు చేరేలా తలకు మర్దన చేస్తూ జుట్టుకు పట్టించండి. అరగంట తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయండి. ఇలా రెగ్యులర్‌గా చేస్తుంటే జుట్టు తెల్లబడటం ఆగుతుంది.

పోరాటం

సతీ భూదేవి

**యముడితో పోరాడి భర్త ప్రాణాలు తిరిగి తెచ్చుకున్న సతీ సావిత్రి కథ మనకు తెలుసు.
చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్న భర్తను పరాయి దేశం నుంచి విడిపించుకుని రావడానికి పద్నాలుగేళ్లు పోరాటం చేసింది ఈ భూదేవి.
నేడు వేలంటైన్స్ డే. ప్రేమకు పట్టం కట్టే రోజు.
భర్త పట్ల భార్యకు ఎంత ప్రేమ ఉంటుందో...
అతని శ్రేయస్సు కోసం ఆమె ఎంత తపన పడుతుందో
ఈ రోజున ఈ ఘటన ద్వారా కాకుండా మరెలా తెలుసుకుంటాం?
భార్య ప్రేమకు శక్తి ఉంటే అది ఇంత బలంగా ఉంటుంది.
ఇంత అచ్చెరువొందేలా కూడా ఉంటుంది.**



● భర్త, కొడుకుతో భూదేవి

తీవ్రవాదుల చెరలో బందీగా ఉన్న తన భర్తను విడిపించుకోవడానికి 'రోజా' సినిమాలో హీరోయిన్ తెగువను ఆస్వాదించాం. అచ్చం అలాంటి కథను పోలిన నిజజీవిత ఘటన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలో చోటు చేసుకుంది. విద్యాగంధం ఏమంతగా అంటని మాకూరి భూదేవి మరణశిక్ష ఖరారైన తన భర్తకు క్షమాభిక్ష ప్రసాదించాలని సుదీర్ఘ న్యాయపోరాటం చేసి విజేతగానే కాదు, వార్తలలో కూడా నిలిచింది. భూదేవి 14 ఏళ్లుగా చేసిన న్యాయపోరాటానికి ఇటీవల ఫలితం దక్కింది. ఇప్పుడు భూదేవి, ఆమె కుమారుడు రాజు, భర్త శంకర్ ఆనందోత్సాహంలో మునిగి తేలుతున్నారు.

అసలేం జరిగిందంటే...

మెండోరాకు చెందిన మాకూరి శంకర్‌కు సెంటు కూడా వ్యవసాయ భూమి లేదు. ఇక్కడ కూలి పని చేస్తే పెద్దగా సంపాదించుకోవడం కష్టం అనుకున్నాడు. తన భార్య గర్భవతిగా ఉన్న సమయంలో 2004లో దుబాయ్‌కు వెళ్లిపోయాడు. అక్కడ ఒక నిర్మాణ సంస్థలో ఫోర్‌మెన్ (సూపర్‌వైజర్)గా చేరాడు. అతనికింద పని చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన రామావతార్ కుమావత్ ప్రమాదవశాత్తు భవనం ఆరో అంతస్థుపై నుంచి పడి చనిపోయాడు. ఫోర్‌మెన్‌గా ఉన్న శంకర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రాజస్థాన్ వాసి మరణించాడని దుబాయ్ పోలీసులు నిర్ధారించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనను హత్య కేసుగా నమోదు చేసిన అక్కడి పోలీసులు శంకర్‌ను ప్రధాన నిందితునిగా గుర్తించి అరెస్టు చేసి పుజీరా జైలులో పెట్టారు. కోర్టు విచారణలో రామావతార్ కుమావత్ మృతికి తను బాధ్యుణ్ణి కాదని, అతను ప్రమాదవశాత్తు మరణించాడని శంకర్ ఎంత మొరపెట్టుకున్నా దుబాయ్ కోర్టులో చెల్లలేదు. పోలీసుల విచారణ నివేదిక ప్రకారం శంకర్‌ను దోషిగా తేల్చిన కోర్టు 2013లో మరణశిక్షను ఖరారు చేసింది.

చదువులేకపోయినా...

ఈ ఘటన 2009లో చోటు చేసుకుంది. మాకూరి శంకర్‌కే కాదు అతని భార్యకు కూడా చదువు రాదు. ఎవరిని సంప్రదించాలో, తమకేవిధంగా న్యాయం జరుగుతుందో తెలియదు. పుజీరా జైలులో ఉన్న శంకర్‌కు తన భార్య భూదేవితో నెల రోజులకు ఒకసారి ఫోన్‌లో మాట్లాడేందుకు జైలు పోలీసులు అవకాశం కల్పించారు. ''అప్పుడు ఆయన నా గురించి, మా అబ్బాయి గురించి అడిగి ఏడ్చేవాడు. తాను బతికి బట్టకట్టాలంటే రాజస్థాన్ వాసి రామావతార్ కుమావత్ కుటుంబ సభ్యులు క్షమాభిక్షకు అంగీకరించాలని చెప్పాడు. ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ కుటుంబం అడ్రస్ తెలియదు. మా ఊళ్లో పెద్దలందరికీ ఈ విషయం చెప్పాను. కనపడినవారికల్లా మా కష్టం చెప్పాను. ఈ కష్టం పగవాడికి కూడా రాకూడదని ఏడ్వనిరోజు లేదు. రోజూ దిగులుగా ఉండేది. అలాగే నెలలు, ఏళ్లు గడిచిపోతున్నాయి.

కానీ, దిగులుగా కూర్చుంటే అయ్యే పనులు కావు. నేనూ, నా బిడ్డ బతకాలి. కూలి పనులు చేసుకుంటూ బిడ్డను పోషించుకుంటూ వచ్చాను. గతంలో ఆర్మూర్ మండలం దేగాం వాసులు ముగ్గురు దుబాయ్‌లో మరణశిక్ష నుంచి బయటపడి ఇంటికి చేరుకున్నారని తెలిసింది. ఇందుకు అదే గ్రామానికి చెందిన యాదాగౌడ్ కృషి చేశారని తెలిసింది. గంపెడాశతో వెళ్లి యాదాగౌడ్‌ను సంప్రదించి ఎలాగైనా నా భర్తను మరణశిక్ష నుంచి తప్పించాలని వేడుకున్నాను..' అని ఇన్నేళ్ల తన కష్టాన్ని వివరించింది భూదేవి.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి...

'మా ఆయనకు ఫోన్ చేసినప్పుడల్లా ఊళ్లో విషయాలు, నేను చేస్తున్న పనుల గురించి, మా అబ్బాయి క్షేమం గురించి చెబుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని చెబుతూ మరిన్ని వివరాలు అడిగి తెలుసుకునేదాన్ని. బాధిత కుటుంబాన్ని ఎలాగైనా ఒప్పించాలని కానీ, వాళ్లు ఎక్కడ ఉంటారో నాకు తెలియదని యాదాగౌడ్‌ను కలిసినప్పుడు చెప్పాను. అతను అన్ని వివరాలు కనుక్కొని, రాజస్థాన్ కుటుంబం గురించి తెలుసుకున్నాడు. వాళ్లకు ఆర్థికసాయం రూ.5 లక్షలు అందించాలంటే అందరినీ బతిమాలుకున్నాను. కూలీ చేసుకొని బతికేదాన్ని, నా దగ్గర అంత డబ్బు ఎక్కడుంటుంది. మా ఊరి వాళ్లు, ఇంకొంతమంది దయగలవాళ్లు తమకు తోచినంత ఇచ్చారు. అలా వచ్చిన డబ్బును రాజస్థాన్‌లోని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశాం. మృతుని కుటుంబ సభ్యులు క్షమాభిక్షకు అంగీకరించారు' అని తెలిపింది భూదేవి. అలా వారు సంతకాలు చేసిన పత్రాలను యాదాగౌడ్ ద్వారా న్యాయవాది అనురాధ సహకారంతో భూదేవి దుబాయ్‌లోని కోర్టుకు పంపించింది. దుబాయ్ కోర్టు ఈ పత్రాలను పరిశీలించి మరణశిక్షను రద్దు చేయడమేకాకుండా అతన్ని విడుదల చేస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీంతో మరణశిక్షను తప్పించుకున్న శంకర్ ఇంటికి చేరుకున్నాడు. కథ సుఖాంతమైంది.

– ఎస్.చంద్రశేఖర్, సాక్షి, మోర్తాడ్, నిజామాబాద్

మా వాళ్లను చూస్తానని అనుకోలేదు

నేను దుబాయ్‌కు వెళ్లే సమయంలో నా భార్య గర్భవతి. కొన్ని నెలలకే కొడుకు పుట్టాడు. ఈ సంతోష వార్త వినే సమయంలో నా భార్యకు చెప్పాను 'త్వరలోనే వస్తాను' అని. కానీ, అది సాధ్యం కాదని తర్వాత తెలిసింది. రాజస్థాన్ వ్యక్తి మరణించడంతో నేను ఈ ఘటనలో అరెస్టు అయ్యి జైలుపాలు కావడం, ఆ తరువాత మరణశిక్ష పడటం వరుసగా జరిగాయి. ఇక నా వాళ్లను చూస్తానని కలలో కూడా అనుకోలేదు. నా భార్యతో ఫోన్‌లో మాట్లాడిన ప్రతిసారీ నాకు ఎంతో ధైర్యం చెప్పేది. జైల్లో ఎంతో మనోవేదనతో ఉన్నా నా భార్య మాటలు నాకు జీవితంపై ఆశలు చిగురించేలా చేశాయి. నా విడుదల కోసం కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు.



– మాకూరి శంకర్

సాగుబడి
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 18 వరకు
శతభిష కార్తె : ఫిబ్రవరి 19 నుంచి

70 ఎకరాలు 30 పంటలు



● రంగప్రసాద్

ప్రకృతి వ్యవసాయదారుడిగా మారిన బ్యాంకింగ్ నిపుణుడు ఇమ్మనేని రంగప్రసాద్ తన పొలాన్ని ఉద్యాన పంటల జీవవైవిధ్య క్షేత్రంగా మార్చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం జూపల్లె గ్రామపరిసరాల్లో 70 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసి 'ఐఫార్మ్స్' పేరుతో అభివృద్ధి చేశారు. 30 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల చెట్లతో పాటు నాటుకోళ్లు, ఆవుల పెంపకం చేపట్టారు. పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతుల్లోనే సాగు చేస్తున్నారు. హైదరాబాద్ నగరానికి ఏడాది పొడవునా అమృతాహారాన్ని అందించడమే లక్ష్యమంటున్న రంగప్రసాద్ కృషిపై కథనం.

హైదరాబాద్‌కు చెందిన ఇమ్మనేని రంగప్రసాద్ బ్యాంకింగ్ నిపుణుడు. డా. కిరణ్మయి మైక్రోబయాలజిస్టు. ఈ దంపతులకు సేంద్రియ/ప్రకృతి సేద్యం అంటే మక్కువ. ఈ మక్కువతోనే హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో సమీకృత సేంద్రియ ఉద్యాన పంటల క్షేత్రానికి ఎంతో శ్రమించి రూపుకల్పన చేశారు. ఏడాది పొడవునా రసాయనిక అవశేషాల్లేని చాలా రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నాటు కోడిగుడ్లను నగరవాసులకు అందించాలని సంకల్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం జూపల్లె గ్రామపరిసరాల్లో 70 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసి 'ఐఫార్మ్స్' పేరుతో జీవవైవిధ్య ఉద్యాన క్షేత్రంగా అభివృద్ధి చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల కాలువను అనుకొని ఉండటంతో ఈ క్షేత్రానికి సాగు నీటి కొరత లేదు. తెలంగాణ గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నేత ఎమ్మెస్ సుబ్రహ్మణ్యం రాజు సూచనలు, సలహాలతో ఈ క్షేత్రం మెరుగైన ఉత్పాదకత సాధిస్తుండటం విశేషం.

ఒకసారి విత్తితే.. వరుసగా రెండు పంటలు!


ఆకుపచ్చ క్యాబేజీ, ఎరుపు బ్రోకలీ వంటి కొత్తరకం పంటలను ఐఫార్మ్స్‌లో పండిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. ఒకే మొక్కకు రెండు సార్లు దిగుబడి తీస్తున్నారు. ఒక పంట తీసుకున్న తర్వాత అదే మొక్క నుంచే 50 రోజుల్లో కార్శి(రటూన్ క్రాప్) పంట తీస్తున్నారు. గో ఆధారిత ప్రకృతి సేద్య నిపుణులు సుబ్రహ్మణ్యం రాజు పర్యవేక్షణలో ఈ ప్రయోగాత్మక సాగు జరుగుతోంది. ఆయన ఏమంటున్నారంటే.. మొదటి పంటగా క్యాబేజీ, బ్రోకలీ కోసిన తర్వాత మొక్కలను అలాగే ఉంచి, ఎప్పటిలాగే క్రమం తప్పకుండా నీరు ఇవ్వాలి. 2 వారాల్లో కొత్త పిలకలు వస్తాయి. పెద్దదాన్ని ఉంచి, మిగిలినవన్నీ తీసివేయండి. 400-500 గ్రాముల క్యాబేజీ, బ్రోకలీ కావాలంటే రెండు రెమ్మలు ఉంచండి. ప్రతి పది రోజులకు పంచగవ్య, ఫిష్ అమినో యాసిడ్, ఆవు మూత్రం పిచికారీ చేయడం ద్వారా పోషకాహారం ఇవ్వండి. పంట కాలంలో మూడు సార్లు పిచికారీ చేయాలి. రెండో పంట కోసం 40-50 రోజుల వరకు వేచి ఉండండి. ఈ కార్శి పంట వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రెండో పంటకు బెడ్ తయారీ అవసరం లేదు. అదనపు శ్రమ లేదు. తక్కువ కలుపు. తక్కువ వ్యవధి. కాబట్టి చాలా తక్కువ ఖర్చు. సీజన్‌లో కన్నా ధర ఎక్కువగా వస్తుంది.



● గ్రీన్ క్యాబేజీ



● ఎరుపు బ్రోకలీ



● గ్రీన్ అండ్ పర్పుల్ లెట్యూస్



● కుసుమలు అంతరపంట



● జామ తోటలో వేరుశెనగ అంతరపంట



● గ్రోబ్యాగ్స్‌లో సొర పాదులు

దేశ విదేశీ రకాలెన్నో...

అనేక రకాల నేలలు, ఎత్తుపల్లాలతో కూడిన ఈ పొలాన్ని అనేక విభాగాలుగా విభజించి, ఒక్కో విభాగంలో ఒక్కో రకం ప్రధాన పంటలను, వాటి మధ్య అనేక అంతర పంటలను సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడులు తీసుకునేందుకు వీలుగా వారానికోసారి ఆకుకూరలు, 15 రోజులకోసారి కూరగాయ మొక్కలు నాటుతూ (స్టాగర్డ్ ప్లాంటేషన్ చేస్తూ) ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తున్నారు.



● భారీ సైజు బ్రోకలి



● కసూరి మెంతికూర

క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాబేజి, కాలీఫ్లవర్ వంటి పంటలు 15 రోజులకోసారి విత్తుతున్నారు. కాకర, బీర, సొర, టమాటో, బెండ వంటి పంటలను నెలకోసారి విత్తుతున్నారు. ఐఫార్మ్స్‌లో ఆరుబయట ఎత్తు మడులపై పెరుగుతున్న కసూరి మేతి, ఎర్ర ముల్లంగి, దిల్, గ్రీన్ లెట్యూస్, రెడ్ లెట్యూస్, పర్పుల్ కార్న్, బేబీ కార్న్, మిక్స్‌డ్ కలర్ కార్న్.. వంటి విదేశీ జాతుల కూరగాయలు వినియోగదారులను, సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచే నల్ల కంది, సుగంధ పసుపు, మామిడి అల్లం వంటి పంటలు కూడా ఈ క్షేత్రంలో సాగవుతున్నాయి.

**అంతర పంటలు..
మొరంగడ్డ తీగతో మల్చింగ్...**

మామిడి, జామ, సీతాఫలం, బొప్పాయి తదితర పండ్ల మొక్కల మొదళ్లలో మొరంగడ్డ (చిలగడదుంప) తీగ ముక్కలను నాటడం ద్వారా కలుపును నివారించడమే కాకుండా సజీవ ఆచ్ఛాదన కల్పిస్తుండటం మరో విశేషం. తీగ ముక్క నాటిన ఆరు నెలల్లో చిలగడదుంపలను తవ్వి వినియోగదారులకు అందిస్తూ ఆదాయం కూడా పొందుతున్నారు.

పండ్ల తోటల్లో ఖరీఫ్‌లో, రబీలో కూడా అంతర పంటలను సాగు చేస్తున్నారు. సజీవ ఆచ్ఛాదన, కలుపు నివారణ, అదనపు ఆదాయం.. అంతర పంటల ద్వారా ఈ మూడు ప్రయోజనాలు సాధిస్తున్నారు. జామ తోటలో మొక్కల మధ్య చిలగడదుంప, సాళ్ల మధ్య వేరుశనగ వేశారు. వేరుశనగలతో వంట నూనె ఉత్పత్తి చేయడానికి ఎద్దు గానుగను ఏర్పాటు చేసుకుంటున్నామని రంగప్రసాద్ తెలిపారు. శాశ్వత పందిరికి దొండ తీగలు పాకించి.. పందిరి కింద సాళ్ల మధ్య ఖాళీలో వెల్లుల్లి, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. బొప్పాయి తోట మధ్యలో 9 రకాల తులసి రకాలను పెంచుతున్నారు. సీతాఫలంలో బాలానగర్, ఎన్ఎంకె గోల్డ్, రామాఫలం, లక్ష్మణఫలం రకాలు నాటారు. ఈ నాలుగూ ఒకేసారి కాపునకు రావు. ఒకటి పూర్తయ్యాక మరొకటి ఫలాలనిస్తాయి.

ఎటు చూసినా 10 అడుగుల దూరంలో మామిడి మొక్కలు నాటారు. మధ్యలో ఖరీఫ్‌లో కంది, రబీలో చిలగడదుంప సాగు చేస్తున్నారు. అందరూ ఎక్కువగా ఇష్టపడే బేనిషాన్, హిమాయత్ మొక్కలు పెట్టాం. ఎక్కడెక్కడి నుంచో అరుదైన రకాలను సైతం తెచ్చి అన్నీ కలిపి 70 రకాలను నాటామని రంగప్రసాద్ తెలిపారు. భవిష్యత్తులో అన్ని రకాల మామిడి పండ్లతో కూడిన బుట్టలను ప్రజలకు సరఫరా చేయనున్నట్లు సుబ్రమణ్య రాజు తెలిపారు.

నాటు కోళ్లు

సమీకృత సేద్యం ద్వారానే ఉత్తమ ఫలితాలు వస్తాయని రంగప్రసాద్ నమ్మిక. 35 దేశీ ఆవులతో కూడిన గోశాల ఈ క్షేత్రంలో ఉంది. సుమారు 400 నాటుకోళ్ల ఫారాన్ని నెలకొల్పారు. నాటు కోళ్లతో పాటు గిన్నెకోళ్లు, టర్కీ కోళ్లు, అసీల్ తదితర జాతుల కోళ్లు కూడా ఇక్కడ ఉన్నాయి. ఆరోగ్యదాయకన రీతిలో ఆరుబయట తిరుగుతూ పెరిగేలా కోళ్లకు ఏర్పాట్లు చేశారు. నాటు కోడి గుడ్లను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో పాటు అందించాలన్నదే రంగప్రసాద్ లక్ష్యం.

సంతృప్తికర ఉత్పాదకత

పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, జీవన ఎరువులు, జీవన పురుగుమందులను అవసరాన్ని బట్టి వాడుతున్నారు. తద్వారా పోషకలోపాలు లేకుండా, చీడపీడల బెడద లేకుండా.. సంతృప్తికరమైన రీతిలో పంటల ఉత్పాదకత సాధిస్తున్నట్లు సుబ్రహ్మణ్య రాజు(76598 55588) వివరించారు. హైదరాబాద్‌లోని ఆర్గానిక్ షాపులకు అందించడంతో పాటు ఎంపికచేసుకున్న గేటెడ్ కమ్యూనిటీలకు స్వయంగా తీసుకెళ్లి వారానికోసారి తమ సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు రంగప్రసాద్. సేంద్రియ ఆహారోత్పత్తులను నేరుగా పొలం నుంచి పొందగోరే గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల సంక్షేమ సంఘాలు ఉచితంగా తమ క్షేత్రాన్ని సందర్శించవచ్చని సమీకృత సేంద్రియ సాగుదారుడు రంగప్రసాద్(988 51 22544) ఆహ్వానిస్తున్నారు.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

మామిడిలో సస్యరక్షణకు హోమియో మందులు



మామిడి పూత, పిందె దశలో సస్యరక్షణకు హోమియో మందులు ఎంతగానో ఉపయోగపడతాయని యాదాద్రి భువనగిరి జిల్లా రామకృష్ణాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకులు, రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి చెబుతున్నారు. ఆయన మాటల్లోనే..
● మామిడి చెట్లకు పూత సరిగ్గా రావాలంటే ZINCUMET-30, MAGPHOS-30, BORAN / BORAX-30 మందులను వారం రోజుల వ్యవధిలో 3 సార్లు చొప్పున.. ఒకదాని వెంట మరొకటి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి. అట్లనే పూత బలంగా రావటం కోసం PULSATILLA-30ను కూడా పిచికారీ చేసుకోవాలి. ● దోమ నుంచి పూతను, పిందెను కాపాడుకోవడానికి COCCINELLA SEPTE - 30, PSORINUM-30 పిచికారీ చేసుకోవాలి. ● రేగు కాయల పరిమాణంలోకి వచ్చిన మామిడి కాయలు రాలిపోతుంటే BOVISTA -30 పొటెన్సీలో పిచికారీ చేసుకోవాలి. మంచు ఎక్కువగా పడుతుంటే పూత, పిందెను రక్షించుకోవడానికి CUPRUM SULPH-30 పిచికారీ చేసుకోవాలి. ● మంగుతో కాయ నల్లగా మారుతూ ఉంటే, ముద్దుపుచ్చు (ఆంత్రాక్నోస్)ను నివారించుకోవడానికి ALYSIC ACID-30, CARBOVEG-30 పిచికారీ చేసుకోవాలి. ● కొమ్మెండు తెగులు నుంచి రక్షించుకోవడానికి CUPRUM SULPH-30 పిచికారీ చేసుకోవాలి. ● పాత తోటల్లో మామిడి ఆకులపైన బుడిపెలు (మాల్ ఫార్మేషన్) వస్తే కొమ్మలను కత్తిరించి, దూరంగా తీసుకెళ్లి తగులబెట్టాలి. ఇది అంటు వ్యాధి. అరికట్టకపోతే దిగుబడిపై కూడా ప్రభావితం చూపిస్తుంది. TUJA-200ను వారంలో 3 సార్లు పిచికారీ చేసుకుంటే పోతుంది. ● కాయ పెరుగుదల మొదటి దశలో AMONIUMPHOS-30 పిచికారీ చేసుకోవచ్చు. తర్వాత కాయ పెరుగుతున్న దశలో SUPHALA-30ను పిచికారీ చేసుకోవచ్చు. ఇది అమేయ కృషి వికాస కేంద్రం రూపొందించిన మందు. బయట మందుల షాపులో దొరకదు. ట్రిబుల్19కు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. ● మామిడి రైతులకు మరో ముఖ్య సూచన ఏమిటంటే.. 15 రోజులకోసారి నీటి తడులతో పాటు ఎకరానికి 800 నుంచి 1,000 లీటర్ల వరకు గోకృపామృతం పారించుకుంటే.. కాయ పరిమాణం బాగుంటుంది, కాయ రాలకుండా ఉంటుంది. మరిన్ని వివరాలకు ఈ కింది వీడియో చూడొచ్చు.
www.youtube.com/@ameyakrishivikasakendram5143

మిల్లెట్స్ వాల్ క్యాలెండర్



2023ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల పునరుజ్జీవానికి కృషి చేస్తున్న బెంగళూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'సహజ సమృద్ధ' మిల్లెట్స్‌పై ఓ వాల్ క్యాలెండర్‌ను ప్రచురించింది. నాబార్డ్ సహాయంతో ఆర్.ఆర్.ఎ. నెట్‌వర్క్‌తో కలసి సహజ సమృద్ధ ఈ క్యాలెండర్‌ను ఆంగ్లం, తెలుగు, కన్నడ తదితర ప్రాంతీయ భాషల్లోనూ రూపొందించింది. ఈ క్యాలెండర్‌లో వర్షాధార వ్యవసాయ పరంగా చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు.. పౌష్టికాహార లోపాన్ని పారదోలే అద్భుత చిరుధాన్య వంటకాలను తయారు చేసుకునే పద్ధతులను, ప్రాసెసింగ్ యంత్రాల సమాచారాన్ని సైతం ఇందులో సచిత్రంగా వివరించారు. మిల్లెట్‌లను పునరుద్ధరించడంలో, సాంప్రదాయ మిల్లెట్ ఆహార వ్యవస్థను సజీవంగా ఉంచడంలో రైతులు, గిరిజనులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు నిర్వహిస్తున్న పాత్రను ఈ క్యాలెండర్ గుర్తు చేస్తుంది. ఈ 24 పేజీల క్యాలెండర్. క్యాలెండర్ ధర రూ.150 (కొరియర్ ఖర్చుతో సహా). ఇతర వివరాల కోసం... 99720 77998 నంబరుకు కాల్ చేయవచ్చు.

448 వేలం బరిలో నిలిచిన ప్లేయర్లు
87 అమ్ముడైన మొత్తం ప్లేయర్లు
57 భారత క్రికెటర్లు
30 విదేశీ క్రికెటర్లు
రూ.**12** కోట్లు ప్లేయర్ల కొనుగోలుకు ఒక్కో ఫ్రాంచైజీకి కేటాయించిన మొత్తం

రూ. **59** కోట్ల **50** లక్షలు ఐదు ఫ్రాంచైజీలు కలిసి వెచ్చించిన మొత్తం

రూ. **50** లక్షలు వేలం పూర్తయ్యాక మిగిలిన మొత్తం. ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ జట్లు రూ. 12 కోట్లు ఖర్చు చేశాయి. ఢిల్లీ క్యాపిటల్స్ వద్ద రూ. 35 లక్షలు... గుజరాత్ జెయింట్స్ వద్ద రూ. 5 లక్షలు... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వద్ద రూ. 10 లక్షలు మిగిలిపోయాయి.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా గిల్



గత నెలలో శ్రీలంక, న్యూజిలాండ్‌లతో జరిగిన ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల్లో ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలతో సహా మొత్తం 567 పరుగులు చేసిన భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. కాన్వే (న్యూజిలాండ్), సహచరుడు సిరాజ్‌లను వెనక్కి నెట్టి ఈ పురస్కారానికి ఎంపికయ్యాడు. గతంలో భారత్ నుంచి పంత్, అశ్విన్, భువనేశ్వర్, కోహ్లి, శ్రేయస్ అయ్యర్ ఈ అవార్డు గెల్చుకున్నారు.

స్మృతి సూపర్ హిట్

డబ్ల్యూపీఎల్ వేలంలో భారత వైస్ కెప్టెన్‌కు అత్యధిక మొత్తం

- రూ. **3** కోట్ల **40** లక్షలకు సొంతం చేసుకున్న బెంగళూరు
- ముగిసిన మహిళల లీగ్ వేలం
- ముంబైలో మార్చి 4 నుంచి 26 వరకు టోర్నీ



స్మృతి మంధాన

అద్భుతమైన ఆట... నాయకత్వ ప్రతిభ... మార్కెటింగ్‌కు అవకాశం ఉన్న ప్రచారకర్త... ఒక మహిళా క్రికెటర్‌లో ఈ మూడు లక్షణాలు ఉంటే ఆమె కోసం జట్లు పోటీ పడటం సహజమే... ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది. తొలి మహిళా ప్రీమియర్ లీగ్ వేలంలో అందరికంటే ఎక్కువ విలువతో భారత స్టార్ ప్లేయర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన శిఖరాన నిలిచింది. వేలంలో అందరికంటే ముందుగా ఆమె పేరు రాగా... ముంబై, బెంగళూరు స్మృతిని దక్కించుకునేందుకు హోరాహోరీగా పోటీ పడ్డాయి. చివరకు రూ. 3 కోట్ల 40 లక్షలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ స్టార్లు యాష్లే గార్డ్‌నర్, నటాలీ సివర్ రూ. 3 కోట్ల 20 లక్షలతో రెండో స్థానంలో నిలిచారు. ఆశ్చర్యకరంగా భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మాత్రం ఆశించిన విలువ దక్కలేదు. నాలుగు టీమ్‌లు హర్మన్ కోసం ప్రయత్నించినా...చివరకు రూ. 1 కోటి 80 లక్షల వద్దే హర్మన్ వేలం ముగిసింది. మొత్తంగా చూస్తే పురుషుల ఐపీఎల్ తరహాలో కొన్ని సంచలనాలు, కొంత ఆశ్చర్యం, మరికొంత అనూహ్యం కలగలిపి తొలి మహిళల లీగ్ వేలం సాగింది. అయితే డబ్బుల విలువ, అంకెలను పక్కన పెట్టి చూస్తే భారత మహిళల క్రికెట్‌లో కొత్త లీగ్, అందు కోసం సాగిన వేలం కొత్త ప్రస్థానానికి పునాది వేసింది.

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మొదటిసారి నిర్వహించబోతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మొదటి అంకమైన ప్లేయర్ల వేలం ఘనంగా ముగిసింది. మొత్తం 448 మంది వేలంలోకి రాగా... ఐదు జట్లలోకి కలిపి మొత్తం 87 మంది ఎంపికయ్యారు. నిబంధనల ప్రకారం గరిష్టంగా టీమ్‌కు 18 మంది చొప్పున మొత్తం 90 మందికి అవకాశం ఉన్నా.... యూపీ 16 మందికి, ముంబై 17 మందికే పరిమితమయ్యాయి. మిగిలిన మూడు జట్లు బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్ 18 మంది చొప్పున తీసుకున్నాయి. వేలంలో ఎక్కువ మొత్తం పలికిన టాప్-10 జాబితాలో భారత్ నుంచి స్మృతి మంధానతో పాటు దీప్తి శర్మ (రూ.2 కోట్ల 60 లక్షలు), జెమీమా రోడ్రిగ్స్ (రూ. 2 కోట్ల 20 లక్షలు), షఫాలీ వర్మ (రూ. 2 కోట్లు), పూజ వస్త్రకర్ (రూ.1 కోటి 90 లక్షలు), రిచా ఘోష్ (రూ. 1 కోటి 90 లక్షలు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ. 1 కోటి 80 లక్షలు) ఉన్నారు. సీనియర్ జట్టుకు ఆడిన షఫాలీ, రిచా కాకుండా ఇటీవల అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టు నుంచి ఆరుగురు అమ్మాయిలకు లీగ్‌లో అవకాశం దక్కింది. అయితే అండర్-19 ప్రపంచకప్‌లో రాణించిన హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిషను వేలంలో ఎవరూ తీసుకోలేదు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలోని రెండు వేదికల్లో డబ్ల్యూపీఎల్ నిర్వహిస్తారు. ఈ టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు జరుగుతాయి. మహిళల ప్రీమియర్ లీగ్ కావడంతో వేలం కార్యక్రమాన్ని కూడా మహిళనే నిర్వహించడం విశేషం. 2021లో ప్రొ కబడ్డీ లీగ్ వేలం కార్యక్రమం చేసిన మల్లిక సాగర్ డబ్ల్యూపీఎల్ వేలంను నిర్వహించింది.

వేలం విశేషాలు...

భారత జట్టు ఓపెనర్ స్మృతి మంధానకు భారీ విలువ పలకవచ్చనే అంచనా తప్పలేదు. ఇప్పటికే మహిళల బిగ్‌బాష్ లీగ్, 'హండ్రెడ్' లీగ్‌లలో ఆడి ఆమె సత్తా చాటింది. దాంతో సహజంగానే ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. భారీ షాట్లు ఆడగల రిచా ఘోష్‌పై కూడా జట్లు నమ్మకం ఉంచాయి. టీమిండియా టాప్ ప్లేయర్లలో దీప్తి శర్మ తన సొంత రాష్ట్రం జట్టు యూపీ తరఫున ఆడనుంది. ప్రస్తుతం టి20 క్రికెట్‌లో వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్ అయిన యాష్లే గార్డ్‌నర్‌పై కూడా టీమ్‌లు ఆసక్తి చూపించాయి. ఆసీస్ ఇతర అగ్రశ్రేణి ప్లేయర్లు అలీసా హీలీ, మెగ్ లానింగ్‌లకు కూడా మంచి విలువ దక్కింది. మహిళల టి20 క్రికెట్‌లో ఎంతో గుర్తింపు తెచ్చుకొని లీగ్ వేలంలో అమ్ముడు పోకుండా మిగిలిన అగ్రశ్రేణి ప్లేయర్లలో డానీ వ్యాట్, కేథరీన్ బ్రంట్, అమీ జోన్స్, అలానా కింగ్, సుజీ బేట్స్, చమరి అటపట్టు తదితరులు ఉన్నారు. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కోసం గుజరాత్ మినహా మిగతా నాలుగు జట్లూ పోటీ పడ్డాయి. అయితే చివరకు ఊహించిన మొత్తం మాత్రం ఆమెకు దక్కలేదు.

- అసోసియేట్ దేశాల నుంచి ఒకే ఒక ప్లేయర్ తారా నోరిస్ (అమెరికా) ఎంపికైంది. లెఫ్టార్మ్ పేసర్ అయిన తారా స్వస్థలం ఫిలడెల్ఫియా.
- యూఏఈకి చెందిన మనిక గౌర్ కోసం గుజరాత్ ఆసక్తి చూపించింది. అయితే వారి కోటా పూర్తి అయిందని తేలడంతో ఆ జట్టు వెనక్కి తగ్గాల్సి వచ్చింది.
- 16 ఏళ్ల ఆంధ్రప్రదేశ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్ ఈ వేలంలో ఎంపికైన అతి పిన్న వయస్కురాలు.

వేలంలో టాప్-10



యాష్లే గార్డ్‌నర్ రూ. 3 కోట్ల 20 లక్షలు



నటాలీ సివర్ రూ. 3 కోట్ల 20 లక్షలు



దీప్తి శర్మ రూ. 2 కోట్ల 60 లక్షలు



జెమీమా రోడ్రిగ్స్ రూ. 2 కోట్ల 20 లక్షలు



బెత్ మూనీ రూ. 2 కోట్లు



షఫాలీ వర్మ రూ. 2 కోట్లు



పూజ వస్త్రకర్ రూ. 1 కోటి 90 లక్షలు



రిచా ఘోష్ రూ. 1 కోటి 90 లక్షలు



సోఫీ ఎకిల్‌స్టోన్ రూ. 1 కోటి 80 లక్షలు



హర్మన్‌ప్రీత్ రూ. 1 కోటి 80 లక్షలు

యూపీ వారియర్స్

దీప్తి శర్మ	రూ.2.60 కోట్లు
సోఫీ ఎకిల్‌స్టోన్ ✈	రూ.1.80 కోట్లు
దేవిక వైద్య	రూ.1.40 కోట్లు
తాహ్లియా మెక్‌గ్రాత్ ✈	రూ.1.40 కోట్లు
షబ్నిమ్ ఇస్మాయిల్ ✈	రూ.1 కోటి
గ్రేస్ హారిస్ ✈	రూ.75 లక్షలు
అలీసా హీలీ ✈	రూ.70 లక్షలు
అంజలి శర్వాణి	రూ.55 లక్షలు
రాజేశ్వరి గైక్వాడ్	రూ.40 లక్షలు
శ్వేత సెహ్రావత్	రూ.40 లక్షలు
కిరణ్ నవ్‌గిరే	రూ.30 లక్షలు
లారెన్ బెల్ ✈	రూ.30 లక్షలు
లక్ష్మీ యాదవ్	రూ.10 లక్షలు
పార్శవి చోప్రా	రూ.10 లక్షలు
సొప్పదండి యశశ్రీ	రూ.10 లక్షలు
సిమ్రాన్ షేక్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 16	విదేశీ ప్లేయర్లు: 6

ఢిల్లీ క్యాపిటల్స్

జెమీమా రోడ్రిగ్స్	రూ.2.20 కోట్లు
షఫాలీ వర్మ	రూ.2 కోట్లు
మరిజన్ కాప్ ✈	రూ.1.50 కోట్లు
మెగ్ లానింగ్ ✈	రూ.1.10 కోట్లు
అలైస్ కాప్సీ ✈	రూ.75 లక్షలు
శిఖా పాండే	రూ.60 లక్షలు
జెస్ జొనసెన్ ✈	రూ.50 లక్షలు
లౌరా హారిస్ ✈	రూ.45 లక్షలు
రాధా యాదవ్	రూ.40 లక్షలు
అరుంధతీ రెడ్డి	రూ.30 లక్షలు
మిన్ను మణి	రూ.30 లక్షలు
పూనమ్ యాదవ్	రూ.30 లక్షలు
స్నేహ దీప్తి	రూ.30 లక్షలు
తానియా భాటియా	రూ.30 లక్షలు
టిటాస్ సాధు	రూ.25 లక్షలు
జాసియా అక్తర్	రూ.20 లక్షలు
అపర్ణ మోండల్	రూ.10 లక్షలు
తారా నోరిస్ ✈	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6

తెలుగు అమ్మాయిలు ఆరుగురు...



అంజలి శర్వాణి లెఫ్టార్మ్ పేస్ బౌలర్. కర్నూల్ జిల్లా ఆదోని స్వస్థలం. భారత్ తరఫున 6 టి20లు మ్యాచ్‌లు ఆడింది.



సబ్బినేని మేఘన బ్యాటర్, స్వస్థలం విజయవాడ. భారత్ తరఫున 3 వన్డేలు, 17 టి20 మ్యాచ్‌లు ఆడింది.

వి. స్నేహ దీప్తి బ్యాటర్. స్వస్థలం విశాఖపట్నం. భారత్ తరఫున 1 వన్డే, 2 టి20లు ఆడింది.



షబ్నమ్ రైట్ ఆర్మ్ పేస్ బౌలర్. స్వస్థలం విశాఖపట్నం. ఇటీవల అండర్-19 ప్రపంచకప్‌లో ఆడింది.



అరుంధతి రెడ్డి రైట్ ఆర్మ్ పేస్ బౌలర్. స్వస్థలం హైదరాబాద్. భారత్ తరఫున 26 టి20లు ఆడింది.



ఎస్. యశశ్రీ పేస్ బౌలర్. హైదరాబాద్ స్వస్థలం. ఇటీవల అండర్-19 ప్రపంచ కప్‌లో ఆడింది.

గుజరాత్ జెయింట్స్

యాష్లే గార్డ్‌నర్ ✈	రూ.3.20 కోట్లు
బెత్ మూనీ ✈	రూ.2 కోట్లు
జార్జియా వేర్‌హామ్ ✈	రూ.75 లక్షలు
స్నేహ్ రాణా	రూ.75 లక్షలు
అనాబెల్ సదర్లాండ్ ✈	రూ.70 లక్షలు
డియాండ్ర డాటిన్ ✈	రూ.60 లక్షలు
సోఫియా డన్‌క్లే ✈	రూ.60 లక్షలు
సుష్మా వర్మ	రూ.60 లక్షలు
తనూజ కన్వర్	రూ.50 లక్షలు
హర్లీన్ డియోల్	రూ.40 లక్షలు
అశ్వని కుమారి	రూ.35 లక్షలు
హేమలత	రూ.30 లక్షలు
మాన్సి జోషి	రూ.30 లక్షలు
మోనిక పటేల్	రూ.30 లక్షలు
సబ్బినేని మేఘన	రూ.30 లక్షలు
హర్లీ గాల	రూ.10 లక్షలు
పరుణిక సిసోడియా	రూ.10 లక్షలు
షబ్నమ్ షకీల్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6

ముంబై ఇండియన్స్

నటాలీ సివర్ ✈	రూ.3.20 కోట్లు
పూజ వస్త్రకర్	రూ.1.90 కోట్లు
హర్మన్‌ప్రీత్ కౌర్	రూ.1.80 కోట్లు
యస్తిక భాటియా	రూ.1.50 కోట్లు
అమేలియా కెర్ ✈	రూ.1 కోటి
అమన్‌జోత్ కౌర్	రూ.50 లక్షలు
హేలీ మాథ్యూస్ ✈	రూ.40 లక్షలు
క్లోయ్ ట్రియాన్ ✈	రూ.30 లక్షలు
హిదెర్ గ్రాహమ్ ✈	రూ.30 లక్షలు
ఇసాబెలె వోంగ్ ✈	రూ.30 లక్షలు
ప్రియాంక బాల	రూ.20 లక్షలు
ధార గుజ్జర్	రూ.10 లక్షలు
హుమైరా కాజి	రూ.10 లక్షలు
జింతిమని కలిత	రూ.10 లక్షలు
నీలమ్ బిష్త్	రూ.10 లక్షలు
సయిక ఇషాక్	రూ.10 లక్షలు
సోనమ్ యాదవ్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 17	విదేశీ ప్లేయర్లు: 6

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

స్మృతి మంధాన	రూ.3.40 కోట్లు
రిచా ఘోష్	రూ.1.90 కోట్లు
ఎలీస్ పెర్రీ ✈	రూ.1.70 కోట్లు
రేణుక సింగ్	రూ.1.50 కోట్లు
సోఫీ డివైన్ ✈	రూ.50 లక్షలు
హీతెర్ నైట్ ✈	రూ.40 లక్షలు
మేగన్ షట్ ✈	రూ.40 లక్షలు
కనిక అహుజ	రూ.35 లక్షలు
డేన్‌వాన్ నికెర్క్ ✈	రూ.30 లక్షలు
ఎరిన్ బర్న్స్ ✈	రూ.30 లక్షలు
ప్రీతి బోస్	రూ.30 లక్షలు
కోమల్ జంజద్	రూ.25 లక్షలు
ఆశ శోభన	రూ.10 లక్షలు
దిశ కాసత్	రూ.10 లక్షలు
ఇంద్రాణి రాయ్	రూ.10 లక్షలు
పూనమ్ ఖేమ్నర్	రూ.10 లక్షలు
సహన పవార్	రూ.10 లక్షలు
శ్రేయాంక పాటిల్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6 ✈

'అమ్మ' నుంచి మళ్లీ ఆటకు..

స్నేహ దీప్తికి డబ్ల్యూపీఎల్ అవకాశం



భర్త మద్దిరాల ఫిలిప్, పాప క్రివాలతో స్నేహ దీప్తి

16 ఏళ్ల 204 రోజులు... 2013 ఏప్రిల్‌లో స్నేహ దీప్తి అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ టి20ల్లో ఆడిన భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. ఆ తర్వాత మరో టి20 మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఆమె అదే నెలలో తన ఏకైక వన్డే కూడా ఆడింది. అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు ఆమె దూరమైంది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత స్నేహ దీప్తికి అరుదైన రీతిలో తొలి డబ్ల్యూపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను రూ. 30 లక్షలకు సొంతం చేసుకుంది. సాధారణంగా దశాబ్ద కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరం అంటే కెరీర్ ముగిసినట్లే. కానీ దీప్తి 26 ఏళ్ల వయసులో మళ్లీ సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఇన్నేళ్ల పాటు ఆటకు దూరం కాకుండా 'అమ్మ'గా మారిన తర్వాత కూడా క్రికెట్‌లో ఆమె కొనసాగిన తీరు స్ఫూర్తిదాయకం. దూకుడైన బ్యాటింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న స్నేహ ఆంధ్ర జట్టు తరఫున నిలకడైన ప్రదర్శనతో చిన్న వయసులోనే భారత జట్టులో అవకాశం దక్కించుకుంది. దేశవాళీలో దక్షిణ మధ్య రైల్వే తరఫున చక్కటి ఇన్నింగ్స్‌లతో ఆమె గుర్తింపు తెచ్చుకుంది. ఫిబ్రవరి 2021లో ఆమెకు పాప పుట్టింది. ఈ సమయంలోనే ఆటకు విరామమిచ్చి స్నేహ సెప్టెంబర్‌లోనే మళ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగు పెట్టింది. అప్పటి నుంచి క్రికెట్‌ను కొనసాగిస్తూ ఇప్పుడు డబ్ల్యూపీఎల్‌తో మళ్లీ అందరి దృష్టిని ఆకర్షించడం విశేషం.

– సాక్షి క్రీడా విభాగం

రన్నరప్ హంపి



మ్యూనిక్ (జర్మనీ): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో జరిగిన మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ రెండో టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రన్నరప్‌గా నిలిచింది. సోమవారం ముగిసిన ఈ టోర్నీలో హంపి 7 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. తాన్ జోంగి (చైనా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌ను హంపి 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి అజేయంగా నిలిచింది. ఎనిమిది గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హంపి మూడు గేముల్లో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 6 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. 11వ రౌండ్‌లో నానా జాగ్‌నిడ్జెతో జరిగిన గేమ్‌ను హారిక 11 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. హారిక కూడా ఈ టోర్నీలో ఒక్క గేమ్‌లోనూ ఓడిపోలేదు. 10 గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక ఒక గేమ్‌లో గెలిచింది. 7.5 పాయింట్లతో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా) విజేతగా అవతరించింది. చివరి గేమ్‌లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ 64 ఎత్తుల్లో జినెర్ జు (చైనా) చేతిలో ఓడిపోయింది. నాలుగు గ్రాండ్‌ప్రి సిరీస్‌లలో భాగంగా మూడో టోర్నీ వచ్చే నెలలో భారత్‌లో జరుగుతుంది.

ధర్మశాల టెస్టు ఇండోర్‌లో...

ఖరారు చేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ: అనుకున్నట్లే జరిగింది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య వచ్చే నెల 1 నుంచి 5 వరకు ధర్మశాల వేదికగా జరగాల్సిన మూడో టెస్టు వేదికను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మార్చింది. ఈ మ్యాచ్‌కు ఆతిథ్య వేదికగా ఇండోర్‌ను ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ)కు చెందిన స్టేడియంలో నవీకరణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మైదానాన్ని మార్చారు. బీచ్ ఉన్న వైజాగ్ నగరంతో పాటు బెంగళూరులను ప్రత్యామ్నాయ వేదికలుగా బోర్డు పరిశీలించినప్పటికీ చివరకు ఇండోర్‌ను ఖాయం చేసింది. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టును ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో నిర్వహిస్తాం' అని బోర్డు కార్యదర్శి జై షా ప్రకటించారు. శీతాకాల పరిస్థితులు, స్టేడియంలోని అసంపూర్తి పనుల వల్లే వేదికను మార్చినట్లు ఆయన వివరించారు. నాలుగు టెస్టుల సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉంది.

ప్రేమకథా చిత్రమ్

'ప్రేమకథ'లు చూడ్డానికి బాగుంటాయి. గాఢమైన 'ప్రేమ కథలు' అయితే మనసులో నిలిచిపోతాయి. దుష్యంతుడు, శకుంతలది అలాంటి ప్రేమకథే. కొన్నేళ్ల పాటు దూరంగా ఉన్నా వీరి ప్రేమ బలమైనది కాబట్టే నిలబడింది. ఈ ప్రేమ కథని త్వరలో వెండితెరపై చూడనున్నాం. మరికొన్ని ప్రేమకథలు కూడా రానున్నాయి. ఒక్కో 'ప్రేమకథా చిత్రమ్'ది ఒక్కో కథ. ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆ ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.



● సమంత, దేవ్ మోహన్



● విజయ్ దేవరకొండ, సమంత

ప్రేమకావ్యాల్లో 'అభిజ్ఞాన శాకుంతలం'ది ప్రత్యేకమైన స్థానం. కాళిదాసు రచించిన ఈ ప్రేమకథ ఆధారంగా ఆల్రెడీ కొన్ని సినిమాలు వచ్చాయి. తాజాగా దర్శకుడు గుణశేఖర్ 'శాకుంతలం' సినిమా తీశారు. ఇందులో దుష్యంతుడిగా దేవ్ మోహన్, శకుంతలగా సమంత నటించారు. దుష్యంత మహారాజు, శకుంతల ప్రేమ చుట్టూ ఈ సినిమా సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు ఓ కొత్త ప్రేమకథతో ఖుషీగా రానున్నారు విజయ్ దేవరకొండ-సమంత. ఈ ఇద్దరూ జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఖుషి'. 'ఒక రొమాంటిక్ ప్రేమ కావ్యం నిర్మాణంలో ఉంది' అని విజయ్, 'కుటుంబమంతా చూసి మంచి అనుభూతికి గురయ్యే సినిమా' అని సమంత 'ఖుషి' అప్‌డేట్ అప్పుడు పేర్కొన్నారు. సమంత అనారోగ్యం కారణంగా ఈ సినిమా షూటింగ్‌కి చిన్న బ్రేక్ పడింది. ఏది ఏమైనా ఈ ఏడాదే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటోంది యూనిట్. మరోవైపు హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో 2018లో వచ్చిన లవ్‌స్టోరీ 'గీత గోవిందం' సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కాగా విజయ్, పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇది లవ్‌స్టోరీ ఫిల్మ్ అని, 'గీత గోవిందం'కు సీక్వెల్ అనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇదే నిజమైతే విజయ్ వెంట వెంటనే ప్రేమకథా చిత్రాల్లో నటించినట్లు అవుతుంది. ఇక అబ్బాయి, అమ్మాయి స్నేహం ప్రేమగా మారిన ఎన్నో కథలు వెండితెరపైకి వచ్చాయి. ప్రేక్షకుల మనసులను మెప్పించాయి. ఈ కోవలో రానున్న మరో చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. అబ్బాయి సంజయ్ పీసపాటి, అమ్మాయి అనుపమ కస్తూరిల ప్రేమ కథ ఇది. సంజయ్ పాత్రలో నాగశౌర్య, అనుపమ పాత్రలో మాళవికా నాయర్ నటించారు. ఫ్రెండ్‌షిప్, లవ్, బ్రేకప్ అంశాల మేళవింపుతో దర్శకుడు అవసరాల శ్రీనివాస్ ఈ సినిమాను తెరకెక్కించారు. మార్చి 17న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇంకోవైపు 'మొదటి ప్రేమకు మరణం లేదు. మనసు పొరల్లో శాశ్వతంగా సమాధి చేయబడి ఉంటుంది' అంటున్నారు ఆనంద్ దేవరకొండ. సాయి రాజేష్ దర్శకత్వంలో ఆనంద్ హీరోగా, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. ఫస్ట్ లవ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. ఇక శ్రీదేవి ఎక్కడుంటే శోభన్‌బాబు అక్కడే ఉంటాడట. ఎందుకంటే ప్రేమంట. సంతోష్ శోభన్, గౌరి జి కిషన్ హీరో హీరోయిన్లుగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో రూపొందిన లవ్‌స్టోరీ 'శ్రీదేవి శోభన్‌బాబు'. ఇందులో శోభన్‌బాబుగా సంతోష్ శోభన్, శ్రీదేవిగా గౌరి కనిపిస్తారు. ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఇంకోవైపు 'ఎస్ఆర్ కళ్యాణ మండపం'తో ఫేమ్ సంపాదించుకున్న హీరో కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'వినరో భాగ్యము విష్ణుకథ'. ఫోన్ నంబర్ నైబర్‌హుడ్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ ప్రేమకథా చిత్రంలో కశ్మీర హీరోయిన్‌గా నటించగా, కిశోర్ డైరెక్టర్ చేశారు. ఈ చిత్రం కూడా ఈ నెల 18న రిలీజ్ కానుంది.

ఇవి కాక మరికొన్ని ప్రేమకథా చిత్రాలు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాయి.

సినిమా



● నాగశౌర్య, మాళవికా నాయర్



● కిరణ్, కశ్మీర



● ఆనంద్, వైష్ణవి చైతన్య



● సంతోష్, గౌరి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	251	60,432
నిఫ్టీ ▽	86	17,771

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్డాక్	11,885	▲	167
డోజోన్స్	34,180	▲	310
ఎఫ్టీఎస్ఈ 100	7,948	▲	65
డాక్స్	15,397	▲	89
షాంఘై	3,284	▲	24
నికాయ్	27,427	▽	244

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	57,060
బంగారం (22 క్యారెట్)	56,832
వెండి (కిలో)	66,371

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	86.73	89.93
€	యూరో	ఒక్కటి	98.08	101.37
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	61.70	63.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	56.05	58.46
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	61.13	63.12
SAR	సౌదీ రియాల్	ఒక్కటి	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఒక్కటి	21.62	23.42
¥	చైనా యువాన్	ఒక్కటి	11.00	13.07

అంతా బాగానే ఉంది..

ఇన్వెస్టర్లకు అదానీ గ్రూప్ భరోసా



న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బతో కంపెనీల షేర్ల పతనం ఇంకా కొనసాగుతూనే ఉండటంతో ఇన్వెస్టర్లకు భరోసా కల్పించేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నాలు చేస్తోంది. తమ వ్యాపార ప్రణాళికలకు అవసరమైన నిధులు పుష్కలంగా ఉన్నాయని తెలిపింది. వాటాదారులకు మంచి రాబడులే అందించగలమంటూ ధీమా వ్యక్తం చేసింది. వృద్ధి లక్ష్యాలు, పెట్టుబడులను కుదించుకుంటున్నట్లు వస్తున్న వార్తలను గ్రూప్ అధికార ప్రతినిధి ఖండించారు. ప్రస్తుత మార్కెట్ కుదుటపడిన తర్వాత గ్రూప్‌లోని ప్రతీ సంస్థ తన వ్యూహాల సమీక్ష చేపడుతుందని చెప్పారు.

సీయూబీ లాభం అప్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ సంస్థ సిటీ యూనియన్ బ్యాంక్(సీయూబీ) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 11 శాతం బలపడి రూ. 218 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 1,195 కోట్ల నుంచి రూ. 1,430 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 13 శాతం పుంజుకుని రూ. 556 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 40 శాతం జంప్‌చేసి రూ. 224 కోట్లను అధిగమించింది.

వారాంతాన ఫలితాలు ప్రకటించిన సీయూబీ షేరు ఎన్ఎస్ఈలో 15 శాతంపైగా పతనమై రూ. 136 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-2-2023	
విశాఖ	440–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	411–00
విజయవాడ	411–00
రిటైల్ ధర (డజను)	66.00
13-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	383–00
వరంగల్	385–00
రిటైల్ ధర	4.45

భారత్‌లో రెనో–నిస్సాన్ రూ. 5,300 కోట్ల పెట్టుబడులు



చెన్నై: ఆటోమొబైల్ దిగ్గజాలు రెనో–నిస్సాన్ భారత్‌లో సుమారు 600 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,300 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నాయి. రెండు చిన్న ఎలక్ట్రిక్ కార్లతో పాటు ఆరు కొత్త వాహనాలను ఆవిష్కరించనున్నాయి. అలాగే చెన్నైలోని తమ ప్లాంటును కూడా అప్‌గ్రేడ్ చేయనున్నాయి. నిస్సాన్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అశ్వనీ గుప్తా ఈ విషయాలు తెలిపారు. రెనో ఇండియా కంట్రీ సీఈవో వెంకట్రామ్ మామిళ్లపల్లి, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలోని నోడల్ ఏజెన్సీ గైడెన్స్ బ్యూరో ఎండీ విష్ణు వేణుగోపాల్, గుప్తా ఇచ్చిపుచ్చుకున్నారు. రెనో–నిస్సాన్ అనేది ఫ్రాన్స్‌కి చెందిన రెనో, జపాన్‌కి చెందిన నిస్సాన్ కంపెనీల జాయింట్ వెంచర్. కొత్తగా వచ్చే వాహనాల్లో నాలుగు ఎస్‌యూవీలు ఉంటాయి. వీటిలో మొదటిది 2025 నాటికి మార్కెట్లోకి రానుందని గుప్తా చెప్పారు. దేశీయంగా ప్రవేశపెట్టే ఆరు వాహనాల్లో నిస్సాన్, రెనోవి చెరో మూడు వాహనాలు ఉంటాయి. తాజా పెట్టుబడులతో కొత్తగా 2,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని గుప్తా ఈ సందర్భంగా వివరించారు.

పునర్‌వ్యవస్థీకరణ..

జాయింట్ వెంచర్లో సమాన వాటాదార్లుగా ఉండేలా రెండు సంస్థలు భారత్‌లో తమ తయారీ, ఆర్‌అండ్‌డీ విభాగాల్లో పెట్టుబడుల స్వరూపంలో మార్పులు, చేర్పులు చేస్తున్నాయి. దీని ప్రకారం జేవీలో నిస్సాన్ వాటా 70 శాతం నుంచి 51 శాతానికి తగ్గనుండగా రెనో వాటా 30 శాతం నుంచి 49 శాతానికి పెరుగుతుంది. తమ చెన్నై తయారీ కేంద్రాన్ని 2045 నాటికల్లా పూర్తిగా పునరుత్పాదక విద్యుత్‌తో నడిచేలా తీర్చిదిద్దనున్నట్లు గుప్తా వివరించారు. భారత మార్కెట్‌కు రెనో, నిస్సాన్ కట్టుబడి ఉన్నాయని నిస్సాన్ రీజియన్ చైర్‌పర్సన్ (ఆఫ్రికా తదితర ప్రాంతాలు) గిలోమ్ తెలిపారు.

కొనసాగిన నష్టాలు

ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు అప్రమత్తత

సెన్సెక్స్ నష్టం 251 పాయింట్లు • 17,800 దిగువకు నిఫ్టీ



ముంబై: కీలక ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు అప్రమత్తత చోటు చేసుకోవడంతో స్టాక్ మార్కెట్ సోమవారమూ నష్టపోయింది. అదానీ గ్రూప్ షేర్లలో భారీ అమ్మకాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ సంకేతాలతో ఉదయం సూచీలు స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 496 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 251 పాయింట్లు నష్టపోయి 60,432 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 161 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి 86 పాయింట్లు పతనమైన 17,771 వద్ద నిలిచింది. సూచీలకిది ఇది రెండోరోజు నష్టాల ముగింపు. అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అధికంగా విక్రయాలు జరిగాయి. విస్తృత స్థాయి మార్కెట్లో నెలకొన్న అమ్మకాలతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.25% నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా రెండోరోజూ కొనుగోళ్లు చేపట్టారు. మొత్తం రూ.1,322 షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.522 షేర్లను కొన్నారు. రూపాయి విలువ 15 పైసలు క్షీణించి 82.73 వద్ద స్థిరపడింది. సూచీలు అరశాతం పతనంతో రూ.2.51 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. యూఎస్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. "బాండ్లపై దిగుమతులు, డాలర్ ఇండెక్స్ పెరగడంతో మార్కెట్లో విస్తృతంగా అమ్మకాలు జరిగాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ నాలుగు అదానీ కంపెనీ షేర్లపై రేటింగ్ ఔట్‌లుక్‌ను 'స్టేబుల్' నుండి 'నెగటివ్'కి తగ్గించడంతో ఈ గ్రూప్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.
- ఫార్మా కంపెనీ లుపిన్ షేరు ఎనిమిదిశాతానికి పైగా నష్టపోయి రూ.675 వద్ద స్థిరపడింది. క్యూ3 గణాంకాలు నిరాశపరచడం, బ్రోకరేజీలు డౌన్‌గ్రేడ్ చేయడం దీనికి నేపథ్యం.
- నష్టాల మార్కెట్‌లోనూ ఆయిల్ ఇండియా షేరు ర్యాలీ చేసింది. బీఎస్ఈలో తొమ్మిదిశాతం బలపడి తొమ్మిది నెలల గరిష్టం రూ.243 వద్ద ముగిసింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు అమ్మకాల సెగ

జనవరిలో రూ.199 కోట్లు ఉపసంహరణ



న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్) నుంచి జనవరిలో రూ.199 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి నికరంగా పెట్టుబడులు వెళ్లిపోవడం వరుసగా ఇది మూడో నెల కావడం గమనించాలి. ఇన్వెస్టర్లు ఈ తరుణంలో బంగారం కంటే కూడా ఈక్విటీలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 2022 డిసెంబర్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.273 కోట్లు, నవంబర్‌లో రూ.195 కోట్లు చొప్పున పెట్టుబడులు బయటకు వెళ్లాయి. 2022 అక్టోబర్‌లో రూ.147 కోట్ల పెట్టుబడులను గోల్డ్ ఈటీఎఫ్ పథకాలు ఆకర్షించాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఈక్విటీ ఫండ్స్‌కు ఆదరణ పెరగడం బంగారం ఈటీఎఫ్‌లు వెనుకబడడానికి కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. కాగా, బంగారం ఈటీఎఫ్ నిర్వహణ ఆస్తుల విలువ మాత్రం రూ.21,836 కోట్లకు వృద్ధి చెందింది. 2022 డిసెంబర్ నాటికి ఇది రూ.21,455 కోట్లు. గోల్డ్ ఈటీఎఫ్ ఫోలియోల సంఖ్య 35,680 పెరిగి 46.74 లక్షలకు చేరింది.

మళ్లీ రిటైల్ ధర'దడ..'

జనవరిలో ద్రవ్యోల్బణం 6.52 శాతం స్పీడ్ • మూడు నెలల గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ పంజా విసిరింది. ధరల స్పీడ్ జనవరిలో మూడు నెలల గరిష్ట స్థాయి 6.52 శాతంగా (2022 ఇదే నెలతో పోల్చి ధరల తీరు) నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్నదాని ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువన ఉండాలి. అయితే 10 నెలలు ఆపైన కొనసాగిన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్, డిసెంబర్ నెలల్లో కట్టడిలోకి (ఆరు శాతం దిగువకు) వచ్చింది. ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధానాలకు ముఖ్యంగా రెపోపై నిర్ణయానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక అయిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు), మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఈ నెల మొదట్లో వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగినట్లయ్యింది. జాతీయ గణాంకాల కార్యాలయం తాజా లెక్కల ప్రకారం ఫుడ్ బాస్కెట్ ధర జనవరిలో 5.94 శాతం ఎగసింది. డిసెంబర్‌లో ఈ పెరుగుదల రేటు 4.19 శాతం. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 6.85 శాతం అయితే, పట్టణ ప్రాంతాల్లో ఈ రేటు 6 శాతంగా ఉంది.



2022–23లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటును 6.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ తాజా పాలసీ సమీక్షలో అంచనావేయగా, జనవరి–డిసెంబర్ మధ్య 5.7 శాతంగా ఉంటుందని విశ్లేషించింది.

ఐఏఐసీసీ హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు

చైర్మన్‌గా సురేష్ చిట్టూరి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండియన్ అమెరికన్ ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏఐసీసీ) తాజాగా హైదరాబాద్ చాప్టర్ ప్రారంభించింది. శ్రీనివాసా ఫామ్స్ వీసీ, ఎండీ సురేష్ రాయుడు చిట్టూరి దీనికి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇరు దేశాల్లో వ్యాపార అవకాశాలను తెలుగు రాష్ట్రాలు, అమెరికాలోని చిన్న సంస్థలు అందిపుచ్చుకునేందుకు కావాల్సిన తోడ్పాటును ఐఏఐసీసీ అందిస్తుందని సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో సురేష్ తెలిపారు.ప్రస్తుతం భారత్‌లో ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో ఐఏఐసీసీ చాప్టర్లు ఉన్నాయి. తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఐసీసీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ కుమార్, సీఐఐ తెలంగాణ చైర్మన్ వాగీశ్ దీక్షిత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆడి క్యూ3 స్పోర్ట్‌బ్యాక్



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ కంపెనీ ఆడి.. భారత్‌లో స్పోర్టీ కాంపాక్ట్ క్రాస్ఓవర్ క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆల్ వీల్ డ్రైవ్ కారు ధర ఎక్స్‌షోరూంలో రూ.51.43 లక్షలు. 190 హెచ్‌పీ పవర్‌తో 2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌ను పొందుపరిచారు. 7.3 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. లగ్జరీ కార్ల రంగంలో ఈ బాడీ స్టైల్‌తో మోడల్‌ను ప్రవేశపెట్టడం తొలిసారి అని కంపెనీ తెలిపింది. 2022లో ఆడి ఇండియా 4,187 కార్లను దేశీయంగా విక్రయించింది. 2021తో పోలిస్తే 27.14 శాతం వృద్ధి అని ఆడి ఇండియా హెడ్ బల్‌బీర్ సింగ్ తెలిపారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 500 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

ముంబైలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 500
» పోస్టుల వివరాలు: జనరల్ బ్యాంకింగ్ స్ట్రీమ్‌లో క్రెడిట్ ఆఫీసర్ (జీబీవో)–350, ఐటీ ఆఫీసర్ ఇన్ స్పెషలిస్ట్ స్ట్రీమ్(ఎస్‌పీఎల్)–150.
» అర్హత: క్రెడిట్ ఆఫీసర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ,ఐటీ ఆఫీసర్ పోస్టులకు బీఈ, బీటెక్/పీజీ(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్–టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.02.2023 నాటికి 20 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. » వేతనం: నెలకు రూ.36,000 నుంచి రూ.63,480 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, బృంద చర్చలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పరీక్షా విధానం: మొత్తం 225 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ పేపర్–లెటర్ రైటింగ్–ఎస్సే అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» తెలంగాణ రాష్ట్రంలో పరీక్షా కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.02.2023.
» వెబ్‌సైట్: www.bankofindia.co.in

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో వివిధ ఉద్యోగాలు

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» పోస్టుల వివరాలు: ఫార్మసిస్ట్ గ్రేడ్2–01, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–01, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ–01.
» అర్హత: పదో తరగతి, డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.17,500(ఎంఎన్‌వో ఖాళీలకు రూ.12,000).
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, జిల్లా జైలు, గుంటూరు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 16.02.2023.
» వెబ్‌సైట్: guntur.ap.gov.in

డీఎంహెచ్‌వో, మెదక్ జిల్లాలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

మెదక్‌లోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేద/యునాని/హోమియోపతి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీఎన్‌వైఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. » వేతనం: నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: డిగ్రీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, మెదక్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.02.2023.
» వెబ్‌సైట్: medak.telangana.gov.in

ఆతిథ్య రంగంలో.. అందుకో అవకాశాలు!

ఇంజనీరింగ్, మెడిసిన్‌కు భిన్నంగా వినూత్న అవకాశాలు కోరుకునే వారికి సరైన మార్గం.. హోటల్ మేనేజ్‌మెంట్! బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటే.. విస్తృత అవకాశాలు ఖాయం! ఇందుకు ఎన్‌టీఏ నిర్వహించే.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్.. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ)–2023 లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీహెచ్ఎం జేఈఈ వివరాలు, పరీక్ష విధానం, కోర్సులు అందించే ఇన్‌స్టిట్యూట్స్, ఎంట్రన్స్‌లో విజయానికి నిపుణుల సలహాలు..

- » ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ–2023 నోటిఫికేషన్ విడుదల
- » బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశానికి మార్గం
- » ఎన్‌సీహెచ్ఎం జేఈఈ స్కోర్‌తో పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం
- » ఇంటర్మీడియెట్ అర్హతతో పోటీ పడే అవకాశం
- » బీఎస్సీ సర్టిఫికెట్‌తో ఫ్యూచర్ బెస్ట్ ఆపర్చునిటీస్

వృద్ధి బాటలో పయనిస్తూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగాల్లో కీలకంగా నిలుస్తోంది.. హోటల్ మేనేజ్‌మెంట్ విభాగం. కాబట్టి బ్యాచిలర్ స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తు అవకాశాలకు ఢోకా లేదు అంటున్నారు నిపుణులు.

బ్యాచిలర్ టు పీజీ

హోటల్ మేనేజ్‌మెంట్‌లో రాణించేందుకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో.. కేంద్ర పర్యాటక శాఖ.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ విభాగాన్ని నెలకొల్పింది. దీని పరిధిలో జాతీయ స్థాయిలో ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో బ్యాచిలర్ స్థాయి నుంచి పీజీ, ఇతర స్పెషలైజేషన్లలో హోటల్ మేనేజ్‌మెంట్ సంబంధిత కోర్సులు అందిస్తున్నారు. బ్యాచిలర్ స్థాయిలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రవేశానికి జరిపే పరీక్ష.. ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా ఆయా క్యాంపస్‌లలో ప్రవేశం ఖరారు చేస్తారు.

75 ఇన్‌స్టిట్యూట్‌లు.. 11,965 సీట్లు

- ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలో 75 ఇన్‌స్టిట్యూట్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్‌హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 21 ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లతో పాటు ఆయా రాష్ట్రాల పరిధిలో 28 ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయి.
- అదే విధంగా 25 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, ఒక పబ్లిక్ సెక్టార్ యూనిట్ అనుబంధ కాలేజ్ ఉన్నాయి. వీటిలో మొత్తం11,965 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఏపీలో ఎస్ఐహెచ్ఎం–తిరుపతి(60 సీట్లు), తెలంగాణలో ఐహెచ్ఎం–హైదరాబాద్(285 సీట్లు), డాక్టర్ వైఎస్సార్ ఎన్ఐటీహెచ్ఎం(120 సీట్లు), ఐహెచ్ఎం శ్రీశక్తి కాలేజ్(120 సీట్లు), ఎస్ఐహెచ్ఎం–మెదక్(60 సీట్లు) క్యాంపస్‌లలో ఈ కోర్సు ఉంది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదు.

ఐదు విభాగాలు–200 ప్రశ్నలు

- ఎన్‌సీహెచ్ఎం–జేఈఈని జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో.. 200 ప్రశ్నలకు నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ 30 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 60 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ 50 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు.
- పరీక్ష ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- మెరిట్ జాబితాను రూపొందించే క్రమంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో అత్యధిక మార్కులు పొందిన వారిని ముందుగా పరిగణనలోకి తీసుకుంటారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌తో సీట్ల భర్తీ

ఎన్‌సీహెచ్ఎం–జేఈఈలో స్కోర్ ఆధారంగా.. ఉమ్మడి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానం ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుని తమ ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలతో ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్లు, విద్యార్థులు పొందిన స్కోర్‌ను గణించి సీట్ల కేటాయింపు చేస్తారు.

నాలుగో ఏడాది చదివే అవకాశం

ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ, బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు విషయంలో ఈ ఏడాది ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం.. మూడేళ్ల కోర్సు పూర్తయ్యాక ఆసక్తి ఉన్న అభ్యర్థులు మరో ఏడాది చదివే అవకాశం కల్పించడం. నూతన విద్యా విధానం ప్రకారం–తొలిసారి ఈ ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీంతో.. మూడేళ్ల బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తయ్యాక నాలుగో ఏడాది కూడా చదివితే ఆనర్స్ డిగ్రీ అందిస్తారు.

ఉపాధి అవకాశాలు విస్తృతం

హాస్పిటాలిటీ బీఎస్సీ పూర్తి చేసుకున్న వారికి టూరిజం హాస్పిటాలిటీ సెక్టార్లలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్; ఫ్రంట్ డెస్క్ మేనేజర్; క్రూయిజ్ మేనేజర్; కిచెన్ ఎగ్జిక్యూటివ్; మార్కెటింగ్ మేనేజర్; సర్వీస్ ఎగ్జిక్యూటివ్; అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్; ట్రిప్ అడ్వైజర్; బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్; చెఫ్స్ వంటి పలు ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ బీఎస్సీ కోర్సులో ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ ఆధారంగా.. ఆయా విభాగాల్లో ఎంట్రీ లెవల్‌లో కొలువులు దక్కుతున్నాయి. ప్రారంభంలో సగటున రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకూ వేతనం అందుతోంది.



ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ–2023

ఎంట్రెన్స్‌లో విజయం ఇలా

- న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్: అభ్యర్థికి మ్యాథమెటిక్స్‌లో ఉన్న బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందుకోసం హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా శాతాలు, లాభ– నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం–పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం–వేగం–దూరం, నిష్పత్తులు, జామెట్రీ వాటిపై పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ విషయంలో.. నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం, డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి.. ఇచ్చిన ప్రశ్నకు అనువుగా, సమాధానం ఇచ్చే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. ఇందుకోసం గ్రాఫ్‌లు, పైచార్ట్‌లు, ఫ్లోచార్ట్‌లు వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్: ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్స్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా డేటా సఫిషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.
- జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్: హైస్కూల్ స్థాయిలోని పుస్తకాల్లో ఉండే చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీలో ముఖ్యమైన యుద్ధాలు–పరిణామాలు–పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు–అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, ఇటీవల కాలంలో అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్: కీలకమైన ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌ను ఔపోసన పట్టాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీనికోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయడంతోపాటు న్యూస్ పేపర్లను చదవడం, వాటిలోని కొత్త పదాలను తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన ఏర్పరచుకోవడం వంటివి లాభిస్తాయి. పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విభాగంలో పేర్కొన్న సిలబస్‌లో అధిక శాతం సిలబస్‌ను పూర్తి చేసుకోవచ్చు.
- ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్..స్పెషల్ సెక్షన్: ఎన్‌సీహెచ్ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగాన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న ఆసక్తి,దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు,సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ–2023.. ముఖ్యాంశాలు


- దేశ వ్యాప్తంగా 21 ఐహెచ్ఎంలు, 28 ఎస్ఐహెచ్ఎంలు, 25 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్స్, 1 పీఎస్‌యూ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం.
- ఈ ఏడాది నుంచి ఆనర్స్ డిగ్రీ విధానం ప్రారంభం.
- మూడేళ్ల కోర్సు తర్వాత మరో ఏడాది చదివితే ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్.
- కోర్సు పూర్తి చేసుకుంటే ప్రముఖ హోటల్స్, హాస్పిటాలిటీ, టూరిజం విభాగాల్లో కొలువులు.
- ప్రారంభంలోనే సగటున రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వార్షిక వేతనం

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 27, 2023
- ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ పరీక్ష తేదీ:మే14, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in

క్లుప్తంగా...

మహాశివరాత్రికి 2,427 ప్రత్యేక బస్సులు



సాక్షి, హైదరాబాద్: మహాశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళికలను రూపొందించింది. ఈనెల 18న 2,427 బస్సులను నడపాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 40 శైవక్షేత్రాలకు 17వ తేదీ నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఈ బస్సులను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీశైలానికి 578 బస్సులు, వేములవాడకు 481, కీసరగుట్టకు 239, ఏడుపాయలకు 497, వేలాలకు 108, కాళేశ్వరానికి 51, కొమురవెల్లికి 52, కొండగట్టుకు 37, ఆలంపూర్‌కు 16, రామప్పకు 15, ఉమామహేశ్వరానికి మరో 14 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్, తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వరకు ఈ ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. వీటికి ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు యూజీ ఆయుష్ వెబ్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: యూజీ ఆయుష్ వైద్య విద్య సీట్ల భర్తీకి మంగళవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ యూనివర్సిటీ ప్రకటించింది. ఇప్పటికే మూడో విడత కౌన్సెలింగ్ పూర్తి అయిందని, మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www. knruhs.telangana.-gov.inను సందర్శించాలని సూచించింది.

ఇంటర్ బోర్డ్‌లో జేడీపై వేటు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డ్‌లో ప్రక్షాళన పర్వం వేగం పుంజుకుంది. ఆరోపణలు, ప్రైవేటు కాలేజీలతో ఆర్థిక సంబంధాలున్న అధికారులను కీలక బాధ్యతల నుంచి తప్పిస్తున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలు దగ్గర కొస్తున్న నేపథ్యంలో ఈసారి ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా కీలకమైన బాధ్యతల్లో ఉన్న ప్రాంతీయ సంచాలకులుగా ఉన్న రాణిని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలను మరో జేడీ జయప్రదాబాయికి అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇంటర్ బోర్డ్ వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం అవినీతి ఆరోపణలకు పాల్పడినట్టు ఫిర్యాదు అందడంతోనే ఆమెను బాధ్యతల నుంచి తప్పించినట్టు తెలిసింది. నల్లగొండ జిల్లాకు చెందిన జూనియర్ లెక్చరర్స్‌పై ఇటీవల కొన్ని ఫిర్యాదులొచ్చాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారి నుంచి డబ్బులు ఆశించినట్టు జేడీపై ఫిర్యాదు రావడంతో, దీనిపై మిత్తల్ విచారణ జరిపినట్టు తెలిసింది. ఇవి నిజమని తేలడంతో బాధ్యతల నుంచి తప్పించారని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

బదిలీలకు 6,982 దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు గడువు మంగళవారంతో ముగుస్తోంది. కోర్టు ఆదేశంతో 317 జీవో ద్వారా బదిలీ అయిన టీచర్లకూ బదిలీ అవకాశం కల్పించారు. దీంతో ఇప్పటి వరకు 6,982 దరఖాస్తులు అందినట్లు పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన తెలిపారు. ఈనెల 12 నుంచి మొదలైన దరఖాస్తుల ప్రక్రియ క్రమంగా ఊపందుకుంది. చివరి రోజు ఎక్కువ దరఖాస్తులు వచ్చే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 317 ద్వారా బదిలీ అవ్వని టీచర్ల నుంచి ఇప్పటికే 59 వేల దరఖాస్తులు అందాయి.

అవివాహిత ఆర్టిజన్ల తమ్ముడు, చెల్లెళ్లకు కారుణ్య నియామకాలు

ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న అవివాహిత ఆర్టిజన్లు మరణిస్తే వారి తమ్ముడు లేదా చెల్లికి కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశం కల్పించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు ఈనెల 8న ఉత్తర్వులు జారీచేశారు. అంటే, అవివాహిత ఆర్టిజన్ల కంటే వయసులో పెద్ద వారైన అన్నలు, అక్కలకు మాత్రం కారుణ్య నియామకం కింద అర్హత ఉండదు.

కొత్తగా మూడు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 3,239 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ముగ్గురు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.

ఆకాశంలో నడక.. రోడ్డు మీద పడవ!

మారిపోతున్న భవనాల రూపురేఖలు

- కనువిందు చేస్తున్న స్కై విల్లాలు, విల్లామెంట్లు.. ఎన్నో.. మరెన్నో..
- యువ బిల్డర్ల వినూత్న ఆలోచనలు..అబ్బుర పరిచే కట్టడాలు
- ప్రజల అభిరుచులకు అనుగుణంగా అంతర్జాతీయ ఆర్కిటెక్ట్‌లతో డిజైనింగ్
- హైదరాబాద్ నగర అందాన్ని పెంచుతున్న ఐకానిక్ ప్రాజెక్ట్‌లు





సాక్షి, హైదరాబాద్: 'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు..' అన్నాడు.. ఎప్పుడో ఓ సినీకవి. ఇప్పుడు కూడా మన యువ బిల్డర్లు వినూత్న ఆలోచనలతో, అబ్బుర పరిచే కట్టడాలను నిర్మిస్తూ కనులకు విందు చేస్తున్నారు.

- హైదరాబాద్ మెహదీపట్నం నుంచి రాయదుర్గం వెళ్తుంటే.. ఆకాశంలో అటు ఇటూ నడిచేందుకు వీలుగా నిర్మించిన ఓ ఆకాశ హర్మ్యం కనిపిస్తుంది. అంటే మూడు టవర్లను కలుపుతూ స్కై ఐల్యాండ్‌ను నిర్మిస్తోంది ఓ నిర్మాణ సంస్థ. చుట్టూ పచ్చదనం మధ్య ఆకాశంలో కూర్చుని నగరాన్ని చూసేయొచ్చన్న మాట.
- అప్పా జంక్షన్ నుంచి కిస్మత్‌పూర్ వెళుతుంటే అకస్మాత్తుగా రోడ్డు పక్కన ఓ భారీ పడవ దర్శనమిస్తుంది. ఇదేంటబ్బా అని ఒక్క క్షణం ఆగి చూస్తే..అదో భారీ నివాస సముదాయం.

ఇవే కాదు మరెన్నో స్కై విల్లాలు, విల్లామెంట్లు రకరకాల పేర్లతో వినూత్న శైలిలో కొలువుదీరుతున్నాయి. నాలుగు గోడలు, పైకప్పు వంటి సాధారణ గృహాలకు కాలం చెల్లింది. ఐకానిక్ టవర్లు ఆకట్టుకునే ఎలివేషన్లతో నగరవాసుల్ని కట్టిపడేస్తున్నాయి. వినూత్న శైలి భవనాలను నగరవాసులు కోరుకుంటుండటంతో.. వారి అభిరుచికి తగ్గట్టుగానే యువ డెవలపర్లు నిర్మాణాలను చేపడుతున్నారు. ఆయా ప్రాంతాలకు ల్యాండ్ మార్క్‌ల్లా నిలిచిపోయేలా ప్రాజెక్టులకు రూపుదిద్దుతున్నారు.

విదేశీ ఆర్కిటెక్ట్‌లతో..

భారీ భవన నిర్మాణాలను కళాత్మకంగా తీర్చిదిద్దేందుకు యువ బిల్డర్లు పెద్ద కసరత్తే చేస్తున్నారు. స్థానిక బిల్డర్లతో పాటు ఇతర రాష్ట్రాల బిల్డర్లు కూడా నగరంలో ప్రాజెక్ట్‌లను చేపడుతుండటంతో ఎలివేషన్ల ఎంపికలో ఆరోగ్యకరమైన పోటీ నెలకొంది. ప్రపంచ స్థాయి డిజైన్ల కోసం సింగపూర్, చైనా, జపాన్, దుబాయ్ వంటి దేశాలలో పర్యటించి, క్షేత్ర స్థాయిలో అక్కడి భవన నిర్మాణాలు పరిశీలించడంతో పాటు వాటిని తీర్చిదిద్దిన ఆర్కిటెక్ట్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వారితో హైదరాబాద్‌లోని భవనాలకు డిజైన్లు చేయిస్తున్నారు.

ఏ ప్రాంతాల్లో వస్తున్నాయంటే..

వినూత్న డిజైన్లతో కూడిన భవన నిర్మాణలు ఎక్కువగా పశ్చిమ హైదరాబాద్‌లో వస్తున్నాయి. కోకాపేట, మంచిరేవుల, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, నల్లగండ్ల, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మణికొండ, తెల్లాపూర్, పుప్పాలగూడ, రాయదుర్గంతో పాటు కొంపల్లి, ఆదిభట్ల వంటి ప్రాంతాలలో ఈ తరహా ప్రాజెక్ట్‌లు ఎక్కువగా వస్తున్నాయి. నగరంలోని పలు ప్రముఖ నిర్మాణ సంస్థలు ఈ ఐకానిక్ ప్రాజెక్ట్‌లను చేపడుతున్నాయి.

ధర 5–10 శాతం ఎక్కువ..

గత 3–4 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యల నిర్మాణం జోరందుకుంది. 40 కంటే ఎత్తయిన హైరైజ్ భవనాలు చేపట్టేందుకు బిల్డర్లు పోటీ పడుతున్నారు. నేటి అవసరాలకు, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా గ్రీనరీ, వాస్తుకు ప్రాధాన్యం ఇస్తూ ఎలివేషన్లను ఎంపిక చేస్తున్నారు. సాధారణ అపార్ట్‌మెంట్లతో పోలిస్తే ఐకానిక్ ప్రాజెక్ట్‌లలో ధర కొంచం ఎక్కువగా ఉంటుంది. ఆయా నిర్మాణాలకు నైపుణ్యం ఉన్న కూలీలు, భారీ యంత్రాలు, సాంకేతికత అవసరం. ఇందుకోసం బిల్డర్లు పెద్ద మొత్తంలోనే ఖర్చు చేస్తారు. అంతర్జాతీయ ఆర్కిటెక్ట్ చార్జీలు ఉంటాయి. అందుకే ఈ తరహా ప్రాజెక్ట్‌ల్లో ధర 5–10 శాతం ఎక్కువగా ఉంటుంది.

ఆఫీసు భవనాలు కూడా..

వాస్తవానికి నివాస సముదాయాల కంటే ఆఫీసు భవనాలను వినూత్న శైలిలో నిర్మించేందుకు బిల్డర్లు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే నివాసాలకు వాస్తు పక్కాగా పాటించాల్సిందే. అదే ఆఫీసు బిల్డింగ్‌లకు కొంత వెసులుబాటు ఉంటుంది. టాటా, మైక్రోసాఫ్ట్, డెలాయిట్ వంటి ఇతర దేశీ, విదేశీ సంస్థలు వినూత్న శైలి నిర్మాణాలనే కోరుకుంటాయి. ఐకియా, టీ–హబ్, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ భవనాలు ఆఫీసు విభాగంలో యూనిక్ బిల్డింగ్స్ కోవలోకే వస్తాయి. త్వరలోనే పశ్చిమ హైదరాబాద్‌లో ఓ నిర్మాణ సంస్థ వృత్తం, పెంటాగాన్ ఆకారంలో కార్యాలయ నిర్మాణాలు చేపట్టనుంది.



కొత్తదనం కోరుకుంటున్నారు

ఆభరణాలు, దుస్తులు, సంగీతం ప్రతి దాంట్లో కొత్తదనాన్ని కోరుకున్నట్లే ఇప్పుడు చాలామంది ఇంటి నిర్మాణ శైలిలోనూ కొత్తదనం కోరుకుంటున్నారు. డబ్బా ఆకారంలో ఇళ్లను ఇష్టపడటం లేదు. చూడటానికి వినూత్నంగా ఆ ప్రాంతానికే ల్యాండ్‌మార్క్‌లా నిలిచే ప్రాజెక్ట్‌లను కోరుకుంటున్నారు.
– జి.రామ్‌మోహన్, చీఫ్ ఆర్కిటెక్ట్, మోహన్ కన్సల్టెంట్స్

2023 హజ్ షెడ్యూల్ విడుదల

- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించిన హోంమంత్రి మహమూద్ అలీ
- మార్చి 10వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

సాక్షి హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఏటా హజ్ యాత్రికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, హజ్ క్యాంప్ ఏర్పాట్లలో రాష్ట్ర హజ్ కమిటీ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం నాంపల్లిలోని హజ్ కమిటీ కార్యాలయంలో 2023 హజ్ యాత్ర దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మహమూద్ అలీ.. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీంతో కలసి ప్రారంభించారు. రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా 2023 హజ్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది నుంచి కేంద్ర హజ్ కమిటీ.. యాత్రికుల సౌకర్యార్థం దరఖాస్తు స్వీకరణతో పాటు అన్ని ప్రక్రియలను కూడా ఆన్‌లైన్ చేసిందన్నారు. సోమవారం ఆన్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ మార్చి 10వ వరకు ఉంటుందన్నారు. యాత్రికుల పాస్‌పోర్టు గడువు డిసెంబర్ 31 2023 వరకు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని డ్రా పద్ధతిలో హజ్ యాత్రకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 040 23298793 నంబర్ లేదా కేంద్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

అర్వింద్‌కుమార్‌తో రూర్కీ ఐఐటీ విద్యార్థుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రూర్కీ ఐఐటీలో అర్బన్ అండ్ రూరల్ ప్లానింగ్‌పై మాస్టర్ డిగ్రీ చేస్తున్న విద్యార్థుల బృందం సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌తో భేటీ అయ్యింది.ఐఐటీ రూర్కీ అసోసియేట్ ప్రొఫెసర్ అరిందమ్ బిశ్వాస్ నేతృత్వంలోని ఈ బృందం మెట్రోపాలిటన్ ప్లానింగ్ స్టూడియో కోసం హైదరాబాద్ వచ్చింది. ఈ సందర్భంగా అర్వింద్‌కుమార్‌ను కలిసిన విద్యార్థుల బృందానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ చేపట్టిన ప్రధాన అభివృద్ధి, విధాన నిర్ణయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) నుంచి వచ్చిన అర్బన్ ప్లానర్లు తమ సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, సాధించిన ఫలితాల గురించి విద్యార్థులతో పంచుకున్నారు.

రేపు కొండగట్టుకు సీఎం

భక్తుల రద్దీ దృష్ట్యా నేటి పర్యటన ఒక రోజు వాయిదా

- యాదాద్రి తరహాలో అభివృద్ధికి అంజన్న ఆలయం పరిశీలన
- అక్కడే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం
- ఆలయ అభివృద్ధి నమూనాల తయారీ బాధ్యత ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయికి! సీఎం వెంట ఆయన కూడా వెళ్లే చాన్స్
- ఆలయానికి గత వారమే రూ.100 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్/కొండగట్టు (చొప్పదండి): ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్నారు. దేవస్థానాన్ని రూ. 100 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక అభివద్ధి నిధి కింద గత వారమే ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. ఈ నిధులతో ఆలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న అంశంపై ప్రత్యక్షంగా దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.ముందుగా నిర్ణయించిన ప్రకారం మంగళవారం ఆయన ఆలయ సందర్శనకు వెళ్లాల్సి ఉన్నా ఆ రోజు భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి వస్తారని... తన పర్యటన వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో సీఎం ఆలయ సందర్శనను ఒకరోజు వాయిదా వేసుకున్నట్లు సమాచారం. యాదాద్రి ఆలయ అభివృద్ధి తరహాలోనే కొండగట్టును అభివృద్ధి చేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. యాదాద్రి దేవస్థాన పునర్నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌గా వ్యవహరించిన ఆనంద్‌సాయికి ఈ దేవాలయ అభివృద్ధి నమూనాల రూపకల్పన, వాటి అమలును పర్యవేక్షించే బాధ్యత అప్పగించనున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వెంట ఆనందసాయి కూడా వెళ్లనున్నట్లు తెలిసింది. దేవాలయంలో భక్తులకు వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై సీఎం దృష్టిసారించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జగిత్యాల జిల్లాకు చెందిన మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ సోమవారం కొండగట్టును సందర్శించారు. సీఎం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో 14న సాయంత్రం 4 గంటల నుంచి 15న మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

విజయనగర్ కాలనీ: పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని 8 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడంతో పాటు 16 లక్షల కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు అంజి, నీల వెంకటేశ్, రామకృష్ణ నాయకత్వంలో మాసాబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌ను వేలాది మంది విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ముట్టడిలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ ఆరేళ్ల కిందటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు ఇప్పటికీ కొనసాగిస్తున్నారని, ఇటీవల పెరిగిన నిత్యావసర ధరల నూనెలు, పప్పులు, కూరగాయలు తదితర ఆహార వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగాయని తెలిపారు. హోటల్‌లో ఒక్క పూట భోజనం కనీసం రూ.60 ఉందని, హాస్టల్ విద్యార్థులకు పూటకు రూ.10 ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. జైల్‌లో ఖైదీలకు నెలకు రూ.2,100 ఇస్తూ, హాస్టల్ విద్యార్థులకు రూ.950 ఇవ్వడంలో ఏమైనా న్యాయం ఉందా? అని ప్రశ్నించారు. 2013 వరకు కోర్సు ఫీజులు మంజూరు చేశారని, 2014 నుంచి ప్రభుత్వం పూర్తి ఫీజు స్కీమ్‌కు పరిమితులు విధిస్తూ ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.35 వేలు మాత్రమే ఇస్తోందన్నారు. కార్యక్రమంలో తిరుపతి, అనిల్, అనంతయ్యలతో పాటు వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.



మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

దేశంలోనే నం.1 'ఐఎస్‌బీ'

- గ్లోబల్‌లో 39వ ర్యాంకు
- ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్–2023లో ఉన్నత స్థానం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)కి అరుదైన గౌరవం లభించింది. ఫైనాన్షియల్ టైమ్స్(ఎఫ్‌టి) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్–2023ని సోమవారం ప్రకటించారు. ఇందులో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ) ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ భారతదేశంలోనే నెంబర్ వన్ స్థానం లభించగా ప్రపంచస్థాయిలో 39వ ర్యాంకు సాధించింది. పరిశోధనా విభాగంలో కూడా ఐఎస్‌బీ అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 61వస్థానం పొందింది. పరిశోధన, మహిళలు, కెరీర్ పురోగతి, జీతం పెరుగుదల, పూర్వ విద్యార్థుల నెట్ వర్క్ వంటి అంశాల్లో ఐఎస్‌బీ పనితీరు మెరుగ్గా ఉందని ఈ ర్యాంకింగ్స్ ద్వారా మరోసారి స్పష్టమైంది. అదేవిధంగా ఐఎస్‌బీ ప్రపంచవ్యాప్తంగా టాప్–50లో ఉన్న ఏకైక భారతీయ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపును మరోసారి చాటుకుంది. ప్రపంచంలో 39వ స్థానం పొందగా ఆసియా ఖండంలో ఆరవ స్థానం సాధించింది. 2019 పీజీపీ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు చేసిన సర్వేలో కూడా అత్యున్నత ప్రమాణాలు సాధించింది. జీతం పెరుగుదల (2), పూర్వ విద్యార్థులు నెట్‌వర్క్(12), కెరీర్ పురోగతి(28), కెరీర్ సర్వీసెస్(29) వంటి అంశాలలో ఐఎస్‌బీ బాగా పనిచేస్తోందని ఈ సర్వేలో తేలింది. ఎఫ్‌టీ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్‌లో భారతదేశంలోనే అగ్రశ్రేణి బిజినెస్ స్కూల్‌గా ఐఎస్‌బీ స్థిరమైన ర్యాంకింగ్ సాధించిందని ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ రామచంద్రన్‌తిరుమలై పేర్కొన్నారు.

శ్రీశైలం 'హైడల్' పునరుద్ధరణ !

ఎట్టకేలకు 4వ యూనిట్‌కూ మరమ్మతులు పూర్తి

- కేరళ నుంచి వచ్చిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్
- అందుబాటులోకి 900 మెగావాట్ల సామర్థ్యం
- ఇంకా సర్జ్ పూల్‌లోనే మునిగి ఉన్న గేటు
- బయటకు తీసేందుకు జంకుతున్న సిబ్బంది
- దీంతో ఇప్పట్లో 4వ యూనిట్‌లో ఉత్పత్తి లేనట్టే
- రెండున్నరేళ్లు గడిచినా కొలిక్కి రాని విచారణలు



సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల కిందట ప్రమాదంలో కాలిపోయిన శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం పునరుద్ధరణ ఎట్టకేలకు సంపూర్ణమైంది. 4వ యూనిట్‌కు సైతం తాజాగా మరమ్మతులు పూర్తయ్యాయి. అయితే ఈ యూనిట్‌కి సంబంధించిన సర్జ్‌పూల్‌లో పడిపోయిన భారీ గేటు.. ఇంకా బయటకు తీయకపోవడంతో విద్యుదుత్పత్తి ప్రారంభించేందుకు అడ్డంకిగా మారింది. గేటును బయటకు తీసిన తర్వాతే 4వ యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభించేందుకు వీలుంది. మరమ్మతులకు రూ.60 కోట్లకు పైగా వ్యయమైందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.

ఎట్టకేలకు కేరళ నుంచి వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్ !

900(6 X150) మెగావాట్ల శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొత్తం 6 యూనిట్లుండగా, 2020 ఆగస్టు 20న జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అన్ని యూనిట్లు కాలిపోయాయి. అందులో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఇతర సిబ్బందితో సహా మొత్తం 9 మంది ఈ ప్రమాదానికి బలయ్యారు. 1, 2 వ యూనిట్లకు అదే ఏడాది మరమ్మతులు జరిపి వినియోగంలో తీసుకురాగా..3, 5, 6వ యూనిట్లను తర్వాతి కాలంలో వినియోగంలోకి తెచ్చారు. నాలుగో యూనిట్‌కి సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోగా, అప్పటికప్పుడు అలాంటి ట్రాన్స్‌ఫార్మర్ మార్కెట్‌లో ఎక్కడా దొరకని పరిస్థితి నెలకొంది. శ్రీశైలం విద్యుత్ కేంద్రం నిర్మాణం సమయంలో ..ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్ కేరళ లిమిటెడ్ (టెల్క్) తయారు చేసిన 190 ఎంవీఏ సామర్థ్యం కలిగిన 3 లింబ్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగించారు. నాటి ట్రాన్స్‌ఫార్మర్ల డిజైన్, నమూనాలను పంపించి అలాంటిదే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తయారీ కోసం టెల్క్‌కి జెన్‌కో ఆర్డర్ పెట్టింది. భారీగా ఆర్డర్లు పెండింగ్‌లో ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ తయారీకి టెల్క్ రెండేళ్లకు పైగా సమయం తీసుకుంది. ఎట్టకేలకు ఇటీవల కేరళ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ రావడంతో 4వ యూనిట్‌కు మరమ్మతులు సైతం పూర్తయినట్టు జెన్‌కో వర్గాలు తెలిపాయి.

కొలిక్కి రాని విచారణలు

శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి రెండున్నరేళ్లు గడుస్తున్నా సీఐడీ విచారణ ఇంకా కొలిక్కి రాలేదు. దక్షిణ డిస్కం సీఎండీ నేతృత్వంలోని టెక్నికల్ కమిటీ సైతం విచారణ నివేదికను సమర్పించలేదని సమాచారం. ఓ వైపు విద్యుదుత్పత్తి కొనసాగిస్తూ.. మరో వైపు విద్యుదుత్పత్తిని నియంత్రించే ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టంలోని ప్యానెల్ బోర్డులో బ్యాటరీలను మార్చే పనులను సమాంతరంగా చేపట్టడంతోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి ఈ ఘోర ప్రమాదం జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసి ఉంటే ప్యానెల్‌బోర్డు వద్దే మంటలను నియంత్రించే అవకాశం ఉండేదని నిపుణులు అంటున్నారు. అవగాహన లేక ఇంజనీర్లు, సిబ్బంది అగ్నిమాపక పరికరంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఉత్పత్తి నిలుపుదల చేసినా, గ్రిడ్ నుంచి సమీపంలోని సబ్‌స్టేషన్ ద్వారా శ్రీశైలం విద్యుత్ కేంద్రానికి రివర్స్ విద్యుత్ సరఫరా జరిగింది. మంటలు ప్యానెల్ బోర్డు నుంచి సమీపంలోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యాపించాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ కాలిపోవడంతో సొరంగం తరహాలో ఉండే విద్యుత్ కేంద్రం అంతటా వేగంగా బూడిదతో కూడిన పొగ వ్యాపించింది. దీంతో సిబ్బంది ఊపిరాడక మృత్యువాతపడ్డారు. ప్రమాదం జరిగిన 15 నిమిషాల్లోగా ఉత్పత్తి నిలుపుదల చేసి, బయటి సబ్ స్టేషన్ నుంచి రివర్స్ సప్లై లేకుండా చేస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరిగేది కాదని జెన్‌కో సీనియర్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

గేటు తీయాలంటే భయం !

శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం 4వ యూనిట్ సర్జ్ పూల్ బయటి మార్గం నుంచి 75 మీటర్లు లోపలికి వెళ్లి నీళ్లలో మునిగి ఉన్న భారీ గేటును బయటికి తీసే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో ఈ పని చేసేందుకు ఎవరూ సాహసించడం లేదని జెన్‌కో వర్గాలు తెలిపాయి. ప్రమాదకర రీతిలో కాకుండా సురక్షితమైన పద్ధతిలో ఈ గేటును బయటకు తీయాలనే ఆలోచనతో ఈ పనిని పెండింగ్‌లో పెట్టారు. జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసిన తర్వాత 4 యూనిట్ ప్రధాన మార్గం నుంచే ఈ గేటును బయటకు తీయాలని జెన్‌కో ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మనసుపడి.. మనువాడి!

ట్రాన్స్‌జెండర్లను ప్రేమించి పెళ్లి చేసుకుంటున్న యువకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న వారిలో ట్రాన్స్‌జెండర్ల వర్గమొకటి. ఈ వర్గంవారు ఎక్కువగా భిక్షాటన, ఇతర వృత్తుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారిపై ఆదరణ చూపేవారికన్నా చీదరించుకునే వారే అధికంగా ఉంటారు. ఇలాంటివారికి పెళ్లి భాగ్యం తక్కువే. సాధారణంగా ఇలాంటి వారిని పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రారు. కానీ ఇటీవల ట్రాన్స్‌జెండర్లను సైతం కొందరు యువకులు ప్రేమించిపెళ్లి చేసుకుంటున్నారు. కన్నవారిని, సమాజ కట్టుబాట్లను సైతం ఎదురిస్తూ ఇష్టపడిన వారిని మనువాడుతున్నారు. ప్రేమ అంటే పైకి కనిపించే శరీరం కాదని.. అది మనసుకు సంబంధించిన విషయమని అంటున్నాయి ఈ రకపుప్రేమ జంటలు.


మూడేళ్లపాటు ప్రేమించి..



అఖిల, రూపేశ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం అనంతతోగుకు చెందిన ట్రాన్స్‌జెండర్ అఖిల, భూపాలపల్లికి చెందిన రూపేశ్ మూడేళ్లపాటు ప్రేమించుకున్నారు. అయితే తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో వారిని ఎదురించి గత మార్చిలో ఇల్లెందులో హిందూ సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు. ప్రస్తుతం వారిద్దరూ కలసి ఉంటున్నారు. తమకు ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.

ఒకరినొకరు ఇష్టపడి..



దివ్య, అర్షద్

కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన ట్రాన్స్‌జెండర్ దివ్యను జగిత్యాలకు చెందిన అర్షద్ పెళ్లిచేసుకున్నారు. మొదట కొంతకాలం ఇద్దరూ కలిసే ఉన్నారు. ప్రేమలో ఉండి సహజీవనం చేశారు. చివరకు అర్షద్ తన ఇంట్లో వాళ్లను ఎదిరించి గతేడాది డిసెంబర్‌లో హిందూ సంప్రదాయం ప్రకారం దివ్యను వివాహం చేసుకున్నారు. తమకు ప్రభుత్వం ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

జాతరలో పరిచయమై..

2019లో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు వరంగల్ జిల్లాకు చెందిన ఓ ట్రాన్స్‌జెండర్‌ను ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకున్నాడు. మేడారం జాతరలో చిగురించిన వీరి ప్రేమ చివరకు పెళ్లికి దారి తీసింది. గతంలో కుటుంబాల్లో కట్టుబాట్లకారణంగా ఎక్కువగా బయటకురాని ఈ తరహా జంటలు.. ఇప్పుడు స్వేచ్ఛా సమాజం కారణంగా తమ విషయాలను ధైర్యంగా చెప్పగలుగుతున్నారు.

చట్టబద్ధత కోసం పోరాటం

దేశంలో తొలిసారిగా కేరళలో ఓ ఎల్‌జీబీటీ పెళ్లి జరిగింది. ఆ దంపతులు తమ పెళ్లిని రిజిస్టర్ చేసి చట్టబద్ధత కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ట్రాన్స్‌జెండర్ల పెళ్లిళ్లపై చర్చ మొదలైంది. ఎల్‌జీబీటీ హక్కుల చట్టంలో పెళ్లితో సహా, మరికొన్ని అంశాలు చేర్చాల నే పిటిషన్లు సుప్రీంలో విచారణలో ఉన్నాయి. తమకు అన్ని హక్కులు కల్పించాలని ట్రాన్స్‌జెండర్ల డిమాండ్.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.